ninadam.in
తెలుగు దినపత్రిక
# నినాదం
నిఖార్సైన జర్నలిజం
ఆదివారం 16 ఆగస్టు 2026 | సంపుటి: 22 | సంచిక: 319 | వెల: రూ.7 | పేజీలు: 12+12
Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


హర్మూజ్ జలసంధి
## ఇరాన్‌దే
ట్వీట్లతోనో, స్పీచ్‌లతోనే ఆక్రమించలేరు..
ట్రంప్ ప్రకటనపై ఇరాన్ కౌంటర్

**హర్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానన్న ట్రంప్**

**ట్రంప్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఇరాన్ మంత్రి కాజెమ్ గరీబాబాడీ**



2



నేడు తెరుచుకోనున్న
## శబరిమల ఆలయం
**తిరువనంతపురం,ఆగస్ట్15 (నినాదం):** కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారం తెరుచుకోనుంది. చింగం మాస పూజల నిమిత్తం ఆలయాన్ని తెరుస్తున్నామని, భక్తులకు సౌకర్యాలు కలిపించేందుకు ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డ్ (టీడీబీ), కేఎస్ఆర్‌టీసీ తగిన ఏర్పాట్లు చేస్తున్నాయని అధికారులు తెలిపారు.

# భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం




భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, అన్నిరంగాల్లో దూసుకుపోయే సమర్థత ఉందని ప్రధాని మోడీ అన్నారు. సవాళ్లు స్వీకరించి ముందుకు సాగడం ద్వారా మనమేంటో సత్తా చూపగలమన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోడీ యువత లక్ష్యంగా పలు కార్యక్రమాలను ప్రకటించారు. కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తామని, పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామన్నారు.
**న్యూఢిల్లీ (నినాదం):**

- అన్ని రంగాల్లో దూసుకు పోయే తత్వం
- సత్తా చాటగల నైపుణ్యాలు మన సొంతం
- యువత ఓ గంట సమయం కేటాయిస్తే చాలు
- జనగణనలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి
- దానితోనే దేశ అభివృద్ధి ప్రణాళికలు రచించగలం
- ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ పిలుపు
- ఎర్రకోట వేడుకలకు దూరంగా రాహుల్, ఖర్గే

2


దేశ భవిష్యత్ ప్రగతికి
## సరికొత్త దిశానిర్దేశం
ఆయా రంగాల్లో స్వయంసమృద్ధితో వికసిత భారత్ సాధ్యం
ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదకశక్తి కావడం తథ్యం
సప్తధార సందేశం ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ

6



గ్యాస్ ఈకెవైసికి నేటితో
## ముగియనున్న గడువు
గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీని చేసుకోవాలని, ఈనెల 16వ తేదీ సాయంత్రంతో గడువు ముగియనుంది. పలు కంపెనీలకు చెందిన గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు వినియోగదారులకు మెసేజ్‌లు, ఫోన్‌లు చేసి ఈకేవైసీని తప్పనిసరిగా చేసుకోవాలని, లేకుంటే గ్యాస్ రాదని స్పష్టంగా తెలియజేస్తున్నారు. ఇలా చేయకపోతే సబ్సిడీ రద్దవుతుందని, ఆంక్షలు విధించే అవకాశ ముందని పలువురు చర్చించుకుంటున్నారు.
**హైదరాబాద్,ఆగస్ట్15 (నినాదం)**

2




ప్రజల అవసరాలు గుర్తించి
## సంక్షేమ పాలన
**అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసం కృషి**
**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో డిప్యూటి సిఎం భట్టి**

తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు.
**ఖమ్మం,ఆగస్ట్15 (నినాదం)**

2



భాగ్యలక్ష్మి ఆలయం వద్ద
## లక్షమందితో వందేమాతరం
దమ్ముంటే అడ్డుకోవాలని ఎంఐఎంకు బండి సవాల్



పాతబస్తీ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్షలాది మందితో సామూహిక వందేమాతరం గీతాలాపన చేయిస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.
**హైదరాబాద్,ఆగస్ట్15 (నినాదం)**

2

కీలక బాధ్యతగా
# ఉద్యోగ నియామకాలు
ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

- గ్రూప్ పరీక్షలను సమర్థంగా నిర్వహించాం
- త్వరలోనే ఇంటర్‌నేషనల్ స్పోర్ట్స్ నిర్వహణ
- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం
- తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నాం
- గోల్కొండ కోట నుంచి సిఎం రేవంత్ ప్రసంగం

2



ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుందని, ఇప్పటి వరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్రూప్1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, మెగా డీఎస్సీ నియామకాలను విజయవంతంగా నిర్వహించి నియామక పత్రాలు అందించామని తెలిపారు. యువతకు నైపుణ్యం, ఉద్యోగాలు కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఐటీఐలు, పాలిటెక్నిక కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు.
**హైదరాబాద్,ఆగస్ట్15 (నినాదం):**



కృష్ణా-గోదావరి జలాల్లో
## రాజీపడే ప్రసక్తే లేదు
- సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది
- 31 నెలల కృషి ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి
- తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నాం
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటదన్న నమ్మకం
- అధికారంలోకి రాగానే 2లక్షల రుణామాఫీ చేపట్టాం
- గోల్కొండలో జెండా ఎగరేసిన సిఎం రేవంత్ రెడ్డి

2

సంగారెడ్డి సభలో రేవంత్
## అబద్ధాల ప్రచారం
**కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న పెద్దమనిషి: మండిపడ్డ హరీష్ రావు**



గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఖండించారు.
**సిద్దిపేట,ఆగస్ట్15 (నినాదం)**

2



దేశంలో ఎక్కడా
## సన్నబియ్యం పంపిణీ లేదు
89 లక్షల కార్డులను 2.80 కోట్లకు చేర్చాం
బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారాలు మానాలి
సంగారెడ్డి సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణలో ఇస్తున్నట్టు దేశంలో ఎక్కాడా కూడా సన్నబియ్యం పంపిణీ జరగడం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.
**సంగారెడ్డి,ఆగస్ట్15 (నినాదం)**

రేషన్ కార్డు కేవలం కాగితం కాదు..
పేదల ఆకలి తీర్చే
## ఆత్మగౌరవం
పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
విధ్వంసమైన తెలంగాణను వివేకవంతమైన తెలంగాణ మారుస్తున్నాం
గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం
ప్రభుత్వం మహిళా సాధికారితకు కట్టుబడింది
రాహుల్ రాముడు అయితే... ఆయన భక్తుడు హనుమంతుడు జగ్గారెడ్డి
జగ్గారెడ్డి ఎక్కడ పోటీ చేయాలో రాహుల్ గాంధీ నిర్ణయిస్తారు
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవానికి ప్రతీక అని ప్రజల సంక్షేమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి లోని అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్ లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.
**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 15 ( నినాదం)**

2



చేతిలో జాతీయ జెండా..
# గుండెలో బలమైన ఎజెండా
దేశంకోసం త్యాగం చేసిన వారి స్ఫూర్తితో ముందుకు సాగాలి



**అమరావతిలో తొలిసారిగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుక**
**జెండా ఆవిష్కరించి...ప్రసంగించిన సిఎం చంద్రబాబు**

2

**అమరావతి,ఆగస్ట్15 (నినాదం):** మన చేతిలో జాతీయ జెండా ఉండాలి.. మన గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజధాని అమరావతిలోని రాయపూడి పరేడ్ మైదానంలో తొలిసారిగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యమంత్రి హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు.ఏపీ రాజధాని అమరావతిలో తొలిసారిగా స్వాతంత్ర్య వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. రాయపూడిలోని పరేడ్ గ్రౌండ్‌లో స్వర్ణాంధ్ర-2047 థీమ్‌తో వేడుకలు నిర్వహించారు. రాజధానిలో జరుగుతోన్న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరై.. జాతీయ జెండాను ఆవిష్కరించారు.



స్త్రీశక్తి పథకానికి
## ఏడాది పూర్తి
**మహిళతో కలసి బస్సులో ప్రయాణించిన బాబు**
**పథకం అమలు తీరుతెన్నులపై మహిళలతో సంభాషణ**
**మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోందని వివరణ**

### చేతిలో జాతీయ జెండా..
## గుండెలో బలమైన ఎజెండా

సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుక జరిగే వేదిక వద్దకు సీఎం కాన్వాయ్‌తో బుల్లెట్ ఎస్కార్ట్ చేరుకుంది. ఈ సందర్భంగా సీఎంకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఆపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. పోలీసు దళాల గౌరవ వందనాన్ని ముఖ్యమంత్రి స్వీకరించారు. ఏపీఎస్పీ సహా వివిధ పోలీసు దళాల సన్నద్ధతను చంద్రబాబు సమీక్షించారు. అనంతరం పోలీసు బలగాలు, ఎన్సీసీ క్యాడెట్లు, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళం.. మార్చ్ పాస్ట్ నిర్వహించాయి. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులు సీఎంకు స్వాగతం పలికారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగు నేల కూడా స్వాతంత్ర్య సమరంలో తనదైన ముద్ర వేసిందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఏపీ ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యమని అన్నారు. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమేనన్నారు. దేశం మనకు హక్కులు, గుర్తింపు, గౌరవం తీసుకొచ్చింది. నా దేశం, నా బాధ్యత అని ముందుకు



సాగాలి. దేశం నాకు ఏం చేసిందని కాదు... దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలని కోరారు. 2047 నాటికి వికసిత్ భారత్... స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు... వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలన్నారు. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దామని చంద్రబాబు పిలుపునిచ్చారు.

### స్త్రీశక్తి పథకానికి
## ఏడాది పూర్తి

**అమరావతి,ఆగస్ట్15 (నినాదం):**
కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన స్త్రీశక్తి ఉచిత బస్సు పథకానికి నేటితో ఏడాది పూర్తైంది. మహిళల ఆర్థిక సాధికారత కోసం గతేడాది ఆగస్టు 15వ తేదీన స్త్రీశక్తి పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ సందర్భంగా స్త్రీశక్తికి సంవత్సరం– రెట్టింపైన ఆత్మగౌరవం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. రాజధానిలోని పరేడ్ గ్రౌండ్స్ నుంచి మహిళలతో బస్సులో ప్రయాణం చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. పరేడ్ గ్రౌండ్స్ నుంచి సీడ్ యాక్సెస్ రోడ్ మీదుగా సీఎం క్యాంప్ కార్యాలయం వరకు బస్సులో మహిళలతో కలిసి ముఖ్యమంత్రి ప్రయాణం చేశారు. స్త్రీశక్తి పథకం అమలు తీరు తెన్నుల గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. మహిళల కుటుంబ స్థితిగతులపై ఆరా తీశారు. ఓ మహిళా రైతుతో సంభాషించిన ముఖ్యమంత్రి... ప్రభుత్వం ఇచ్చే పథకాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. చేపలు అమ్ముకునే ఓ మహిళతో సీఎం మాట్లాడారు. స్త్రీశక్తి పథకం ద్వారా తనకు నెలకు రూ. 4 వేలు ఆదా అవుతోందని మత్స్యకార మహిళ తెలిపింది. మత్స్యకార మహిళ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు సీఎం. తనకు చేపల వ్యాపారం ఉందని... ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే లబ్ధితో మందులు కొనుగోలు చేస్తున్నట్టు సదరు మహిళ వెల్లడించింది. ఆరోగ్య అలవాట్లు మార్చుకుంటే అనారోగ్యం దరిచేరదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. ఆరోగ్యం మెరుగు అయితే.. సంపాదనను మందుల కొనుగోలు ఖర్చులను ఆదా చేసుకోవచ్చని చెప్పారు. స్త్రీశక్తి పథకం వల్ల తనకు నెలకు రూ. 1500 ఆదా అవుతోందని నంద్యాల నుంచి వచ్చిన ముస్లిం మహిళ తెలిపింది. స్త్రీశక్తి పథకం సహా తనకు మొత్తంగా నాలుగు పథకాలు అందుతున్నాయని మహిళ పేర్కొంది. అలాగే విద్యార్థినులకు స్త్రీశక్తి పథకం చాలా ఉపయోగంగా ఉందని ఓ యువతి వెల్లడించింది.

### భాగ్యలక్ష్మి ఆలయం వద్ద
## లక్షమందితో వందేమాతరం

ఎంఐఎం నేతలారా.. దమ్ముంటే అడ్డుకోండని సవాల్ విసిరారు. వందేమాతరం గీతాన్ని అవమానిస్తే 3 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా తప్పదన్నారు. చట్ట ప్రకారం వ్యవహరించే తమను మతతత్వవాదులంటారా అని మండిపడ్డారు. స్మార్ట్ రేషన్ కార్డులపై సీఎం, మంత్రుల ఫొటోలు ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మితే ఊడిపోయేదని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో సిద్ధరామయ్య హయాంలో రూ.వందల కోట్లతో తయారుచేసిన స్మార్ట్ కార్డులన్నీ నిరుపయోగమయ్యాయని గుర్తు చేశారు. తెలంగాణలో దాదాపు 2 కోట్ల మందికి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం ఇస్తోందన్నారు. రేషన్ కార్డులపై మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదో చెప్పాలన్నారు. కేంద్రం ఇచ్చే బియ్యం మీకు అవసరం లేదా అని ప్రశ్నించారు.

# భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం

పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే.. ఉచిత కోచింగ్ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యువత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.
'నేను అందరినీ ఒక ఫేవర్ చేయాలని అడుగుతున్నాను. ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ మాత్రం సమయం దేశాన్ని ఎలా బలోపేతం చేస్తుందా.. అని యువత ఆలోచిస్తూ ఉండొచ్చు. వారి భాగస్వామ్యంతో ప్రతి ఇంట్లో జనాభా గణనకు ఒక అనుకూల వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో ప్రజలు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోదీ పేర్కొన్నారు. అలాగే 'దిమాగీ నక్సల్స్' గురించి మాట్లాడుతూ.. వారిని దేశానికి కొత్త శత్రువులుగా అభివర్ణించారు. 'సంవత్సరాలుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశంలో బలంగా పాతుకుపోయారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. సాయుధ నక్సల్స్ కనుమరుగైనా.. 'దిమాగీ నక్సల్స్' మిగిలి ఉన్నారు. వారు ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలని సూచించారు. తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగం, గ్రీన్ అండ్ బ్లూ ఎకానమీ, ఇండియాస్ సాఫ్ట్ పవర్ కోసం 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను మోదీ ప్రకటించారు. మహిళా కోటా బిల్లుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. తన ప్రసంగంలో దాని ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రతిపక్షాలు విభేదాలను పక్కనపెట్టి.. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కోరారు. క్రెడిట్ వారే తీసుకున్నా పర్వాలేదని, కానీ బిల్లు పాసయి మహిళలకు గౌరవం దక్కాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. భారత్ ఇకపై చిన్న కలలతో ముందుకు వెళ్లలేదని, ఆలోచనా పరిధి విస్తృతం చేసుకునేందుకు ఉన్నత లక్ష్యాలు అవసరమని మోదీ పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు ప్రపంచం మన వైపు చూసే తీరే మారుతుందని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారపడి జీవించలేమని, స్వయం సమృద్ధి సాధించాలన్నారు. టెక ప్రపంచంలో చిప్‌ల విలువను భారతదేశం అర్థం చేసుకుంటోందని, అందుకే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. సమీప భవిష్యత్తులో మరిన్ని సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పుడు ప్రతిభారతీయుడు స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. అభివృద్ధి దిశగా దృఢ సంకల్పంతో పయనిస్తోన్న 140 కోట్ల మంది భారతీయులను ఆపడం అసాధ్యం అని పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సంభవించిన విపత్తుల గురించి ప్రస్తావించారు. బాధిత కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని సంఘీభావం తెలిపారు. దేశంలో 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తున్నాం. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తున్నాం. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం. వంద గిగావాట్ల అణు ఇంధనం సాధించడం మనలక్ష్యం అన్నారు. ఇటవలే హైడ్రోజన్ రైలును విజయంతంగా నడిపించాం. 90 ఏళ్లలో 30 శాతం మాత్రమే రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జరిగింది. 10 ఏళ్లలో 70 శాతం రైల్వే ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశాం. ఇటీవలే హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని అన్నారు. 50 లక్షల ఇళ్లకు సౌరశక్తి విద్యుత్ అందిస్తున్నాం. దేశంలో ఐదు న్యూక్లియర్ రియాక్టర్లు ఏర్పాటు చేస్తున్నామని మోదీ తెలిపారు.అయితే స్వాతంత్ర్య వేడుకల్లో ఈసారి కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. సీటింగ్, ఇతర ప్రొటోకాల్స్ వారి పదవులకు అనుగుణంగా ఉండటం లేదని కాంగ్రెస్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే.

### కీలక బాధ్యతగా
## ఉద్యోగ నియామకాలు

గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడమీ, యంగ్ ఇండియా డిజిటల్ ఎంపవర్‌మెంట్ అండ్ స్కిల్లింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే తెలంగాణ వేదికగా యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ 2026 నిర్వహించ బోతున్నామని చెప్పారు. గోల్కొండకోటలో త్రివర్ణ పతాకం ఎగురవేసిన సీఎం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, నిమ్స్‌లో 2,000 పడకల నూతన ఆసుపత్రి నిర్మాణంతో పాటు వరంగల్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. కొత్తగా 8 మెడికల్ కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే తొలి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ నిర్వహణ ఇందుకు నిదర్శనమని, ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5.18 లక్షల మందికి రూ.2,526 కోట్ల సాయం అందించామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులకు సరికొత్త సాంకేతికత, వనరులను అందిస్తున్నామని సీఎం చెప్పారు. సైబర్ నేరాలు, ఆహార కల్తీని ఎదుర్కొనేందుకు డ్రగ్స్ కంట్రోల్, సైబర్, ఆహార కల్తీ నియంత్రణ లను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నామని తెలిపారు. ఓఆర్ఆర్‌పై ప్రమాదాలు తగ్గించేందుకు హైవే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్లు, మహిళల భద్రతకు షీ టీమ్స్, పిల్లల అనుకూల న్యాయస్థానాల ఏర్పాటులో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల శ్రద్ధతో నిర్ణయాలు తీసుకుంటున్నా



మని, పీఆర్సీ, పెన్షను, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ వంటివి అమలు చేస్తున్నామని తెలిపారు. 36 సచివాలయ శాఖల్లో 100 శాతం ఈ–ఆఫీస్ అమలు చేశామని, ఈ నెల 17వ తేదీ నుండి అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో 'ప్రజావాణి' ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, చెరువుల పరిరక్షణకు 'హైడ్రా' ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని సీఎం వివరించారు. పారిశ్రామికంగా టీ–ఐడియా ద్వారా రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులు, తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్ ద్వారా రూ.5.75 లక్షల కోట్ల ఒప్పందాలు సాధించామని, 2025–26లో ఐటీ ఎగుమతులను రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించారు. తొలి సమగ్ర టూరిజం పాలసీ 2025 తీసుకువచ్చామని, సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్–2047' దిశగా అడుగులు వేస్తున్నామని, అందరి సహకారంతో రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని సీఎం ప్రసంగాన్ని ముగించారు.

### కృష్ణా-గోదావరి జలాల్లో
## రాజీపడే ప్రసక్తే లేదు

**హైదరాబాద్,ఆగస్ట్15 (నినాదం):**
తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ పడేది లేదని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతుల కళ్లలో ఆనందం చూస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గోల్కొండ కోటలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరై జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విద్య, వైద్యం.. ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశాలని తెలిపారు.సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం తమది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గోల్కొండ కోటపై సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ.. ఈ ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని.. తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నామన్నారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని నిర్ణయించామని తెలిపారు. రైతు బాగుంటేనే.. రాష్ట్రం బాగుంటుందన్న ముఖ్యమంత్రి.. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టామన్నారు. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లు పెట్టుబడి సాయం అందించామని చెప్పారు. అలాగే, రైతు సంక్షేమం కోసం రూ.లక్షా 70వేల కోట్లు, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని వివరించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రికార్డులు సృష్టించిందని తెలిపారు. కృష్ణా–గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించి తీరుతామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామన్నారు. త్వరలోనే పాలమూరు పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఇళ్లకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందజేశామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ఉన్నామని చెప్పుకొచ్చారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని,2 విడతల్లో 5.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లు నిర్మించి అందించనున్నామని తెలియజేశారు. దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన జరిగిందని.. తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేర్చిందని తెలిపారు. కొత్తగా 2.50లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం త్వరలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యా సూచీలో 21 నుంచి 14వ స్థానానికి తెలంగాణ చేరిందని రేవంత్ తెలిపారు. నియోజకర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. స్కూళ్లలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం పెడుతున్నామని, 100 కు పైగా తెలంగాణ పబ్లిక స్కూళ్లు నిర్మించే యోచనలో ఉన్నామని చెప్పారు. అక్రమాలు జరగకుండా ప్రక్షాళన చేశామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన

ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో నకిలీలను పూర్తిగా అరికట్టేందుకు ఈ కొత్త స్మార్ట్ కార్డులలో ఎన్క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, ప్రత్యేక హోలోగ్రామ్, వాటర్ మార్క్, యూవీ లోగో సహా 9 రకాల పటిష్టమైన భద్రతా ఫీచర్లను పొందుపరిచామని భట్టి అన్నారు. ఈ–పాస్ యంత్రాలతో బయోమెట్రిక విధానాన్ని అనుసంధానించి రేషన్ పంపిణీలో నూరు శాతం పారదర్శకతను తీసుకువస్తున్నామన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా 3.42 కోట్ల మందికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ సరికొత్త డిజిటల్ కార్డులు మంజూరు చేస్తూ, వాటి ద్వారా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాం.పేదలకు మెరుగైన వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కల సాకారం, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మన ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లేలా మన ప్రభుత్వం అడుగులు వేస్తోందని భట్టి తెలిపారు.

### గ్యాస్ ఈకెవైసికి
## నేటితో ముగియనున్న గడువు

దీంతో గ్యాస్ ఏజెన్సీల వద్దకు ఈకేవైసీని చేసుకునేందుకు వినియోగదారులు క్యూకట్టారు. అయితే శనివారం స్వాతంత్ర్య దినోత్సవం, ఆదివారం సెలవులు కావడంతో ప్రజలు సందేహంలో ఉన్నారు. ఏజెన్సీల నిర్వాహకులను వివరణ కోరగా.. శని, ఆదివారం వర్కింగ్ డేగా ఉందని తెలుస్తోందని, పై నుంచి తేదీని పెంచితే సెలవు ఉంటుందని తెలుపుతున్నారు. త్వరితగతిన ఏజెన్సీల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.




## రేషన్ కార్డు కేవలం కాగితం కాదు.. పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు నిత్యావసర సరుకులు అందించేందుకు రేషన్ షాపులను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు.
ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, అయితే పేదల సంక్షేమం కోసం గతంలో వారు ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని గతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు వాస్తవాలను చూడాలని అన్నారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. సన్నధాన్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు రూ.500/– బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా మొత్తాన్ని పెంచి ఏడాదికి రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు.
రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.21 వేల కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి అన్నారు.
గత 32 నెలల్లో రైతులు పండించిన ధాన్యానికి సంబంధించి రూ.90 వేల కోటను రైతుల ఖాతాలకు బదిలీ చేశామని చెప్పారు. రెండున్నరేళ్లలో రైతుల కోసం మొత్తం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు.
ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు,డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు భిన్నంగా తమ ప్రభుత్వం రెండేళ్లలో సుమారు 7 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం తెలంగాణలో ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.
ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు పెన్షన్లు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉన్న వారికి పెన్షన్లు అందిస్తామని



చెప్పారు.
రెండున్నరేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఉద్యోగ ఖాళీలను గుర్తించి భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిరుద్యోగ యువత మాయమాటలకు లోనుకాకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.
ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తూ ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల ఆశీర్వాదం తమ ప్రభుత్వానికి కొనసాగాలని కోరారు.
సంగారెడ్డిలో జగ్గారెడ్డి పోటీ చేయాలా వద్దా అన్నది ఆయన ఒక్కరి నిర్ణయం కాదని, కాంగ్రెస్ అగ్ర నాయకత్వం నిర్ణయిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. రాహుల్ గాంధీతో జగ్గారెడ్డికి ఉన్న అనుబంధాన్ని రాముడు–హనుమంతుడి సంబంధంతో పోల్చారు. ఎన్నికల్లో ఓడిపోయి
నప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల కోసం పనిచేస్తున్న జగ్గారెడ్డి వంటి నాయకుడు ప్రజా జీవితంలో ఉండాల్సిన అవసరం ఉందని, ఆయనకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. రాముడు ఆదేశిస్తే హనుమంతుడు పాటించాల్సిందే నని, జగ్గారెడ్డి ఇక్కడే పోటీ చేయాలి రాహుల్ గాంధీ నిర్ణయిస్తారన్నారు. నేను పూడి చేయను జగ్గారెడ్డి అనకూడదని ఆయన హితవు పలికారు. నిర్మల జగ్గారెడ్డి విషయంలో ఆయన మాట్లాడుతూ అక్కకు ఏది ఇవ్వాలో జగ్గారెడ్డి కేజీ వాళ్లు నాకు తెలుసు అన్నారు.
రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 1980లో మెదక్ జిల్లా ప్రజలు ఇందిరాగాంధీకి బ్రహ్మరథం పట్టారని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు పునాది పడిందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించడంలో ఇందిరాగాంధీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు.
మహిళా సాధికారతలో భాగంగా కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని అన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు.
సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రిని మంత్రి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ముందుకు సాగిందని, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. తెలంగాణను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేయాలన్న దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.
రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 తెలంగాణ చరిత్రలో ఒక ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోతుందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు అందించేందుకు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు.
రాష్ట్రంలో సుమారు 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు 1.06 కోట్ల రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డులోని ప్రతి కుటుంబ సభ్యునికి నెలకు 6 కిలోల చొప్పున ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డు మంజూరు ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.
జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నధాన్యం పండించే రైతులను ప్రోత్సహించేందుకు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్నధాన్యానికి బోనస్ చెల్లిస్తూ రైతులను ఆదుకుంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు.
యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపారు. టామ్‌టామ్ వంటి సంస్థల ద్వారా నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి స్థానిక ఐబీ వద్ద ఏర్పాటు చేసిన మాజీ ప్రధానులు పండిత్ జవహర్లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ లా విగ్రహాలను మంత్రులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, శాసనసభ్యులు సంజీవరెడ్డి, నవీన్ యాదవ్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్, మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి, నిర్మల జగ్గారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హర్మూజ్ జలసంధి ఇరాన్‌దే

**న్యూఢిల్లీ, ఆగస్ట్15 (నినాదం):**
అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ దేశాల మధ్య మాటల యుద్ధం ఒక్కసారిగా తీవ్రరూపం దాల్చింది. ఇరాన్‌తో జరుగుతున్న పోరులో విజయం సాధించిన అనంతరం హర్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ విదేశాంగ శాఖ అత్యంత ఘాటుగా స్పందించింది. అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ దేశాల మధ్య మాటల యుద్ధం ఒక్కసారిగా తీవ్రరూపం దాల్చింది.

## సంగారెడ్డి సభలో రేవంత్ అబద్ధాల ప్రచారం

సంగారెడ్డిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. దేశంలో స్వాతంత్య దినోత్సవం రోజునా చిల్లర మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రి మరొకరు ఉండరని విమర్శించారు. సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి హరీశ్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం 4:20 గంటలకు ప్రసంగం ప్రారంభించి 420 మాటలు మాట్లాడారని మండిపడ్డారు. ఆయన తన ప్రసంగంలో ఉమ్మడి మెదక జిల్లా గురించి ఒక్క మాటా మాట్లాడలేదని ధ్వజమెత్తారు. రేవంత్ చేతకానితనం వల్లే సింగూరు ఖాళీ అయిందని ఆరోపించారు.

## దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు

సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాటాడుతూ.. 3.42 కోట్ల మందికి రూ.14800 కోట్లతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే.. వాటిని 2.80 కోట్లకు పెంచామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు.. నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలోని నేతలు పదే పదే అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ, సుందిళ్ల నుంచి చుక్క నీరు తీసుకోకుండా దేశంలోనే ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణలో పండించామన్నారు. వరి కొనుగోళ్లలో రూ.90 వేల కోట్లు.. రైతుల ఖాతాల్లో వేశామని అన్నారు. ఈరోజు సంగారెడ్డి చరిత్రలోనే కాదు, తెలంగాణ చరిత్రలోనే ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోనుందన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుపేదలకు రేషన్ కార్డుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని వెల్లడించారు. కొత్తగా 16 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. హయాంలో రేషన్ కింద దొడ్డు బియ్యం ఇచ్చారని.. అప్పుడు ఆ బియ్యాన్ని ఎవరూ తినకుండా కిలో రూ.10కి అమ్ముకునే వారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసి వాటినే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నాణ్యత ఉన్న సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రోజు చరిత్రలో పండుగలా గుర్తుండిపోతుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 16 లక్షల కొత్త కార్డులు ఇచ్చాం. గతంలో రేషన్‌లో దొడ్డు బియ్యం వచ్చేవి. ఆ బియ్యాన్ని 80 శాతం మంది తినేవారు కాదు. కానీ, కాంగ్రెస్ సర్కార్ వచ్చాక సన్నబియ్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొంటున్నాం. మనిషికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వడం లేదు. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారి అర్హతలను పరిశీలించి కార్డులు ఇస్తాం అని ఉత్తమ్ తెలిపారు.

# పేదల చిరకాల స్వప్నం సొంతింటి కల సాకారం

- గొల్లగూడలో 552 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 15(నినాదం):** పేదల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.శనివారం ఆయన నల్గొండ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన 80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్న అనంతరం నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ ప్రాంతంలో నిర్మించిన 552 డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించడమే కాకుండా, లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. అంతేకాక అక్కడే ఏర్పాటుచేసిన సమావేశంలో లబ్ధిదారులందరికీ ఇంటి కేటాయింపు ఉత్తర్వులను పంపిణీ చేశారు. మాట్లాడుతూ 552 మంది లబ్ధిదారులకు ప్రతి కుటుంబానికి ఇంటి అవసరాల కోసం రూ.10 వేల చొప్పున తన సొంత నిధులతో ఆర్థిక సాయం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలివేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మరమ్మతులు చేయించి పేదలకు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇళ్లతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీ, నీటి కనెక్షన్లు వంటి మౌలిక వసతులను కూడా కల్పించామని చెప్పారు. తిప్పర్తి--మునుగోడు రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు, దుప్పలపల్లి రోడ్డు, దేవరకొండ రోడ్డు లలో స్థలాలను పరిశీలించడం జరిగిందని, అర్హులైన పేదలకు 75 గజాల స్థలం ఇచ్చి రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.గత ఏదాది సుమారు 700 మంది లబ్ధిదారులకు రూ.5 లక్షల చొప్పున ఇళ్లు నిర్మించి ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ సభ్యులు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి,జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, ,డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆఫీస్ ఖాన్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవో అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ లోకి లాల్ రాజ్ కుమార్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ పరుశురాం, స్థానిక కార్పొరేటర్ జ్ఞానేశ్వరి మాజీ జెడ్పిసి గుమ్మల మోహన్ రెడ్డి. గృహ నిర్మాణ అధికారి డి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

# 9 భద్రతా ఫీచర్‌లతో స్మార్ట్ రేషన్‌కార్డులు

- ముఖ్యమంత్రి నుండి సాధారణ పౌరుడి వరకు సన్నబియ్యమే తింటున్నారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 15(నినాదం):** రాబోయే కాలంలో పేదవారికి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. శనివారం నల్గొండ కలెక్టరేట్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 3.40 కోట్లమందికి ప్రతి ఒక్కరికి కేజీ 50 రూపాయలు పైగా విలువ చేసే నాణ్యమైన 6 కేజీల సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నాం. నల్గొండ జిల్లాలో నూతనంగా 81279 రేషన్ కార్డులు ఇవ్వడం ద్వారా 2,38,171 మందికి లబ్ది చేకూరిందని అన్నారు.నల్గొండ పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హత ఉండాలంటే రేషన్ కార్డు ఉండాలని, ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని. తెలిపారు. ప్రతి రేషన్ కార్డుదారుకు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు.నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత పది ఏండ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డు ఇవ్వడంతో పాటు, ప్రభుత్వం ప్రతి ఒక్కరూ తినేలా సన్న బియ్యం పంపిణీ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ సి శంకర్ నాయక్, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డిఓ అశోక్ రెడ్డి డి.ఎస్.ఓ వెంకటేశ్వర్లు, డిఎం రాంపతి నాయక్, చౌకధర దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

# రేషన్‌కార్డుల పంపిణీతో పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా

- ప్రజా ప్రభుత్వంలో పేద కుటుంబాలకు అండగా ఉంటా..
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, ఆగస్టు 15 (నినాదం):** రేషన్ కార్డుల పంపిణీలో ప్రజా ప్రభుత్వం అర్హులైన నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ,జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు లతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో పేదలకు కొత్త రేషన్ కార్డులు, ఇళ్లు, సంక్షేమ పథకాలు అందిన పరిస్థితి ఏమిటో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని అన్నారు. రేషన్ కార్డులు లేక అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు అందించడం సంతోషకరమైన విషయమని నాయిని అన్నారు. కొత్త రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేయడం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువవుతాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉచిత విద్యుత్ సహా అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో తొలి విడతగా 3,500 ఇళ్లు, రెండో విడతగా మరో 2,000 ఇళ్లను మంజూరు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంటోందని, పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రేషన్ కార్డుపై ముఖ్యమంత్రి ఫొటోపై కొందరు రాజకీయ విమర్శలు చేయడాన్ని నాయిని తప్పుబట్టారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వాన్ని గుర్తు చేసుకోవడంలో తప్పేమీ లేదన్నారు. గత పదేళ్లలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలు ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలోనే అనేక హామీలను అమలు చేసిందని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా అభివృద్ధిలో ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంతో జిల్లా వేగంగా ముందుకు సాగుతోందని నాయిని తెలిపారు. రాబోయే కాలంలో మిగిలిన హామీలు, సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రభుత్వం పూర్తి చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ రవి, ఆర్డీఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. న్యాయవ్యవస్థ ద్వారా ప్రజలకు న్యాయం అందించడంలో న్యాయవాదులు, సిబ్బంది మరింత బాధ్యతతో పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, గవర్నమెంట్ ప్లీడర్ బొట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎ. రాములు, పీపీ ఏదులాపురం శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. అక్షయ, అడిషనల్, అసిస్టెంట్ జీపీలు బల్లా మహేందర్, ఇందారపు శివకుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితవాణి, సూపరింటెండెంట్ రఘురాం, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేస్తాం

- ఎమ్మెల్యే నాగరాజు



**హనుమకొండ ఆగస్టు 15, (నినాదం):** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం హన్మకొండలోని అంబేద్కర్ భవన్ లో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గార్లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే పేదల ముఖంలో చిరునవ్వులు పూయిస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,గృహ జ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసానిచ్చిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తాజాగా శనివారం నుంచే లబ్ధిదారులకు ఉచిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ శ్రీకారం చుట్టడం రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తూ, ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి, నాయకులు,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బండి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నియోజకవర్గవ్యాప్తంగా పతాకావిష్కరణ



**కూకట్‌పల్లి, ఆగస్టు 15 (నినాదం) :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్లాపూర్, మోతీనగర్, ప్రశాంతి నగర్, కూకట్‌పల్లి, దయార్‌గూడ, కేపీహెచ్‌బీ రోడ్ నంబర్1, భరత్ నగర్ మార్కెట్, కైతలాపూర్‌లోని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, బాలానగర్, ఓల్డ్ బోయినపల్లి, హస్మత్‌పేట్, కేపీహెచ్‌బీ ఫోరంమాల్ సమీపంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ ప్రాంతాలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను ఈ సందర్భంగా ఘనంగా స్మరించుకున్నారు. దేశ సమైక్యత, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం మనందరి ప్రథమ కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.


## Filatex Fashions Ltd

(CIN- L51491TG1994PLC017158) రిజిస్టర్డ్ ఆఫీస్: డోర్ నెం 1-80-40-ఎస్‌పి-58-65, శిల్పా హోమ్స్ లేఅవుట్, గచ్చిబౌలి కె.వి.రంగారెడ్డి, శేరిలింగంపల్లి, తెలంగాణ, ఇండియా, 500032 ఇ-మెయిల్: unisox@yahoo.com

**30 జూన్, 2026 నాటి త్రైమాసికపు ముగింపు కొరకు ఆడిట్‌అయిన స్వతంత్ర & ఏకీకృత ఆర్థిక ఫలితాల యొక్క సారాంశం**

(రూ. లక్షలలో)

| క్ర. సం. | వివరములు | స్వతంత్ర | | | | ఏకీకృత | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | త్రైమాసికపు ముగింపు | | | సంవత్సర ముగింపు | త్రైమాసికపు ముగింపు | | | |
| | | 30.06.2026 (ఆడిట్ కాని) | 31.03.2026 (ఆడిట్ అయిన) | 30.06.2025 (ఆడిట్ కాని) | 31.03.2026 (ఆడిట్ అయిన) | 30.06.2026 (ఆడిట్ కాని) | 31.03.2026 (ఆడిట్ అయిన) | 30.06.2025 (ఆడిట్ అయిన) | 31.03.2026 (ఆడిట్ అయిన) |
| 1 | ఆపరేషన్స్ నుండి రెవెన్యూ | 1,999.74 | 2,207.80 | 4,497.53 | 11219.33 | 1,999.74 | 2,295.65 | 4 ,622.46 | 11,544.23 |
| 2 | ప్రస్తుత కాలానికి నికర లాభం / (నష్టం) (పన్ను, మినహాయించిన మరియు/లేదా అసాధారణ ఐటమ్స్ పూర్వము) | 41.30 | 40.18 | 168.96 | 372.84 | 41.26 | 39.81 | 170.97 | 376.52 |
| 3 | ప్రస్తుత కాలానికి నికర లాభం/ (నష్టం) పన్నుకు పూర్వము, (మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 41.30 | 40.18 | 168.96 | 372.84 | 41.26 | 39.81 | 170.97 | 376.52 |
| 4 | ప్రస్తుత కాలానికి నికర లాభం/ (నష్టం) పన్ను తర్వాత (మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 30.91 | 32.68 | 141.23 | 280.49 | 30.87 | 31.36 | 142.72 | 283.21 |
| 5 | ప్రస్తుత కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం (ప్రస్తుత కాలానికి లాభం/(నష్టం) (పన్ను తర్వాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తర్వాత) కలిగివున్నాయి) | 30.91 | 32.68 | 141.23 | 280.49 | 30.87 | 31.36 | 142.72 | 283.21 |
| 6 | చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ ఒక్కొక్కటి రూ. 10/-) | 83,340.73 | 83,340.73 | 83,340.73 | 83,340.73 | 83,340.73 | 83,340.73 | 83,340.73 | 83,340.73 |
| 7 | రిజర్వులు (రివాల్యుయేషన్ రిజర్వు మినహాయించి) క్రితం సంవత్సరం ఆడిట్ చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపిన విధంగా | 1,48,106.53 | 1,47,826.04 | 1,47,826.04 | 1,47,826.04 | 1,48,113.74 | 1,47,830.57 | 1,47,830.57 | 1,47,830.57 |
| 8 | ఒక వాటాకు ఆదాయములు (ఒక్కొక్కటి రూ. 10/-) (కొనసాగుతున్న ఆపరేషన్ల కొరకు) | 0.0004 | 0.0004 | 0.0017 | 0.0034 | 0.0004 | 0.0004 | 0.0020 | 0.0034 |
| | బేసిక్ & డైల్యూటెడ్ | 0.0004 | 0.0004 | 0.0017 | 0.0034 | 0.0004 | 0.0004 | 0.0020 | 0.0034 |


పై ఫలితాలకు సాధారణ గమనికలు:
1. 30 జూన్ 2026తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన స్వతంత్ర మరియు ఏకీకృత ఆర్థిక ఫలితాలను ఆడిట్ కమిటీ సమీక్షించింది మరియు 14 ఆగస్టు 2026న జరిగిన వారి సంబంధిత సమావేశాలలో డైరెక్టర్ల బోర్డు ఆమోదించింది మరియు లిస్టింగ్ నిబంధనల ప్రకారం అవసరమైన విధంగా చట్టబద్ధ ఆడిటర్లచే సమీక్షించబడ్డాయి.
2. కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 133 క్రింద నిర్దేశించిన Ind AS మరియు ఇతర వర్తించే అకౌంటింగ్ సూత్రాలు మరియు పద్ధతులకు అనుగుణంగా ఆర్థిక ఫలితాలు తయారు చేయబడ్డాయి.
3. Ind AS 108కు అనుగుణంగా, కంపెనీ ఒకే నివేదించదగిన విభాగంలో, అంటే వస్త్ర వస్తువుల తయారీ మరియు వ్యాపారంలో పనిచేస్తుంది.
4. ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించిన ఆర్థిక నివేదికలు మరియు 30 జూన్ 2025 మరియు 30 సెప్టెంబర్ 2025తో ముగిసిన త్రైమాసికాలకు సంబంధించిన ఆర్థిక సమాచారం మునుపటి ఆడిటర్‌చే ఆడిట్ చేయబడినది/సమీక్షించబడ్డాయి.
5. యాజమాన్యం సమర్పించిన ఆర్థిక నివేదికలు మరియు ఆడిట్ నివేదిక ఆధారంగా, ఏకీకృత ఆర్థిక ఫలితాలలో ఒక అనుబంధ సంస్థ యొక్క ఆర్థిక ఫలితాలు కూడా చేర్చబడ్డాయి.
6. యాజమాన్యం గ్రాట్యుటీ బాధ్యతను మరియు దాని పర్యవసాన ప్రభావాన్ని ఏవైనా ఉంటే పునఃసమీక్షిస్తున్నందున, 30 జూన్ 2026తో ముగిసిన త్రైమాసికానికి గ్రాట్యుటీ బాధ్యత కోసం ఎటువంటి కేటాయింపు చేయబడలేదు.
7. అవసరమైన చోట గత కాలపు సంఖ్యలు రీగ్రూప్ చేయబడినవి/పునఃవర్గీకరించబడ్డాయి.
8. ఫలితాలు BSE లిమిటెడ్ వారి www.bseindia.com & NSE లిమిటెడ్ వారి www.nseindia.com వెబ్‌సైట్‌తో పాటు కంపెనీ వెబ్‌సైట్ www.filatexfashions.co.in వద్ద కూడా లభిస్తాయి.

బోర్డు కొరకు మరియు తరఫున
ఫిలటెక్స్ ఫ్యాషన్స్ లిమిటెడ్ తరఫున
సం/- ప్రభాత్ సెథియా
మేనేజింగ్ డైరెక్టర్ & CFO
DIN: 00699415

ప్రదేశము: హైదరాబాద్
తేది: ఆగస్టు 16, 2026


# యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం

- కార్గిల్ యుద్ధ వీరుడు హవిల్దార్ మహ్మద్ రహమతుల్లాకు సన్మానం





**మహబూబ్‌నగర్, ఆగస్టు 24, (నినాదం):** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహబూబ్‌నగర్ ప్రాంతీయ కార్యాలయంలో భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత దేశభక్తి, ఉత్సాహం మరియు గౌరవప్రదమైన వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ ఐక్యతా స్ఫూర్తిని చాటుతూ, దేశ స్వేచ్ఛ, సార్వభౌమత్వాల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించేలా ఈ కార్యక్రమం సాగింది. తొలుత యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహబూబ్‌నగర్ రీజినల్ హెడ్ డి. వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, అనంతరం సిబ్బంది అంతా కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డి. వెంకటేశ్వర్లు స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను వివరించడంతో పాటు, ఆర్థిక సమ్మిళితం, వినియోగదారుల కేంద్రిత బ్యాంకింగ్ సేవలు మరియు సామాజిక అభివృద్ధి కార్యక్రమాల ద్వారా దేశ నిర్మాణంలో బ్యాంక్ అందిస్తున్న నిరంతర సేవలను, నిబద్ధతను నొక్కి చెప్పారు. స్వాతంత్ర్య వేడుకలతో పాటే 1999 కార్గిల్ యుద్ధంలో భారత సాయుధ దళాల ధైర్యసాహసాలు, త్యాగాలను స్మరిస్తూ కార్గిల్ విజయ్ దివస్‌ను కూడా పురస్కరించుకున్నారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో దేశాన్ని కాపాడిన వీర జవాన్లకు ఈ వేదిక ద్వారా సముచిత నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట కార్గిల్ యుద్ధ వీరుడు హవిల్దార్ మహ్మద్ రహమతుల్లాను ఆయన అసమాన దేశసేవ, అంకితభావానికి గుర్తింపుగా ఘనంగా సన్మానించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం రీజినల్ అస్యూరెన్స్ హెడ్ ఎ. మురళీకృష్ణ మాట్లాడుతూ, సాయుధ దళాల త్యాగాలను కొనియాడుతూ, దేశం పట్ల అంకితభావం, ప్రేమ, ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన ఒక యుద్ధ వీరుడిని సత్కరించుకోవడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఉద్యోగులందరూ కూడా తమ వృత్తిపరమైన బాధ్యతలను అదే విధమైన నిబద్ధత, నిజాయితీలతో నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రాంతీయ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్య సమరయోధులకు, సాయుధ దళాలకు శ్రద్ధాంజలి ఘటించారు. చివరగా కృతజ్ఞతా వందనంతో పాటు అత్యుత్తమ సేవ, నిజాయితీ, సామాజిక బాధ్యతలతో దేశ సేవను కొనసాగిస్తామని బ్యాంక్ వర్గాలు పునరుద్ఘాటించడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## హైదరాబాద్ ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్, ఆగస్టు 24, (నినాదం):** హైదరాబాద్‌లోని కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థానిక ప్రధాన కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది జాతీయ జెండాను ఆవిష్కరించగా, హాజరైన వారంతా జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన నీలేష్ ద్వివేది, త్రివర్ణ పతాకం భారత విశిష్ట వారసత్వానికి, లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు మరియు నూట నలభై కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలకు ప్రతీక అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యంతో పాటు బాధ్యత కూడా పెరుగుతుందని, దేశ ప్రగతితో ఎస్‌బీఐ ప్రస్థానం ముడిపడి ఉందని ఆయన వివరించారు. నేడు భారత్ ఆత్మవిశ్వాసం, ఆశయాలతో ముందుకు సాగుతున్న తరుణంలో, ఖాతాదారుల మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఎస్‌బీఐ కూడా ఆధునిక సాంకేతికతతో రూపాంతరం చెందుతోందని చెప్పారు. ముఖ్యంగా 'యోనో' (యాప్) వంటి డిజిటల్ సేవలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా కస్టమర్ అనుభవాన్ని, పనితీరును మెరుగుపరుస్తూ బ్యాంక్ సమర్థవంతంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. ఎస్‌బీఐ ఉద్యోగులు మరింత అంకితభావంతో పనిచేసి సంస్థను మరింత బలోపేతం చేయాలని, భవిష్యత్ భారత అవసరాలకు అనుగుణంగా బ్యాంక్‌ను నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించగా, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను, వారి పిల్లలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ రష్మి ద్వివేది, జనరల్ మేనేజర్లు సతీష్ కుమార్, రణవిజయ్ ప్రతాప్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎస్.వి సుబ్బయ్య



**హైదరాబాద్, ఆగస్టు 24, (నినాదం):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సిటీ సివిల్ కోర్టు ఆవరణలో జ్యూడిషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి ఎస్.వి. సుబ్బయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, వజ్రం,సాయి కుమార్, ప్రసాద్, సురేందర్, ఉదయ్, వర్మ, కృష్ణ యాదవ్, నరేష్ యాదవ్, రాకేష్, మనీష్, చైతన్య, సంధ్యారాణి, స్వప్న, సుధ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**చింతపల్లి, ఆగస్టు 15 ( నినాదం) :** మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద తాసిల్దార్ పడాల విజయలక్ష్మి, స్థానిక గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ కాసారపు శ్వేతా శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో సుజాత, మాల్ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద చైర్మన్ దంతం అలివేలు సంజీవరెడ్డి, పిఎసిఎస్ కార్యాలయం వద్ద చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై ముత్యాల రామ్మూర్తి, ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిడిపిఓ సక్కుబాయి, ప్రాథమిక ఆరోగ్య కార్యాలయం వద్ద డాక్టర్ శ్రీదేవి, రైతు వేదిక వద్ద ఏవో శ్రావణ కుమారి, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏఈ మురళీకృష్ణ, ఎంఆర్సి బిల్డింగ్ వద్ద ఎంఈఓ నీరుడు అంజయ్య, వెలుగు కార్యాలయం వద్ద మండల సమాఖ్య అధ్యక్షురాలు మానుపాటి మమత, తదితరులు మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## అమరుల త్యాగాల ఫలితమే మనకు స్వేచ్ఛ

– జెండాను ఆవిష్కరించిన కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు నాగండ్ల.



**ఖమ్మం, ఆగస్టు 15(నినాదం ):** ఎందరో త్యాగాలు ఫలితమే మన దేశానికి స్వేచ్ఛ వచ్చిందని, ఈ స్వేచ్ఛ వాయువును అందరూ సద్వినియోపరుచుకొని దేశానికి మరింత సేవ అందించాలని ఖమ్మం కాంగ్రెస్ నగర పార్టీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి అన్నారు. శనివారం స్వాతంత్ర 80 వసంతాలు జరుపుకుం టున్న సందర్భంగా, ఖమ్మం నగర పరిధిలోని రోటరీ నగర్ ఐ ఎన్ టి యు సి ఆటో యూనియన్ ఏర్పాటుచేసిన జాతీయ జెండాను ఆయన ఎగరవేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగండ్ల మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోపరుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ ఖాదర్ బాబు, మాజీ కార్పొరేటర్లు మురళి. నాగుల్ మీరా, నాగేశ్వరరావు, దండా ప్రసాద్, కొత్త రవి, నాగయ్య, యాకుబ్ పాషా, కూచిపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


## జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల అమలు
జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.



**గద్వాల బ్యూరో ఆగస్టు 15( నినాదం ):** జోగులాంబ గద్వాల జిల్లా అభివృద్ధికి అధికారులం దరూ సమిష్టిగా కృషి చేయాలని, అర్హులైన వారం దరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం ఐడిఓసి ఆవరణ వద్ద జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ముందుగా కలెక్టర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న వారందరికీ, ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఏమైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకుంటూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ముందుకెళ్లాలన్నారు. గాంధీజీ, నెహ్రూజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, తదితర ఎంతో మంది మహనీయుల త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్య, ప్రజాస్వామిక దేశంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. జోగులాంబ గద్వాలను వెనుకబడ్డ జిల్లా అనే పేరును రూపు మాపేందుకు పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి జిల్లా అనేక రంగాల్లో రాష్ట్రంలోనే ముందంజలో ఉండేలా పనిచేస్తామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో కుటుంబ సభ్యులు, క్యాంపు కార్యాలయ సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో మంజుల, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మెడికల్ కళాశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 15 (నినాదం) :** నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ డా.ఎన్. కృష్ణమోహన్ జాతీయ జండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, క్రమశిక్షణ, బాధ్యత, దేశభక్తి, నైతిక విలువలు, సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాములు, వైస్ ప్రిన్సిపాల్ డా.సునీల్, డా.దినేష్, ఎడి. రమాదేవి, మధుసూదన్, కళాశాల సూపరింటెండెంట్ పెద్దోళ్ళ నాగరాజు, సుజాత, గాయత్రి, జ్యోతి, సాయిబాబా, రంజిత్, రవిచంద్ర, యూజీ,పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశ ఐక్యత సమగ్రత కోసం పాటుపడాలి..

పలు ప్రాంతాల్లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 15 (నినాదం) :** ప్రతి ఒక్కరు దేశ ఐక్యత, సమగ్రత కోసం పాటుపడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు అసోసియేషన్ల కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తొలిసారి పూర్తి వందేమాతరం గీతాన్ని పాడాలని చట్టం తీసుకురావడం మంచి పరిణామం అన్నారు. ఇకపై ఎక్కడైతే జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారో అక్కడ పూర్తి వందేమాతరం ఆలపించాలని కోరారు. స్వాతంత్ర సమరయోధుల పోరాట స్ఫూర్తితో దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఆనాటి అమరుల త్యాగాల వల్లే స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామని పేర్కొన్నారు. 2047 వరకు వికసిత్ భారత్ సాధించేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. జాతీయ సమైక్యత, దేశ భద్రత, స్వదేశీ ఆత్మ విశ్వాసం దిశగా ముందుకు సాగాలన్నారు. మొదటగా బస్ స్టాండ్ ఆవరణలోని ఆటో స్టాండ్ అసోసియేషన్, అనంతరం లలిత కాంప్లెక్స్‌లోని మొబైల్ షాప్స్ అసోసియేషన్, అనంతరం క్యాంపు కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే సన్ రైజ్ హాస్పిటల్ లో జాతీయ జెండాను ఎగురవేశారు. కాగా బీజేపీ జిల్లా కార్యాలయం, కార్పొరేషన్ కార్యాలయంలో, పరేడ్ మైదానంలో జరిగిన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్య ఫలాలు

– టీయుడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మైసా పాపా రావు



**ఖమ్మం, ఆగస్టు15(నినాదం):** మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మైసా పాపా రావు పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఐజేయూ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం జాతీయ పతాకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మైసా పాపారావు మాట్లాడుతూ అనేకమంది వీరులు చేసిన త్యాగ ఫలితంగానే స్వాతంత్రం సిద్ధించిందన్నారు. వారి ఆశయాలు మనకు ఆదర్శమని, వారు చూపిన బాటలో అందరూ నడవాలని సూచించారు. ప్రజల పక్షాన జర్నలిస్టులు నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్ పని చేస్తుందన్నారు. అనంతరం యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, సీనియర్ నాయకులు మోహిద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, జిల్లా నాయకులు ఏలూరి వేణు, పిన్ని సత్యనారాయణ, శివాజీ, రమేష్, జి.నాగేశ్వరరావు, జి.రామారావు, నాగేశ్వరరావు, ఇంద్రసేన, సురేష్, ప్రెస్ క్లబ్ నాయకులు క్రాంతి కుమార్, పిచ్చయ్య, నాగ చారి తదితరులు పాల్గొన్నారు.

## సమానత్వం, సామాజిక న్యాయంతోనే సమగ్ర అభివృద్ధి

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి







**నాగర్‌కర్నూల్, ఆగస్టు 15 (నినాదం) :** తెలంగాణ రాష్ట్రం ఏ ఆశయంతో ఏర్పడిందో ఆ దిశగా స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికన అన్ని వర్గాల ప్రజలకు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నాగర్‌కర్నూల్ పోలీస్ పెరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకలకు చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కట్టుబడి ఉందని, ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎమ్మెల్యేలు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, డీఎఫ్ఓ రేవంత్ చంద్ర, ఎఫ్‌డీఓ చంద్రప్రకాష్, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయం తదితరులు పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

తాడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులను కళారూపంలో ఆవిష్కరిస్తూ ప్రదర్శన ఇచ్చి మొదటి బహుమతి పొందారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు భారత సైనికుల సాహసాలను ప్రతిబింబించే ప్రదర్శనతో రెండో బహుమతి సాధించారు. నాగర్‌కర్నూల్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులు 'సమైక్య భారతం--సమగ్ర భారతం' గేయానికి నృత్య ప్రదర్శన ఇచ్చి మూడో బహుమతి పొందారు. తెలకపల్లి కేకే రెడ్డి ఉన్నత పాఠశాల, కల్వకుర్తి మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు కూడా దేశభక్తి గీతాలకు నృత్య ప్రదర్శనలు ఇచ్చి అలరించారు. విద్యార్థులను ముఖ్య అతిథి, ఎంపీ, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు అభినందించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమాలను విజయవం తంగా నిర్వహించిన జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్‌ను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్య అతిథి, ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యేలు సందర్శించారు. ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ సినిమా శేఖరయ్య సతీమణి అంబటి లీలావతిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో అర్చన, డీఎస్పీలు, జిల్లా అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, గ్రంథాలయ చైర్మన్, ప్రజాప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య స్ఫూర్తితో సమానత్వం కోసం మరో పోరాటం

ఆర్థిక, సామాజిక వివక్షతలు లేని సమాజం కోసం పోరాడాలి: తమ్మినేని వీరభద్రం



**కొత్తగూడెం, ఆగస్టు 15(నినాదం)** స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం కల్పించేందుకు మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలోని మంచి కంటి భవన్ వద్ద ఆయన త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ రాజ్యాంగం హామీ ఇచ్చిన ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం ప్రజలందరికీ పూర్తిస్థాయిలో అందలేదన్నారు. పేదరికం, నిరుద్యోగం, విద్యా, వైద్య సమస్యలు కొనసాగుతున్నాయని, రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తిదారులు, పట్టణ కార్మికులు దోపిడీకి గురవుతున్నారని అన్నారు. దేశంలో భారీ యువ జనాభా ఉన్నప్పటికీ తగిన ఉపాధి అవకాశాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు, ప్రభుత్వాల మార్పు జరుగుతున్నా సామాన్య ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పు రావడం లేదన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలకు తోడు మతోన్మాదం పెరుగుతోందని విమర్శించారు. ప్రజలు ఆర్థిక సమస్యలపై ఐక్యంగా పోరాడకుండా మతం, కులం, ప్రాంతం, జాతి పేరుతో విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ శక్తుల దోపిడీకి వ్యతిరేకంగా సోషలిస్టు భావజాలాన్ని, మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాజకీయ ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, కె. బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ రవికుమార్, ఎలమంచిలి వంశీ, భూక్య రమేష్, కొండబోయిన వెంకటేశ్వర్లు, తులసిరామ్, సత్య, నందిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులను స్మరించుకోవాలి..


విశ్రాంత ఉద్యోగుల సంఘం నాగర్కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీధర్



**నాగర్ కర్నూల్ ఆగస్టు 15 (నినాదం) :** దేశ స్వతంత్రం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయులను స్మరించుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎన్ శ్రీధర్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయం రాధాకృష్ణ భవన్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం విశ్రాంత ఉద్యోగుల సంఘం నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీధర్ గాంధీజీ, అంబేద్కర్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా. ఆయన మాట్లాడుతూ. ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే మన దేశానికి స్వాతంత్ర్యం లభించిందని అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదురించి దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయులను స్మరించుకోవాలని, వారి త్యాగాలను ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశెట్టి , మండలశాఖ అధ్యక్షులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి కార్యదర్శి యుగంధర్ రెడ్డి,నర్సయ్య, వార్డెన్ చెన్నయ్య, వేణుగోపాల్, పోలా శ్రీనివాసులు, యశోద, సంజీవ గౌడ్ తో పాటు పలువురు విశ్రాంత ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రానున్న రోజుల్లో విద్యార్థులు ఉన్నత స్థానాలలో రాణించాలి

ట్రిబుల్ ఐటీ కి ఎంపికైన విద్యార్థులకు చెక్కు అందజేసిన సర్పంచ్



**కల్వకుర్తి ఆగస్టు 15 (నినాదం):** కల్వకుర్తి మండలం లోని మార్చాల గ్రామంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలో పాల్గొన్న సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి, అనంతరం గత సంవత్సరం 10వ తరగతి IIIT కి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, వారి ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో కీర్తి పౌల్ట్రీ ఫార్మ్స్ ఆధ్వర్యంలో తలసాని శ్రీనివాస్ రెడ్డి,తలసాని కృష్ణరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి మరియు రాజవర్ధన్ రెడ్డి కలిసి ట్రిబుల్ ఐటీ కి ఎంపికైన నలుగురు విద్యార్థులను అభినందించి విద్యార్థులకు ఒక్కొక్కరికి 10,000 చొప్పున, 40,000 వేల రూపాయలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం, వారు ఉన్నత విద్యలో మరింత ముందుకు సాగేందుకు తోడ్పాటు అందించడం జరుగుతుంది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి , ఉప సర్పంచ్ నిజాముద్దీన్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట చిరంజీవి, మాజీ మార్కెట్ చైర్మెన్ వట్టేపు బాలయ్య, మాజీ వార్డు సభ్యులుగౌస్, సత్యపాల్, యువ నాయకులు శ్రీను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మరియు ఇతర ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

### ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కల్వకుర్తి ఆగస్టు15 (నినాదం):** తలకొండపల్లి మండల కేంద్రంలోని ఉప్పల ఆశ్రమ పాఠశాలలో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఉప్పల ఆశ్రమ విద్యాలయం చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ , ఉప్పల అఖిల్ పాల్గొనడం జరిగింది. ఉప్పల బాలికల ఆశ్రమ పాఠశాల కళాశాల నందు ఎంతో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించటంతో పాటు బాలికల యొక్క ప్రభాతభేరి వారి నృత్యాలు దేశభక్తిని చాటే విధంగా ఉన్నా యని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఉప్పల అఖిల్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరి ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనడం జరిగింది.

### నిర్మల హృదయ హైస్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 15 (నినాదం) :** నగరంలోని సుభాష్ నగర్ లో గల నిర్మల హృదయ హై స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, క్రమశిక్షణ, ఉత్సాహం, వైభవంతో అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఎన్ సీసీ అధికారి జనరల్ కల్నల్ ప్రేమ్ జిత్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ డా. సిస్టర్ నిర్మల, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెవరెండ్ సిస్టర్ సరిత సింగారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్, తెలుగు మీడియం ఇంచార్జి రెవరెండ్ సిస్టర్ సుందరిలు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జెండా ఆవిష్కరణ అనంతరం నిర్వహించిన అద్భుతమైన మార్చ్ ఫాస్ట్ వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వివిధ హౌస్‌లకు చెందిన విద్యార్థులు పూర్తి క్రమశిక్షణతో, సమన్వయంతో, ఉత్సాహంతో, దేశభక్తి భావంతో మార్చ్ ఫాస్ట్ లో పాల్గొన్నారు. ముఖ్య అతిథి కల్నల్ ప్రేమ్ జిత్ ప్రసంగిస్తూ విద్యార్థులే దేశ భవిష్యత్తు అని పేర్కొంటూ, క్రమశిక్షణ, బాధ్యత, దేశభక్తి, నైతిక విలువలు, సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ ప్రతిభను దేశ ప్రగతికి వినియోగించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సహపాఠ్య కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొని సమగ్ర వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. మన దేశం మన గర్వం మన బాధ్యత మన భవిష్యత్తు అనే స్ఫూర్తితో ప్రతి విద్యార్థి దేశ నిర్మాణంలో తన వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తి, భారతీయ సంస్కృతి , జాతీయ ఐక్యతను అద్భుతంగా ప్రతిబింబించాయి. విద్యార్థుల దేశభక్తి గీతాలు, నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులు, అతిథులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## అత్యుత్తమ సేవలందించిన పోలీసులకు సేవా పతకాలు అందజేత



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 15 (నినాదం) :** నిజామాబాద్ పోలీస్ శాఖలో అత్యుత్తమ సేవలు అందించిన పోలీసులకు సేవా పతకాలు అందించారు. 80 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిజామాబాద్ పోలీస్ శాఖ లో అత్యుత్తమ సేవ అందించిన పోలీసు అధికారులకు, సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి సీపీ సాయిచైతన్యతో కలిసి పతకాలు అందజేశారు. సిఎస్ బిసిఐ కె. శ్రీధర్ రెడ్డి, ఫింగర్ ప్రింట్ సిఐ కె.రాజేందర్, ఏఆర్ఎస్సై వై.సంజీవ్, హెడ్ కానిస్టేబుల్ బి. చంద్రశేఖర్, ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆర్. చంద్రశేఖర్, ఎ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ అబ్దుల్ నలీం, హెడ్ కానిస్టేబుల్ ఏ. సాయిలు, టీ.వీ గంగా మోహన్, కానిస్టేబుళ్ళు ఆర్. కనకయ్య, ఏఆర్ కానిస్టేబుల్ ఎం.మంగోత్య, కానిస్టేబుల్ శివకుమార్ గౌడ్, కానిస్టేబుల్ ఎన్. కృష్ణ, మహిళా పోలీస్ కానిస్టేబుల్ కునాల స్వప్నలకు పోలీసు సేవా పతకాలు అందజేశారు.

## శ్రీనుకు మెరుగైన వైద్యం అందించాలి

10 వేలు సహాయం అందజేసిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జూపల్లి భాస్కర్ రావు



**కల్వకుర్తి 15 (నినాదం) :** చారగొండ మండలంలోని జెపల్లి గ్రామ పంచాయతీ నెమల్లి గుట్ట తండాకు చెందిన కెలావత్ శ్రీను గత వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు హైదరాబాదులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కెలావత్ శ్రీను ను పరామర్శించారు. వైద్యులను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీను కుటుంబ సభ్యులను కలిసి ధైర్యంగా ఉండాలని, 10,000 రూపాయలు సహాయం అందజేశారు. మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ,భాస్కర్ రావు యువసేన అధ్యక్షుడు ఎండి సిరాజ్, జేపల్లి ఉప సర్పంచ్ మధు ఎర్రవెల్లి మాజీ సర్పంచ్ సాయికుమార్‌దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ వంకేశ్వరం రమేష్‌బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు జేపల్లీ ప్రశాంత్,మహేష్ నరేందర్, రాకేష్, చిరంజీవి పార్టీ నేతలు కుటుంబ సభ్యులు నెమలి గుట్ట తండా నాయకులు .

## జిల్లా కోర్టులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కొత్తగూడెం, ఆగస్టు 15(నినాదం)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలత జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ 'నేను' అనే భావనను విడిచిపెట్టి 'మనం' అనే భావనతో ముందుకు సాగితే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఐక్యత, సమష్టి భావనతో పనిచేసినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం. రాజేందర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కవిత కర్నాటి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వి. హిమ పూజిత, రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. రవికుమార్, కూకట్‌పల్లి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి తోటరాముడి స్వప్న, ఆదిలాబాద్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రెడ్రెస్సల్ కమిషన్ అధ్యక్షుడు (పూర్తి అదనపు బాధ్యత) సి. హెచ్.వి. నర్సింహారావు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ మురళీధర్, ప్రధాన కార్యదర్శి గడిపల్లి మహేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులు గడదేశి నాగరాజు, బానోత్ దేవదాస్, దొడ్డ ప్రసాద్, సంధ్యారాణి, ఉమ నకిరేకంటి, సీనియర్ న్యాయవాదులు రేపాక వెంకటరత్నం, పలివెల సాంబశివరావు, ఏపూరి బాబురావు, కటికం పుల్లయ్య, రమేష్‌కుమార్ మక్కడ్, లక్కినేని సత్యనారాయణ, జూనియర్ న్యాయవాదులు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారం రాజారావు, పోలీస్ ప్రాసిక్యూటింగ్ అధికారులు అజయ్‌కుమార్, అనిల్‌కుమార్, కోర్టు సిబ్బంది, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మట్ట రవీందర్, సిస్టమ్ ఆఫీసర్ నరేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామపంచాయతీగా.

## మాన్ దొడ్డి గ్రామం ఎన్నిక

జిల్లా కలెక్టర్.ఎమ్మెల్యే చేతులమీదుగా
ఉత్తమ ప్రశంసాపత్రాన్ని అందుకున్న సర్పంచ్ సుజాత బాబురావు



**గద్వాల బ్యూరో ఆగస్టు 15 ( నినాదం):** జోగులాంబ గద్వాల జిల్లా ఆగస్టు 15 : శనివారం గద్వాల జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్ లో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు గ్రామాలు ఉత్తమ అభివృద్ధి పంచాయతీ లుగా ఎన్నికయ్యా యి.రాజోలి మండలం మాన్ దొడ్డి గ్రామం ఉత్తమ గ్రామ పంచాయితీగా ఎన్నికైయింది. అందులో భాగంగానే జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్,ఎమ్మెల్యే విజయ్ , సరిత చేతుల మీదుగా ఉత్తమ ప్రశంస పత్రాన్ని సర్పంచ్ సుజాత బాబురావు , పంచాయతీ కార్యదర్శి. వీరేష్ అందుకున్నారు. ఈ సందర్భంగా జి. సుజాత బాబురావు మాట్లాడుతూ... మాన్ దొడ్డి గ్రామం జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికైనందున సంతోషంగా ఉందని అన్నారు. గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, యువకులు, మహిళల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చెందే విధంగా నా వంతు కృషి చేస్తానని అన్నారు.

### అంబేద్కర్ విగ్రహానికి టీఎంఆర్పీఎస్ నేతల నివాళి



**కొత్తగూడెం ఆగస్టు 15 (నినాదం):** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి టీఎంఆర్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్ మాదిగ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లి ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని, దళితులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షులు మచ్చ వృద్ధిరాజ్ మాదిగ, రాష్ట్ర నాయకులు జెడి శ్రీనివాస్ మాదిగ, యువసేన జిల్లా అధ్యక్షులు బొమ్మెర అశోక్ మాదిగ, టీఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సాయికుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి-సంక్షేమమే ధ్యేయం..

**2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం**
**రైతు సంక్షేమం నుంచి మౌలిక వసతుల వరకు.. ఖమ్మం అభివృద్ధికి పెద్దపీట**
**సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా..**
**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**





**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 15: (నినాదం ):** 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతు భరోసా కింద జిల్లాలో 3,41,913 మంది రైతులకు రూ. 427.97 కోట్లు, పంట రుణమాఫీ కింద 1,31,760 మందికి రూ. 912.10 కోట్లు, రైతు బీమా కింద 803 కుటుంబాలకు రూ. 40.15 కోట్లు అందించామని చెప్పారు. 44,568 మంది రైతుల నుంచి రూ. 681.49 కోట్ల విలువైన మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేశామన్నారు. విద్యారంగంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి రూ. 200 కోట్లతో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ. 23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ భవనాన్ని పూర్తి చేశామని, వైరా, కూసుమంచి, తిరుమలాయపాలెం లో ఆసుపత్రుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా 1,38,790 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించనున్నామని చెప్పారు. ఖమ్మం నగరంలో మున్నేరు వరదల నియంత్రణకు రూ. 525.36 కోట్లతో రక్షణ గోడ నిర్మిస్తున్నామని తెలిపారు. రూ. 180 కోట్లతో మున్నేరు తీగల వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 2,45,213 మంది లబ్ధిదారులకు 18,69,122 గ్యాస్ సిలిండర్లను రూ.57.05 కోట్ల సబ్సిడీతో రూ. 500కే అందించామని తెలిపారు. ఆర్టీసీలో మహిళలు 6.14 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు చేసి రూ. 326.73 కోట్లను ఆదా చేసుకున్నారని చెప్పారు. గృహజ్యోతి కింద 2,49,454 కుటుంబాలకు రూ. 257.22 కోట్ల సబ్సిడీతో ఉచిత విద్యుత్ అందిస్తున్నామ న్నారు. ఇందిరమ్మ ఇండ్ల తొలి విడతలో 16,243 ఇళ్లు మంజూరు కాగా 10,396 ఇళ్లు పూర్తయ్యాయని, లబ్ధిదారులకు రూ. 454.97 కోట్ల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. రెండో విడతలో మరో 10,400 ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. రహదారులు, పరిశ్రమలు, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఖమ్మం ఖిల్లా, పాలేరు సరస్సు, నేలకొండపల్లి బౌద్ధ స్తూపం, మధిర పెద్ద చెరువు తదితర ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించామని తెలిపారు. క్రీడా రంగంలో జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో 24, రాష్ట్ర స్థాయిలో 314 పతకాలు సాధించారని చెప్పారు. వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశిష్ట సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ఉప ముఖ్యమంత్రి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సీపీ సునీల్ దత్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# రంగారెడ్డి కలెక్టరేట్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 15 (నినాదం) :** రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ ఆవరణలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత అట్టహాసంగా, పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలను కలుసుకుని ఆయన స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖ, హౌసింగ్, సంక్షేమ శాఖలు, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, అగ్నిమాపక, ఐసీడీ ఎస్ తదితర శాఖలకు సంబంధించిన శకటాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తిలకించారు. అనంతరం పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవన, పౌర సరఫరాలు, విద్యుత్ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలను అధికారులు మంత్రికి వివరించారు. జిల్లా పరిపాలనలో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ వై. నితిన్‌తో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇతర ఉద్యోగులను అభినందించి ప్రశంసాపత్రాలు బహుకరించా రు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంలో భాగంగా గ్రామీణ స్వయం సహాయక సంఘాలకు రూ. 261.52 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. మెప్మా పరిధిలోని పట్టణ స్వయం సహాయక సంఘాలకు రూ. 18.78 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబ, సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కేజీబీవీ మహేశ్వరం, ఏపీఎస్ ఇంటర్నేషనల్ స్కూల్, టీఎస్ మోడల్ స్కూల్ నేదునూర్, వివేక విద్యా భారతి ఆమనగల్, జడ్పీహెచ్ఎస్ తుక్కుగూడ తదితర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. ప్రదర్శనలు ముగిసిన అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్. రెడ్డి, శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, శంషాబాద్ డీసీపీ బి. రాజేష్, జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, కలెక్టరేట్ ఏఓ సునీల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువల పనుల్లో ఇక జాప్యం వద్దు





**అశ్వాపురం, ఆగస్టు 15(నినాదం):** సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువల పనుల్లో ఇక ఎలాంటి జాప్యం లేకుండా భూసేకరణను వేగవంతం చేసి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మ ల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద సీతారామ ఎత్తిపో తల పథకం పంప్‌హౌస్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా డిస్ట్రి బ్యూటరీ కాలువలకు సంబంధించిన భూసేకరణ, పైప్‌లైన్ పనులు, ఇతర నిర్మాణ పనుల పురోగతిని ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారామ ఎత్తిపోతల పథకం పంపును ఆన్ చేసి నీటిని దిగువకు విడుదల చేశారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని, సేకరించిన భూములను రైతులు వెంటనే సంబంధిత అధికారులకు అప్పగించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. భూములు అప్పగించిన వెంటనే రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో భూసేకరణకు అవసరమైన నష్టపరిహారాన్ని చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రాజెక్టు నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు.

**భూమి పైభాగంలో తిరిగి వ్యవసాయం చేసుకోవచ్చు**
పైప్‌లైన్ ఏర్పాటు చేసిన భూముల్లో పనులు పూర్తయిన అనంతరం రైతులు భూమి పైభాగంలో తిరిగి వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. రైతులకు అవసరమైన నష్టపరిహారం న్యాయంగా చెల్లిస్తామని స్పష్టం చేశారు. కొంతమంది రైతుల కారణంగా పెద్ద సంఖ్యలో రైతుల కు ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టు పనులు నిలిచిపోకూడదని అన్నారు. ఎక్కువ మంది రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టు పనులను రాజకీయాలకు అతీతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**వచ్చే ఏడాది జూన్ నాటికి మూడు లక్షల ఎకరాలకు నీరు**
సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసి సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. నాగార్జునసాగర్ ఆయకట్టుకు అదనంగా సీతారామ ప్రాజెక్టు ద్వారా కొత్తగా సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని, ప్రాజెక్టు ప్రయోజనాలను రైతులకు అందించేందుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు సమన్వయంతో పనిచేసి భూసేకరణను పూర్తి చేయాలని సూచించారు.

**ఆగస్టు నెలాఖరులోగా నీటిని విడుదల చేయాలి**
ఈ నెలాఖరులోగా సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే కొంత ఆలస్యం జరిగిందని, ఇకపై ఒక్కరోజు కూడా జాప్యం లేకుండా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరిలో ప్రవాహం ఉన్నప్పుడే నీటిని ఎత్తిపోసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు.

**ఆరుతడి పంటలకు నీరందించే అవకాశాలను పరిశీలించాలి**
ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే సమయంలో సీతారామ ప్రాజెక్టు నీరు రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. తుమ్మలచెరువు నిండడం ద్వారా సాగునీటి ప్రయోజనాలతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా అవకాశం ఏర్పడుతుందన్నారు. బూర్గంపాడు మండలంలో సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించి సుభిక్షంగా పంటలు పండించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆగస్టు నుంచే ఆరుతడి పంటలకు నీరు అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

**మారెళ్లపాడు ఎత్తిపోతల పనులపై మంత్రి అసంతృప్తి**
అనంతరం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. పనులు ఇంకా పూర్తి కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, భూసేకరణతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు అవసరమైన నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని రైతులకు వివరించారు. భూసేకరణను వేగవంతం చేసేందుకు రైతులు సహకరించాలని కోరారు. ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి రైతులే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించాలని మంత్రి రైతులతో అన్నారు. వందల కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు పనులు కొంతమంది రైతుల కారణంగా నిలిచిపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. కొంతమంది కోసం ఎక్కువ మంది రైతులకు కలిగే ప్రయోజనాలను వదులుకోలేమని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా నష్టపరిహారం చెల్లిస్తూ భూసేకరణను పూర్తి చేసి, ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి సాగునీటిని అందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలెక్టర్ చేసిన అధికారులు!

**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఫ్లెక్సీలో ఫోటో పేరు తారుమారు!**
**కలెక్టర్ ఫోటో స్థానం లో మంత్రి ఫోటో...అధికారుల తీరుపై విమర్శలు!**
**ఫ్లెక్సీ చూసి నవ్వుకున్న.. జనం పర్యవేక్షణ పై చర్యలు**






**భూపాలపల్లి, ఆగస్టు15(నినాదం):** అధికారుల అత్యుత్సాహమో.. నిర్లక్ష్యమో తెలియదు కానీ ఓ మంత్రి ఏకంగా జిల్లా కలెక్టర్ అయిపోయారు! జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శనివా రం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోను ఉంచి దాని కింద జిల్లా కలెక్టర్ పేరు ముద్రించడం చర్చ నియాంశంగా మారింది. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి న ఫ్లెక్సీలో కలెక్టర్ ఫోటో ఉండాల్సిన స్థానంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రాన్ని ఉంచడంతో కార్యక్రమానికి హాజరైన వారు అవాక్కయ్యారు..

**మంత్రి ఫోటో.. కలెక్టర్ పేరు!**
ఫ్లెక్సీని రూపొందించిన అధికారులు కనీసం ముద్రణకు ముందైనా పరిశీలించారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పౌరసరఫరాల శాఖకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఆయన ఫోటో ఉండడంలో తప్పులేదు. అయితే కలెక్టర్ పేరుకు మంత్రి ఫోటోను జత చేయడం అధికారుల పనితీరుపై విమర్శలకు తావిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15 నుండి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తున్నట్లు మంత్రి ప్రక టించడం తెలిసిందే. . ఫ్లెక్సీ చూసి నవ్వుకున్న జనం జిల్లాస్థా యి కార్యక్రమానికి సంబంధిం చిన ఫ్లెక్సీని కూడా సరిగా పరిశీలించకుండా ఏర్పాటు చేయడంపై పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు విస్మయం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమానికి వచ్చిన పలువురు ఫ్లెక్సీని చూసి నవ్వుకోవడం కనిపించింది. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచార సామాగ్రి విషయంలోనైనా అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**"ఉత్తమ్ కుమార్ రెడ్డి ఐఏఎస్ అయితే ఇలా ఉండేదేమో!"**
ఈ ఫ్లెక్సీ ని చూసిన కొందరు అధికారుల పుణ్యమా అని ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఐఏఎస్ గా మార్చేశారు. ఏకంగా జిల్లా కలెక్టర్ పదవి కూడా ఇచ్చేశారు! అంటూ సెటైర్లు వేసుకున్నారు. చిన్నపాటి ముద్రణ పొరపాటే అయినప్పటికీ జిల్లా స్థాయి అధికారుల సమన్వయం, పర్యవేక్షణ పై మాత్రం ఈ ఘటన పై ప్రశ్నలు రేకెత్తిస్తుంది.

# మహిళలను కోటీశ్వరులను చేయటమే ప్రభుత్వ లక్ష్యం

**రాష్ట్ర,రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 15 (నినాదం):** మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమా టోగ్రాఫ్ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో నీలగిరి జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీలగిరి మహిళా శక్తి పెట్రోల్ పంపును ప్రారంభించి అనంతరం స్మార్ట్ మహల్ భవనానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి పెట్రోల్ బంక్ అని అదేవిధంగా రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో స్మార్ట్ మహల్ నల్లగొండలో ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. అదేవిధంగా త్వరలోనే జిల్లాలో మూడు రైస్ మిల్లులను ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. జిల్లాలో మహిళా సంఘాలు చాలా ప్రతిష్టంగా ఉన్నాయని ఈ అవకాశాన్ని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి , ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ , సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి,కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..

# దేశభక్తి స్ఫూర్తితో వాసవి క్లబ్, వనిత క్వీన్స్ క్లబ్ స్వాతంత్ర్య వేడుకలు..



**సుల్తానాబాద్, ఆగస్ట్ 15 (నినాదం):** 80వస్వాతంత్ర్యది నోత్సవాన్నిపురస్కరించుకుని వాసవి క్లబ్,వాసవి వనితా క్వీన్స్ క్లబ్ సుల్తానాబా ద్ఆ ధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు.దేశ స్వాతం త్ర్యం కోసం ప్రాణత్యా గం చేసిన మహనీయులను స్మరించు కుంటూ జా తీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపిం చారు. అనంతరం దేశ ఐక్యత, అభివృద్ధి, మహిళా సాధికారతతో పాటు సమాజ సేవలో ప్ర తి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించా లని సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్య క్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అల్లంకి లింగ మూర్తి, జిల్లా జాయింట్ సెక్రటరీలు ఎల్లంకి రాజ న్న, కాసం సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ (ఉ మెన్ ఎంపవర్‌మెంట్) బాదం వాణి, డిస్ట్రిక్ట్ చైర్మ న్ జైశెట్టి సుమ, జోన్ చైర్మన్ అల్లంకి హరీష్ కు మార్, వాసవి క్లబ్ అధ్యక్షుడు రామిడి రవీందర్, కార్య దర్శి సముద్రాల శ్రవణ్ కుమార్, కోశాధికారి పుల్లూరి రమేష్, వాసవి వనితా క్వీన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎల్లంకి విజయ, ప్రధాన కార్యదర్శి నార్ల మాధవి, కోశాధికారి కొమురవెల్లి చంద్రకళతో పా టు వాసవి, వనితా క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్యసం ఘం నాయకులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ప్రతిభకు గుర్తింపు..

**సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు కు ప్రశంసా పత్రం..**



**సుల్తానాబాద్, ఆగస్ట్ 15 (నినాదం):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్ రావు కు ప్రశంసా పత్రం లభించింది. శనివారం పెద్దపల్లి జి ల్లా కలెక్టరేట్ ప్రాంగణం లోనిర్వహించిన స్వాతం త్ర్య వేడుకల్లో ప్రభుత్వ విప్, పెద్దపల్లిఎమ్మెల్యే చిం తకుంట విజయ రమణా రావు, జిల్లా కలెక్టర్ కో య శ్రీహర్ష చేతుల మీదుగా సీఐ రంజిత్ రావు ప్ర శంసా పత్రాన్ని అందుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి, పోలీస్శాఖకు సేవలందించి నం దుకు ఆయనను ఈ సందర్భంగా అభినందించా రు. ప్రశంసాపత్రం అందుకోవడంతో సుల్తానాబాద్ పోలీసు సిబ్బంది,పలువురు ప్రజాప్రతినిధులు, నా యకులు సీఐ రంజిత్ రావు నుఅభినందించారు.

# అవకతవకలకు చెక్.. స్మార్ట్ రేషన్ కార్డులు



## సంక్షేమానికి స్మార్ట్ భరోసా

**మంచిర్యాల, ఆగస్టు 15(నినాదం):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్ తదితరులు పాల్గొని 100 మంది లబ్ధిదారులకు కార్డులు అందజేశారు.

**అవకతవకలకు అడ్డుకట్ట**
ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతే లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల అక్రమాలకు తావులేకుండా అర్హులకు ప్రయోజనాలు అందే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం వైపు ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

**జిల్లాలో 40,456 కొత్త కార్డులు..**
మంచిర్యాల జిల్లాలో కొత్తగా 40,456 రేషన్ కార్డులు జారీ చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కార్డులు దోహదపడతాయని చెప్పారు. ప్రతి వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

**సాంకేతికతతో పారదర్శకత**
రేషన్ పంపిణీ వ్యవస్థలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా లబ్ధిదారుల గుర్తింపు, వివరాల నిర్వహణ, పథకాల అమలులో పారదర్శకత పెంచే అవకాశం ఉంది. ఒకే కుటుంబం పేరుతో అనేక ప్రయోజనాలు పొందడం, అనర్హులు పథకాల్లో చేరడం వంటి సమస్యలకు సాంకేతిక ఆధారిత వ్యవస్థతో అడ్డుకట్ట వేయవచ్చనే అభిప్రాయం వ్యక్తమైంది.

**సన్నబియ్యంకు భరోసా...**
రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. అట్టడుగు వర్గాల ప్రజలకు ఎలాంటి అవకతవకలు లేకుండా సంక్షేమ పథకాలు అందించేందుకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించినట్లు చెప్పారు. మండలాల వారీగా కార్డుల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు.

# 99 శాతం మార్కులు.. ఆర్కే న్యూటెక్ జాతీయ అగ్రస్థానం







## కార్మిక క్షేత్రంలో.. రెపరెపలాడిన జాతీయ జెండా

**మంచిర్యాల, ఆగస్టు 15 (నినాదం):** కార్మిక క్షేత్రం శ్రీరాంపూర్‌లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ ఆవరణలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. స్వేచ్ఛగా జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఎంతో విలువైనదని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సాధించి 79 వసంతాలు పూర్తిచేసుకుని 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి దేశంలోని ఇతర ప్రభుత్వరంగ సంస్థలకు భిన్నంగా ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తూ ఉపాధి కల్పన కేంద్రంగా కొనసాగుతోందని జీఎం తెలిపారు. కంపెనీ, ఏరియా స్థాయిలో నిర్దేశించిన లక్ష్యాలను భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ సాధించే దిశగా సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి సారథ్యంలో, డైరెక్టర్ల నిరంతర పర్యవేక్షణలో ముందుకు సాగుతున్నామని చెప్పారు. బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా థర్మల్ పవర్, సోలార్, గ్యాసిఫికేషన్, గ్రీన్ ఎనర్జీతోపాటు ఇతర మైనింగ్ రంగాల్లోనూ సింగరేణి విస్తరిస్తోందన్నారు. భద్రత విషయంలో శ్రీరాంపూర్ ఏరియా సింగరేణిలోనే అగ్రస్థానంలో నిలుస్తోందని మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. 56 వార్షిక భద్రతా ఉత్సవాల్లో 19 బహుమతులు సాధించడం ద్వారా శ్రీరాంపూర్ ఏరియా సింగరేణిలో నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. అదేవిధంగా ఫైవ్‌స్టార్ రేటింగ్‌లో ఆర్కే న్యూటెక్, ఆర్కే-6 గనులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచాయని తెలిపారు. ఆర్కే న్యూటెక్ గని 99 శాతం మార్కులతో జాతీయ స్థాయిలో నంబర్‌వన్ స్థానాన్ని సాధించి శ్రీరాంపూర్ ఏరియా సత్తాను చాటిందన్నారు.

**ఉత్తమ ఉద్యోగులకు సత్కారం**
కంపెనీ స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా ఎంపికై కొత్తగూడెంలో సీఎండీ చేతుల మీదుగా సత్కారం పొందిన సామాని సదానందంతోపాటు ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని జీఎం అభినందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను సైతం అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులు, ప్రతిభావంతులైన విద్యార్థులను జీఎం మునిగంటి శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు మునిగంటి ఉమారాణి చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం కృష్ణ ప్రసాద్, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీసైదా, సీఎంఓఏఐ అధ్యక్షుడు లక్కాకుల మహేష్, డీజీఎం (పర్సనల్) అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హుందాతనం కోల్పోతున్న రాహుల్!

**రాజకీయాల్లో హుందాతనం అవసరం. సమయానుకూలంగా మంచిగా మాట్లాడేలా వ్యవహరించాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. అందులోనూ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ అవసరం. ప్రతిపక్ష నేతగా సమర్థత ఉంటేనే రాణిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైనా చెల్లుతుంది. కానీ ప్రతిపక్ష నేతగా రాణించాలంటే ప్రజల్లో తన వ్యక్తిత్వం కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. మాటలు, చేతలు అన్నీ హుందాగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. లోక్ సభలో ప్రతిపక్షనేత రాహుల్ ఈ మధ్య మరీ దిగజారి పోయారు. మాటల్లో హుందాతనం లేదు. చేతల్లో అంతకన్నా లేకుండా పోయింది. సర్కస్‌లో జోకర్‌లా, డ్రామాల్లో విదూషకుడిలా ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది.**




లోక్ సభలో మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడరు. మాట్లాడితే పస ఉండడం లేదు. సమస్యలపై అవగాహన ఉండడం లేదు. విషయంపై పట్టు ఉండడం లేదు. ఇవన్నీ కలగలిపి రాహుల్ గాంధీ విపక్ష నేతగా పూర్తిగా విఫలం అవుతూ వస్తున్నారు. ఇటీవల వరుసగా పార్లమెంట్ సమావేశాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం కూడా రాహుల్ అన్న విషయం మరచిపోరాదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఎంతగా దిగజారిపోయారో అనడానికి నిదర్శనంగా నిలిచాయి. ఆలింగనాలే ప్రధాన మంత్రి మోదీ విదేశీ దౌత్యం అంటూ... లోకసభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు..ఆయన ఆహార్యం సామాన్యులకు కూడా వెగటు పుట్టించేలా ఉన్నాయి. అహంకారం హద్దులు దాటి రాహుల్ నోరుజారుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శం అక్కర్లేదు. ఇది ఓ రకంగా భారత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది. ఇలాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ చూడలేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భారత దౌత్యంపై రాహుల్ చేసినవి దిగజారుడు వ్యాఖ్యలు చూశాక ఇలాంటి ప్రతిపక్ష నేత ఉన్నందుకు దేశ ప్రజలు సిగ్గుపడాలి. ఆయన ప్రవర్తన ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాహుల్ వ్యాఖ్యలు విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఎందుకంటే రాహుల్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు వ్యవహరించిన తీరు పిచ్చిగా మారుతోందనడానికి చెప్పడానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. భావి భారత ప్రధాని అని కాంగ్రెస్ శ్రేణులంతా పొగడుతున్న వేళ..ఆయన భాషను, ఆహార్యాన్ని చూస్తుంటే..ఇతనూ ఒక నేతేనా అన్న సందేహం కలుగక మానదు. ఇలాంటి వారిచేతిలో భారత్ పదిలంగా ఉండగలదా అన్న భయం కలుగుతోంది. భారతదేశాన్ని నడపడానికి సుదీర్ఘ అనుభవం కావాలి. పనికిమాలిన నాటకాలు కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని జోకర్లని పిలవడం, మోడీని, అమిత్ షాలను కట్టగట్టి తిట్టడం పరిధికి మించిన విషయం. రాహుల్ వాడుతోన్న భాష మూర్ఖత్వాన్ని, నిరాశను తెలిజేస్తున్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠగా చెప్పుకోవాలి. అలాగే విదేశాల్లో వివిధ నేతలతో మోడీ ఆలింగనాలపైనా కువ్యాఖ్యలు చేశారు. నిజానికి ఓ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తి విదేశీ నాయకులపై రాజకీయ వ్యాఖ్యలు చేసేటప్పుడు గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సి ఉంటుంది. తానొక విపక్షనేతను అన్నది మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠగా చూడాలి. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తరవాత ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా మారడానికి తపించారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ వ్యవస్థగా మార్చేయడంతో భారత్ జోడో యాత్ర నాటి ఆదర్శం లేకుండా పోయింది. ఇప్పుడు జన్‌జి అంటూ మాట్లాడుతున్న రాహుల్ వారికి పార్టీలో అవకాశం ఇవ్వలేక పోయారు. ప్రియాంకగాంధీని వయనాడ్ నుంచి లోకసభకు ఎన్నిక చేయించుకున్నారు. తల్లి సోనియాను రాజ్యసభకు పంపారు. తాను రాయబరేలి నుంచి ఎన్నికయ్యారు. ఇది కుటుంబ పార్టీ అనకుండా ఎలా ఉండగలం. వృద్ధనేతలంతా కాంగ్రెస్‌లో పాతుకుపోయారు. యువ నేతలను దరిచేరనీయకుండా చూసుకుంటున్నారు. వీరు జన్‌జీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక చెప్పుకోవడం సిగ్గుచేటు. 2024 సార్వత్రిక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను కాబోయే ప్రధానమంత్రి అని కీర్తించడం ప్రారంభించారు. కొందరు మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనకు వంతపాడుతూ వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వెనుతిరిగి చూస్తే అంత సీన్ రాహుల్‌కు లేదని అనిపిస్తోంది. తాజాగా రాహుల్ చేష్టలు, వ్యాఖ్యలు ఆయనలో నాయకత్వ పటిమ లేదని నిరూపించాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేక పోతున్నారు. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీతో పోలిస్తే .. రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు ఎక్కడా కనిపించవు. సమయానుకూలంగా ఏదో ఓ సమస్యపై మాట్లాడడం, విదేశాలకు చెక్కేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడా భారత పరువు పోయేలా మాట్లాడడం కూడా అలవాటు చేసుకున్నారు. 'ఓటు చోరీ'పై ఇలాగే చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రధాని కన్నా ఎక్కువ కష్టపడాలి. ఎక్కువగా కృషి చేయాలి. యూపీఏ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో రాహుల్ మంత్రిపదవిని చేపట్టేందుకు అంగీకరించలేదు. దీంతో ఆయనకు అధికారంలో ఉండడం ఎలా అన్నది కూడా తెలియదు. ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు మాత్రం ఎలా నమ్ముతారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని రాహుల్, ఇప్పటికీ పదేపదే అవే తప్పులు చేయడంతో పాటు, రాజకీయ హుందాను కోల్పోతున్నారు. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధాన మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా మరింతగా దిగజారిన నేతగా ప్రజల్లో చులకన భావం మూటకట్టుకుంటున్నారు. ఇలాంటి వ్యక్తి నిజానికి ప్రతిపక్ష నేతగా కూడా పనికిరాడు. ఇక ప్రధానిగా కావాలనుకుంటున్న ఇతనికి వంది మాగధులు చేస్తున్న పొగడ్తలతో ఉబ్బిపోవడం తప్ప మరోటి తెలియడం లేదు. స్వయం ప్రకటితంగా ఇక తానే భావి ప్రధాని అనుకోవడంతో వచ్చిన మానసిక వైకల్యంగా చూడాలి. వీటిని అధిగమించితే తప్ప సమర్థనేతగా రాహుల్ రాణించడం కష్టం.

# అజాత శత్రువు అటల్ జీ

## ఆగస్టు 16... వాజ్‌పేయి వర్ధంతి

**రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న గొప్ప నాయకుడు వాజ్ పెయి. ప్రజా సేవ కోసం బ్రహ్మచారిగా ఉండిపోయి... తన జీవితం మొత్తం దేశం కోసం అంకితం చేశారు. రెండు సీట్ల పార్టీని దేశ రాజకీయ చరిత్రలోనే అధికార పార్టీగా మలచిన అపర చాణుక్యుడు.**



పార్లమెంట్ సాక్షిగా నెహ్రూలాంటి నేతల్ని సైతం గడగడలాడించారు. హీటెక్కించే ప్రసంగాలు చేయడంలోనే కాదు.. హాస్యం పండిచండంలోనూ ఆయనకు ఆయనే సాటి. ప్రసంగాల్లో... చట్టసభల్లో మధ్యమధ్యలో కవిత్వాన్ని కలగలిపి అందరితో శెభాష్ అనిపించుకున్నారు. ఆయన వాగ్ధాటి ఎలాంటిదంటే.. భారత ప్రధానిగా ఉన్న నెహ్రూనే ఓ సందర్భంలో.. అటల్ జీ దేశానికి ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు.
కాంగ్రెస్ పార్టీని, దాని మిత్రపార్టీలను ధీటుగా ఎదుర్కొని.. మిత్రపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అధికారం హస్తగతం చేసుకున్న నేత వాజ్‌పేయి. ప్రధానిగా పూర్తి పదవీకాలం పూర్తి చేసిన తొలి కాంగ్రెసేతర నేతగా వాజ్‌పేయి నిలిచారు. ఆర్ఎస్ఎస్, జనసంఘ్ నుంచి వచ్చినా... బీజేపీ లీడర్ గా ఎదిగినా.. అన్నివర్గాల ప్రజల మనసును గెలుచుకున్న వ్యక్తి అటల్ బీహారీ వాజ్ పేయి. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఏర్పడ్డ ఎన్డీయే కూటమికి సెక్యూలర్ ఫేస్ ఇవ్వడానికి ఎంతగానో కృషిచేశారాయన. అటల్ బిహారీ వాజపేయి డిసెంబర్ 25 1924 న గ్వాలియర్ లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు కృష్ణాదేవి, కృష్ణబిహారీ వాజపేయి. ఆయన తాత పండిట్ శ్యాం లాల్ వాజపేయి వారి పూర్వీకుల నివాస ప్రాంతమైన ఉత్తరప్రదేశ్ లోని బటేశ్వర్ నుండి గ్వాలియర్ లోని మోరీనాకు వలస వెళ్ళాడు. ఆయన తండ్రి కృష్ణబిహారీ వాజపేయి గ్వాలియర్ ప్రాంతంలో ఒక ఉపాధ్యాయుడు, కవి. వాజపేయి గ్వాలియర్ లోని సరస్వతి శిశు మందిర్ లో విద్యాభ్యాసం చేశాడు. గ్వాలియర్ విక్టోరియా కళాశాల (ప్రస్తుతం లక్ష్మీబాయి కళాశాల)లో చేరి హిందీ, ఆంగ్లము, సంస్కృతంలో అత్యంత ప్రతిభావంతునిగా పట్ట భద్రుడైనాడు. కాన్పూరు లోని దయానంద ఆంగ్లో వైదిక కళాశాలనుండి రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ పట్టాను పొందాడు. ఎం.ఎ డిగ్రీని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనాడు. వాజపేయి గ్వాలియర్లో ఆర్య సమాజపు యువ విభాగమైన ఆర్య కుమార్ సభతో తన సామాజిక కార్యశీలతను ప్రారంభించి, 1944లో ఆ విభాగానికి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఆయన 1939 లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.)లో కూడా చేరాడు. బాబా ఆమ్టే ప్రభావంతో ఆయన 1940–44 లలో అధికార్ల శిక్షణా కేంద్రానికి హాజరైనాడు. ఆయన 1947 లో "పూర్తి స్థాయి సేవకుడు" అనగా ఆర్.ఎస్.ఎస్. ప్రచారక్ అయ్యాడు. ఆయన దేశ విభజన తర్వాత జరిగిన అల్లర్ల వల్ల న్యాయ శాస్త్ర విద్యాభ్యాసాన్ని మధ్యలోనే ఆపేశాడు. రాష్ట్రీయ స్వయంసేయక్ సంఘ్ విస్తారక్ గా ఉత్తర ప్రదేశ్ వెళ్ళిన వాజపేయి, అక్కడ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నడుపుతున్న "రాష్ట్రధర్మ" (హిందీ మాసపత్రిక), "పాంచజన్య" (హిందీ వారపత్రిక) పత్రికలలోను, స్వదేశ్", "వీర్ అర్జున్" వంటి దిన పత్రికలలోనూ పనిచేయటం ప్రారంభించాడు. వాజపేయి జీవితాంతం బ్రహ్మచారిగా జీవించాడు. 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో, ఆయన తన అన్న ప్రేమ్‌తో కలిసి 23 రోజుల పాటు అరెస్టయిన సందర్భంలో వాజపేయికి తొలిసారిగా రాజకీయాలతో పరిచయమేర్పడింది. 1951 లో క్రొత్తగా ఏర్పడిన భారతీయ జనసంఘ్ అనే హిందూ దక్షిణ పక్ష రాజకీయ పార్టీలో పనిచేయడానికి, దీన్ దయాళ్ ఉపాధ్యాయతో పాటు వాజపేయిని ఆర్.ఎస్.ఎస్ నియమించింది. ఇది ఆర్.ఎస్.ఎస్ తో కలిసి పనిచేస్తున్న రాజకీయ పార్టీ. ఆయన ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పార్టీ ఉత్తర విభాగానికి జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. అనతి కాలంలోనే జనసంఘ్ నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అనుయాయిగా, సహాయకునిగా మారాడు. 1957లో వాజపేయి బల్రాంపూర్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. ఆయన వాగ్ధాటి మూలంగా, అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏదో ఒకరోజు వాజపేయి దేశ ప్రధాని అవుతాడని ఊహించాడు. ఆయనకు గల వాగ్ధాటి, సంస్థాగతమైన నైపుణ్యాల కారణంగా జనసంఘ్‌లో ముఖ్యనేతగా ఎదిగాడు. దీనదయాళ్ ఉపాధ్యాయ మరణానంతరం జనసంఘ్ మొత్తం బాధ్యత, యువ వాజపేయిపై పడింది. 1968 లో జనసంఘ్ జాతీయ అధ్యక్షునిగా ఎదిగాడు. నానాజీ దేశ్‌ముఖ్, బాల్‌రాజ్ మధోక్, లాల్ కృష్ణ అద్వానీ లతో కలిసి జనసంఘ్‌ను జాతీయస్థాయి ప్రాముఖ్యతను సంతరించుకునే దిశగా నడిపించాడు. 1975, 1977 ల మధ్య, భారత జాతీయ కాంగ్రెసు పార్టీకి చెందిన ప్రధాని, ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఎమర్జన్సీ కాలంలో అనేకమంది విపక్ష నాయకులతో పాటు అరెస్టు అయ్యాడు. 1977 లో సంఘ సంస్కర్త

> **ఆర్ఎస్ఎస్, జనసంఘ్ నుంచి వచ్చినా... బీజేపీ లీడర్ గా ఎదిగినా.. అన్ని వర్గాల ప్రజల మనసును గెలుచుకున్న వ్యక్తి అటల్ బీహారీ వాజ్ పేయి. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఏర్పడ్డ ఎన్డీయే కూటమికి సెక్యూలర్ ఫేస్ ఇవ్వడానికి ఎంతగానో కృషిచేశారాయన.**

జయప్రకాశ్ నారాయణ్, కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా సంఘటితమై పోరాడటానికి, అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు ఇచ్చిన పిలుపు మేరకు, వాజపేయి జనసంఘ్‌ను క్రొత్తగా ఏర్పడిన సంకీర్ణ కూటమి, జనతాపార్టీలో విలీనం చేశాడు. 1977 సార్వత్రిక ఎన్నికలలో జనతా పార్టీ విజయం తరువాత ఆయన మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేశాడు. విదేశీ వ్యవహారాల మంత్రిగా ఆయన ఐక్యరాజ్య సమితి యొక్క సర్వప్రతినిధి సభలో హిందీలో ప్రసంగించిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచాడు.

1979లో జనతా ప్రభుత్వం కూలిపోయే నాటికి వాజపేయి, స్వతంత్రంగా గౌరవప్రదమైన రాజకీయ వేత్తగా, అనుభవజ్ఞుడైన నాయకునిగా ఎదిగాడు. వాజపేయి, జనసంఘ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ల నుండి వచ్చిన తన సహచరులను, ముఖ్యంగా దీర్ఘకాల స్నేహితులైన ఎల్.కె.అద్వానీ, భైరాన్ సింగ్ షెకావత్ లను కలుపుకొని 1980 లో భారతీయ జనతా పార్టీని ఏర్పరచి, మొట్టమొదటి అధ్యక్షునిగా పనిచేసాడు. జనతా ప్రభుత్వం తర్వాత వచ్చిన ఇందిరా కాంగ్రెసు ప్రభుత్వానికి బలమైన విమర్శకునిగా అవతరించాడు.
1995 నవంబరులో ముంబాయిలో జరిగిన బి.జె.పి సమావేశంలో బి.జె.పి అధ్యక్షుడైన లాల్ కృష్ణ అద్వానీ వాజపేయిని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించాడు. 1996 మే నెలలో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో బి.జె.పి విజయం సాధించింది. వాజపేయి 1996 నుండి 2004 ల మధ్య మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు.
వాజపేయి ప్రభుత్వం యేర్పడిన నెలరోజులలోనే ప్రోక్రాన్ అణు పరీక్షలు జగిపారు. ఢిల్లీ–లాహోర్ బస్సును 1999 ఫిబ్రవరిలో ప్రారంభించారు. కార్గిల్ యుద్ధం, భారత్ పాకిస్తాన్ మధ్య మే – జూలై 1999 లో కాశ్మీర్ లోని కార్గిల్ జిల్లాలోను, మరికొన్ని సరిహద్దుల వద్దనూ జరిగింది. మూడవ దఫా పరిపాలనా కాలంలో అనేక దేశీయ ఆర్థిక, మౌలిక సంస్కరణలను చేపట్టాడు. వాటిలో ప్రైవేటు రంగాన్ని, విదేశీ పెటుబడులను ప్రోత్సహించాడు. నేషనల్ హైవే డెవలప్‌మెంటు ప్రాజెక్టు", "ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన" వాజపేయి అభిమాన ప్రాజెక్టులు చేపట్టాడు.2001 లో వాజపేయి ప్రభుత్వం, ప్రాథమిక, మాధ్యమిక విద్యాభివృద్ధి లక్ష్యంగా సర్వశిక్షా అభియాన్ అనే ప్రసిద్ధ కార్యక్రమాన్ని ప్రారంభించింది.
2005 డిసెంబర్ నెలలో వాజపేయి క్రియాశీల రాజకీయాలనుండి నిష్క్రమిస్తున్నట్లు ప్రకటించి, "ఇకనుండి లాల్ కృష్ణ అద్వానీ, ప్రమోద్ మహాజన్‌లు భారతీయ జనతా పార్టీకి రామలక్ష్మణుల వంటివారు" అని ప్రకటించాడు.
భారతదేశ రాజ్యసభలో అప్పటి ప్రధాని డా.మన్మోహన్ సింగ్ తన ప్రసంగంలో వాజపేయిని రాజకీయ భీష్మునిగా అభివర్ణించాడు. అటల్ బిహారీ వాజ్‌పేయిని ఆయన శత్రువులు కూడా విమర్శించరు. 'అజాత శత్రువు, సర్వప్రియుడు, సర్వమాన్య' లాంటి ఉపమానాలను ఆయన పేరుతో జోడిస్తారు. అనారోగ్య కారణాలతో అటల్ జీ 2018 ఆగష్టు 16న మృతి చెందారు. ఆటల్ జీ జన్మదినమైన డిసెంబర్ 25 ను భారత ప్రభుత్వం సుపరి పాలనా దినంగా ప్రకటించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
సీనియర్ ఇండిపెండెంట్
జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494

# దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

**ఆయా రంగాల్లో స్వయంసమృద్ధితో వికసిత భారత్ సాధ్యం**

**ఆర్థిక,సామాజిక ఎదుగుదలకు చోదకశక్తి కావడం తథ్యం**

**సప్తధార సందేశం ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ**

**న్యూఢిల్లీ,ఆగస్ట్15 (నినాదం):**



భారతదేశ 80వ స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్', స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారత దేశ రాబోయే ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మొదటి ధార మాన్యుఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమైన పునాదిగా మోడీ అభివర్ణించారు. కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు. సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కి చెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయరంగాన్ని బలోపేతంచేసి, ఉత్పాదకతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు మూడవ ధారగా అభివర్ణించారు. ప్రపంచం డేటాసెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త సాంకేతికతల యుగంలోకి అడుగు పెడుతోందని, ఈ రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని పిలుపునిచ్చారు. యుపిఐ విజయం ద్వారా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రపంచానికి నిరూపించిందని, ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. అలాగే నెక్స్ట్–జెన్ టెలికమ్యూనికేషన్‌ను వేగవంతం చేస్తూ, స్వదేశీ సాంకేతికతను దేశంలోని మూలమూలకూ తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నాల్గవ ధారగా మౌలిక వసతులు, 'గతి శక్తి' ద్వారా అనుసంధానాన్ని పెంచడంపై మాట్లాడారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, ల్యాజిస్టిక్స్ మెరుగు పరచడానికి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి అత్యంత కీలకమని, వాటికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన కనెక్టివిటీ సరికొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందన్నారు.ఐదవ ధారగా 'రక్షా శక్తి' నిలిచింది. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సైనిక సాంకేతికతలపై ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశద్రోహ భద్రతను గట్టిగా ఉంచడానికి ఆత్మనిర్భర్ రక్షణ రంగం ఎంతో అత్యవసరమని తెలిపారు. ఆరవ ధారగా హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ప్రధాని గుర్తించారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుతూనే భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి క్లీన్ ఎనర్జీ సాంకేతికతల్లో ఆవిష్కరణలు చాలా ముఖ్యం అని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించడానికి, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు వేగంగా అడుగులు వేయడానికి కృషి చేయాలన్నారు. చివరగా ఏడవ ధారగా భారతదేశం 'సాఫ్ట్ పవర్' ను ప్రధాని ఆవిష్కరించారు. భారత్ సాంస్కృతిక ప్రభావం సరిహద్దులు దాటి విస్తరించిందని చెబుతూ.. యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, క్రియేటివ్ రంగాలు భారత సాఫ్ట్ పవర్‌కు ప్రధాన స్తంభాలని వెల్లడించారు. భారతదేశ పర్యాటక రంగానికి భారీ అవకాశాలు ఉన్నాయని, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు మరింత కృషి చేయాలని కోరారు. జాతీయ పార్కులు, సాంస్కృతిక విశేషాలు, వినోద పరిశ్రమ, వేగంగా విస్తరిస్తున్న 'కాన్సర్ట్ ఎకానమీ' పర్యాటకాన్ని బలోపేతం చేయడానికి, భారత్ గొప్ప వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పడానికి అద్భుతమైన వేదికలని మోడీ స్పష్టం చేశారు. ఈ సప్తధార సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, 2047 నాటికి దేశాన్ని సంపూర్ణ స్వయంసమృద్ధి కలిగిన వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# నవరోజ్ - జొరాస్ట్రియన్ల నూతన సంవత్సర వేడుకలు

## (16 ఆగష్టు "పార్సీ నూతన సంవత్సరం–నవరోజ్" శుభ సందర్భంగా)

షహెన్‌షాహీ లేదా జొరాస్ట్రియన్ క్యాలెండర్‌ను అనుసరించే పార్సీ మతస్తులు 16 ఆగష్టు 2026 రోజు నవరోజ్ (నౌరోజ్) లేదా నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఒక సత్సంప్రదాయంగా వస్తున్నది. పార్సీ నూతన సంవత్సర వేడుకులు ప్రతి ఏటా ఆగష్టు మాసంలో వస్తుంది. 2026లో నవరోజ్ వేడుకలు 15/16 ఆగష్టున జరుపుకోవడం చూస్తున్నాం. పార్సీ మతస్థుల మతపరమైన కుటుంబ వేడుకగా నవరోజ్‌ను సాంప్రదాయ దుస్తులు ధరించి, బంధుమిత్రులతో కలిసి శుభాకాంక్షలు తెలుపుకుంటూ ప్రత్యేక వంటకాలతో ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ పండుగ రోజు ఇంటిని శుభ్రపరుచుకొని, ప్రత్యేకంగా తయారు చేసిన ఆహార పదార్థాలను ఒక బల్లపై అమర్చి అందరు కలిసి సంతోషాల నడుమ భోజనం చేస్తారు.

**అతి పురాతన వేడుక - నవరోజ్ :**

అతి పురాతన మతాల్లో ఒకటైన పార్సీ మతం సుమారు 3,500 ఏండ్ల క్రితం ప్రాచీన ఇరాన్‌లో ప్రవక్త జరతుస్త్ర స్థాపించాడు. భూమి మీద సజీవంగా ఉన్న అతి పురాతన విశ్వాసాలలో ఒకటైన నవరోజ్ పండుగను పార్సీలు లేదా జొరాష్ట్రియన్లు సహజ సిద్ధంగా నిర్వహించుకుంటారు. సహజాత ప్రవృత్తిగా "కలవండి, వంట చేయండి, వేడుక చేసుకోండి, గుర్తుంచుకోండి" అనే నినాదాన్ని సర్వదా పాటించడం పార్సీ మతస్థులకు ప్రగాఢ సంప్రదాయంగా మారింది. ఒక సంవత్సరం ఆశలు, ఒక సంవత్సరం కృతజ్ఞత, ఒక సంవత్సరం జీవనం కలిసిన క్షణాలు నవరోజ్‌గా వ్యక్తం చేయబడతాయి. భారత స్వాతంత్ర్య వేడుకల తర్వాత రోజు 16 ఆగష్టు 2026న సూర్యోదయా



వేళ ఈ ఉత్సవం మొదలు అవుతుంది. నవరోజ్ అనగా కొత్త రోజు ప్రారంభం అని అర్థం చేసుకోవాలి. స్పష్టమైన, ఆత్మీయమైన, అర్థవంతమైన నవరోజ్ పేరులో విషువత్తు, ప్రవాసం, సముద్రం, రాకల వేడుకగా ఈ ఉత్సవం నిలుస్తున్నది. "సాల్ ముబారక్" అంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలను పరస్పరం చెప్పుకుంటూ వేడుకలను ప్రారంభించి, అగ్ని దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి తమ బంధుమిత్రులకు హృదయపూర్వకంగా ఆతిధ్యం ఇస్తారు.

**మోక్షం పొందడమే మానవ జీవిత లక్ష్యం కావాలి :**

7వ శతాబ్దంలో ఇస్లామిక్ దండయాత్ర కారణంగా భారతదేశంలోని గుజరాత్‌కు వలస వచ్చిన పర్షియా(ప్రస్తుత ఇరాన్) మతస్తులు జొరాస్ట్రియన్లు ఈ వేడుకలను జరుపుకుంటున్నారు. మానవ జీవిత ప్రధాన ఉద్దేశం మోక్షం పొందడమే. ఒక గురువు యొక్క శరణు పొందిన రోజున మన జీవితం సార్థకం అవుతుందని నమ్ముతారు. మానవ జీవితంలో శాంతి, అదృష్టం, విజయం, ఆనందం అనే వివిధ రంగులు ఇంద్రధనుస్సుగా మారి అద్భుతంగా కనిపించాలి. ఆనందంగా ఉండడంతో పాటు ఆనందాలను పంచడం కూడా నిరంతరం కొనసాగాలి. పార్సీ మత బోధనల ప్రకారం కబీర్ సాహెబ్ జీ శరణు కోరితే ఎలాంటి ఆపదలు ఉండవని విశ్వసిస్తారు.
ప్రేమ, ధైర్యం, జ్ఞానం, సంతృప్తి, ఆరోగ్యం, సహనం, పవిత్రతలను తోడుగా ఉంచుకోవడానికి నవరోజ్ ఉత్ప్రేరకంగా పని చేస్తున్నది. మన ఇరుగు పొరుగు పార్సీ మతస్థులు ఉన్నట్లైతే వారికి నౌరోజ్ శుభాకాంక్షలు తెలియజేద్దాం, వారి రుచికరమైన వంటకాలను ఆస్వాదిద్దాం.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# నూరేళ్ల జీవితం..!

అద్దం నన్ను చూసి అడిగింది..
నీ కోసం నువ్వు బతకడం మానేసి..
నీ వాళ్ళ కోసం నానా చాకిరీ చేసి..
నీ నిండు నూరేళ్ల జీవిత కొవ్వొత్తిని..
కరిగించి తరిగి వెలుతురు చిమ్మావు
నీ మదిలో నీదైన ఓ ఆశల కుప్ప..
అలాగే ముక్కుతూ మూలుగుతోందని !

అందరినీ సంతోషపెట్టడానికి..
ప్రయత్నిస్తే నవ్వులపాలు అవుతావు
ఏ ఒక్కరి సొంతం కాదు ఆనందం
ఎన్నడూ బాధలే ముసురుకోవు
చీకటి వెలుగుల ప్రపంచంలో..
కష్టసుఖాలు మన జత కాళ్ళు
సుఖ తీరాలు చేరటానికి నడిచి...
కష్టాల కడలి దాటాల్సిందే సుమా !

గతాన్ని మరి మరి తలచి వగచకు..
జరగవలసినది జరిగే తీరుతుంది
రేపటి భయం గుప్పిట్లో దూరి..
నేటి సంతోషాలను వదులుకోకు..
ఏదీ నీ అనుమతిని కోరట్లేదు
నేనే తోపును అని విర్రవీగకు
చిట్టి దోమ కూడా భయపెడుతోంది కదా !



**మధుపాళీ 9949700037**

# షుగర్ తగ్గడం కోసం
# ప్రతి రోజూ తినాల్సిన ఏకైక పండు

### డయాబెటిస్ ఉన్నవారు ఏం తినాలో తెలుసా?

**డయాబెటిస్ అనేది చాలా మందికి ఆలస్యంగా తెలిసే ఒక వ్యాధి. షుగర్ ఉన్న దాదాపు ప్రతి ఒక్కరూ మందులపై ఆధారపడి ఉంటారు. అయితే, వీళ్లు తమ ఆహారంలో ఏం తినాలి, ఏం తినకూడదు అనే దానిపై క్లారిటీ ఉండాలి. లేదంటే బ్లడ్ షుగర్ లెవల్స్ అమాంతం పెరిగే అవకాశం ఉంది. మధుమేహ రోగులు తమ మందులకే కాకుండా, ఆహారం విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఓ పరిశోధన ప్రకారం ప్రతి రోజూ ఓ పండు తింటే రక్తంలో షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయి.**

ఇంతకీ ఆ పండు ఏంటో తెలుసా?

టైప్ 2 డయాబెటిస్ లేదా ప్రీ-డయాబెటిస్ ఉన్నవారిలో పండ్లు తినడంపై ఎన్నో సందేహాలు, భయాలు ఉంటాయి. రక్తంలో చక్కెర స్థాయిలు (బ్లడ్ షుగర్) అకస్మాత్తుగా పెరిగిపోతాయనే భయంతో చాలామంది పండ్లను పూర్తిగా మానేస్తుంటారు. దీనివల్ల శరీరానికి అవసరమైన ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, సూక్ష్మపోషకాలు అందకుండా పోతాయి. వర్షాకాలం, వేసవి చివర్లో విరివిగా లభించే పియర్స్ (బేరిపండు) షుగర్ పేషెంట్లకు మంచిదా? కాదా? అనే చర్చ ఎప్పుడూ నడుస్తూనే ఉంటుంది. లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన ఐసీఎంఆర్ అధ్యయనం ప్రకారం, భారతదేశంలో దాదాపు 10.1 కోట్ల మంది డయాబెటిస్‌తో, మరో 13.6 కోట్ల మంది ప్రీ-డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సరైన, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారాల్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. పియర్స్ ఫ్రూట్ బ్లడ్ షుగర్ నియంత్రణకు అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే ప్రత్యేకమైన ఫైబర్, తక్కువ తీపి, పాలీఫెనాల్స్ రక్తంలో చక్కెర స్థాయిల్ని అదుపులో ఉంచడానికి ఎంతగానో తోడ్పడతాయి.

రక్తంలో చక్కెర స్థాయిలను బేరి పండు ఎలా నియంత్రిస్తుంది?



రక్తంలో చక్కెర స్థాయిలను బేరి పండు ఎలా నియంత్రిస్తుంది?

నిపుణుల అభిప్రాయం ప్రకారం "షుగర్ ఉన్నవారు తీపి పండ్లను పూర్తిగా మానేయాలనేది ఒక పెద్ద అపోహ. పియర్స్ ఫ్రూట్ తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన అద్భుతమైన పండు. ఇందులో ఉండే పెక్టిన్ ఫైబర్ చక్కెర రక్తంలోకి త్వరగా చేరకుండా అడ్డుకుంటుంది."

తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ పియర్స్ గ్లైసెమిక్ ఇండెక్స్ విలువ 30 నుంచి 38 మధ్య మాత్రమే ఉంటుంది (55 కంటే తక్కువ ఉంటే లో-జీఐ అంటారు). దీనివల్ల ఇందులోని సహజ చక్కెరలు నెమ్మదిగా రక్తంలో కలుస్తాయి, ఇన్సులిన్ స్పైక్స్ రాకుండా చూస్తాయి.

#### బేరి పండు తినడం వల్ల ప్రయోజనాలు

**అధిక ఫైబర్ పరిమాణం:** ఒక మధ్యస్థ పరిమాణంలో ఉండే బేరి పండులో 5.5 నుంచి 7 గ్రాముల డైటరీ ఫైబర్ లభిస్తుంది.

**సాల్యుబుల్ ఫైబర్ (పెక్టిన్):** జీర్ణకోశంలో జెల్ లాంటి పొరను ఏర్పరిచి ఆహారం నెమ్మదిగా జీర్ణమయ్యేలా చేస్తుంది.

**ఇన్‌సాల్యుబుల్ ఫైబర్ (సెల్యులోజ్):** గట్ హెల్త్‌ను మెరుగుపరిచి, ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది.

శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు: దీని తొక్కలో ఫ్లేవనాయిడ్లు, ఆంథోసైనిన్లు పుష్కలంగా ఉంటాయి. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ అధ్యయనం ప్రకారం, ఆపిల్స్, పియర్స్ క్రమం తప్పకుండా తినడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ముప్పు 18% తగ్గుతుంది.

#### బేరి పండును షుగర్ పెరగకుండా ఎలా తినాలి?

**తొక్క తీయకుండా తినండి:** పండులోని మొత్తం ఫైబర్‌లో 60% పైగా దాని తొక్కలోనే ఉంటుంది. అలాగే యాంటీఆక్సిడెంట్లు కూడా తొక్కలోనే ఎక్కువ. జ్యూస్‌గా మార్చవద్దు: మిక్సీ పట్టి జ్యూస్ తాగితే ఫైబర్ నశిస్తుంది. దీనివల్ల పండు ద్రవరూపంలోకి మారి రక్తంలో చక్కెర స్థాయిల్ని వేగంగా పెంచేస్తుంది.

**ప్రొటీన్ లేదా హెల్తీ ఫ్యాట్స్‌తో కలిపి తీసుకోండి:** పియర్స్ ఫ్రూట్ ముక్కలతో పాటు 4--5 బాదం పప్పులు, వాల్‌నట్స్ లేదా గుమ్మడి గింజలుకలిపి తీసుకుంటే జీర్ణక్రియ మరింత నిదానంగా జరిగి షుగర్ అదుపులో ఉంటుంది. మరీ పండినవి కాకుండా దోరగా ఉన్నవి ఎంచుకోండి: బాగా మెత్తబడిన పండ్లలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. కాస్త గట్టిగా, క్రంచీగా ఉండే దోర పండ్లు రక్తంలో చక్కెరను నియంత్రించడానికి ఉత్తమం.

చాలా మంది అడిగే ప్రశ్నలు

చాలా మంది అడిగే ప్రశ్నలు

#### బేరి పండు తింటే రక్తంలో చక్కెర పెరుగుతుందా?

పెరగదు. తక్కువ జీఐ, అధిక ఫైబర్ ఉండటం వల్ల ఇది రక్తంలో గ్లూకోజ్‌ను నెమ్మదిగా విడుదల చేస్తుంది. డయాబెటిస్‌కు ఆపిల్ కంటే బేరి పండు మంచిదా? ఆపిల్, పియర్స్ రెండూ మంచివే. అయితే బేరి పండులో ఉండే అరగని ఫైబర్ జీర్ణవ్యవస్థకు, కడుపు నిండిన భావన కలిగించడానికి ఆపిల్ కంటే కొంచెం మెరుగ్గా పనిచేస్తుంది.

#### షుగర్ పేషెంట్లు దీనిని రోజూ తినొచ్చా?


నిరభ్యంతరంగా రోజూ ఒక మధ్యస్థ పరిమాణ పండును తినవచ్చు. ఉదయం అల్పాహారం తర్వాత (మిడ్-మార్నింగ్ 11:00గాపీ) లేదా సాయంత్రం స్నాక్ సమయం ఉత్తమం. భారీ భోజనంతో కలిపి కాకుండా విడిగా తీసుకోవడం మంచిది.

# యంగ్‌గా కనిపించాలంటే...

వయసు పెరిగే కొద్దీ చర్మంపై ముడతలు, కాంతి తగ్గడం, శరీరంలో అలసట వంటి మార్పులు రావడం సహజం. అయితే, 55 ఏళ్ల వయసులోనూ నటుడు ఆర్. మాధవన్ మాత్రం తన ఎవర్‌గ్రీన్ లుక్‌తో ఫ్యాన్స్‌ను ఆకర్షిస్తున్నారు. ఆయన అందం వెనుక ఏదైనా ఖరీదైన చికిత్స లేదా ప్రత్యేక బ్యూటీ సీక్రెట్ ఉంటుందని చాలామంది అనుకుంటారు. కానీ తన జీవనశైలిలో భాగమైన సాధారణ అలవాట్లే తన ఆరోగ్యానికి, చర్మ సంరక్షణకు కారణమని మాధవన్ చెబుతున్నారు. అవేంటో ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం..

వయసు పెరుగుతున్నా అందం, ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను అదే స్థాయిలో కాపాడుకోవడం అందరి వల్ల సాధ్యం కాదు. కానీ 55 ఏళ్ల వయసులోనూ సఖి హీరో ఆర్. మాధవన్ మాత్రం తన ఎవర్‌గ్రీన్ లుక్‌తో అభిమానులను ఆశ్చర్యపరుస్తూనే ఉన్నారు. మెరిసే చర్మం, ఉత్సాహంగా కనిపించే వ్యక్తిత్వం, ఫిట్‌గా ఉండే శరీరాకృతి చూసి ఆయన యూత్‌ఫుల్ లుక్ రహస్యం ఏమిటో తెలుసుకోవాలని చాలామంది ఆసక్తి చూపుతుంటారు. ఆయన అందం వెనుక ఏదైనా ఖరీదైన చికిత్స లేదా ప్రత్యేక బ్యూటీ సీక్రెట్ ఉంటుందని చాలామంది అనుకుంటారు. సాంప్రదాయ జీవనశైలి, చిన్న చిన్న ఆరోగ్యకరమైన అలవాట్లే తన ఫిట్‌నెస్, చర్మ సంరక్షణకు ప్రధాన కారణమని మాధవన్ చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో తన ఫిట్‌నెస్, బ్యూటీ సీక్రెట్స్ షేర్ చేసుకున్నారు. చాలామంది కొంచెం ఎండ తగిలినా చర్మం పాడైపోతుందేమో అని ట్యాన్ వస్తుందేమో అని భయపడిపోతూ ఉంటారు.

# చర్మం ఫ్రెష్‌గా, కాంతివంతంగా ఉండటానికి...



**బ్యూటీ టిప్స్ చెప్పిన హీరోయిన్ శ్రద్ధా కపూర్ శ్రద్ధా కపూర్ తన యాక్టింగ్‌తో పాటు తాజా, కాంతివంతమైన, ఫ్రెష్ లుక్‌తో ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటుంది. అయితే ఈ గ్లో కోసం ఆమె ఎప్పుడూ కష్టమైన బ్యూటీ రొటీన్‌నే అనుసరిస్తుందని అనుకుంటే పొరపాటే. రోజువారీ జీవితంలో పాటించే కొన్ని సింపుల్ అలవాట్లకే ఆమె ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. సరైన ఆహారం తీసుకోవడం, నీరు తాగడం, కొబ్బరి నీటిని తీసుకోవడం, మేకప్‌తో నిద్రపోకుండా ఉండటం వంటి చిన్న విషయాలపై శ్రద్ధ పెడుతుంది. మరి శ్రద్ధా కపూర్ ఫ్రెష్ లుక్ వెనుక ఉన్న ఈ సాధారణ అలవాట్లు ఏమిటో ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం..**

బాలీవుడ్‌లో సహజమైన అందంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో శ్రద్ధా కపూర్ కూడా ఒకరు. సినిమాల్లో మేకప్‌తో కనిపించినా, సోషల్ మీడియాలో షేర్ చేసే ఫొటోల్లోనూ, బయట కనిపించే నో మేకప్ లుక్‌లోనూ ఆమె చర్మం తాజాగా, సహజమైన కాంతితో, ప్రకాశవంతంగా కనిపిస్తారు. ముఖ్యంగా ఎక్కువ మేకప్ లేకుండా కనిపించినప్పుడు కూడా ఆమె ముఖంలో ఉండే నేచురల్ గ్లో అభిమానులను ఆకట్టుకుంటుంది. అందుకే ఆమె అందం వెనుక ఉన్న స్కిన్‌కేర్ రొటీన్, రోజువారీ అలవాట్ల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి చాలామందికి ఉంటుంది.

అయితే శ్రద్ధా అందం కేవలం బ్యూటీ ప్రొడక్ట్స్ వల్లే వచ్చిందని చెప్పలేం. చర్మ సంరక్షణతో పాటు ఆమె తీసుకునే ఆహారం, నీరు తాగే అలవాటు, నిద్ర, మేకప్ విషయంలో తీసుకునే జాగ్రత్తలు కూడా ఆమె రొటీన్‌లో భాగం అని ఆమె చెబుతున్నారు. రోజూ కొబ్బరి నీరు తాగడం నుంచి రాత్రి మేకప్ తొలగించి నిద్రపోవడం వరకు ఆమె పాటించే కొన్ని సాధారణ అలవాట్లను శ్రద్ధా షేర్ చేసుకున్నారు. మరి శ్రద్ధా కపూర్ గ్లోయింగ్ స్కిన్ వెనుక ఉన్న ఈ సింపుల్ బ్యూటీ అలవాట్లు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం..

#### సరిపడినంత నీరు

మనం ఆరోగ్యంగా ఉండటంతో పాటు, చర్మం ఆరోగ్యంగా, గ్లోయింగ్‌గా ఉండటానికి శరీరంలో తగినంత నీరు ఉండటం ముఖ్యం. శ్రద్ధా కపూర్ కూడా రోజంతా ఎక్కువగా నీరు తాగడానికి ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. సరైన హైడ్రేషన్ శరీర సాధారణ పనితీరుకు అవసరం. నీరు తాగడం ఒక్కటే చర్మ సమస్యలకు పరిష్కారం కాకపోయినా, ఆరోగ్యకరమైన జీవనశైలిలో ఇది ముఖ్యమైన అలవాటు. నీరు శరీరాన్ని డీటాక్స్ చేస్తుంది.


#### కొబ్బరి నీరు ఉండాల్సిందే!


నీటితో పాటు రోజుకు కనీసం ఒకసారి కొబ్బరి నీరు తాగుతానని శ్రద్ధా చెప్పారు. కొబ్బరి నీటిలో పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లు ఉంటాయి. ముఖ్యంగా వేడి వాతావరణంలో ద్రవాలు, ఎలక్ట్రోలైట్లను అందించడంలో ఇది ఎంతో సహాయపడుతుంది. కొబ్బరి నీరు తాగడం వల్ల మొటిమలు, వృద్ధాప్య లక్షణాలు త్వరగా రాకుండా అడ్డుకుంటాయి.

#### నో జంక్ ఫుడ్

చర్మ సంరక్షణలో బయట నుంచి ఉపయోగించే క్రీములు, సీరమ్‌లతో పాటు ఆహారం కూడా ముఖ్యమే. శ్రద్ధా జంక్ ఫుడ్‌ను తగ్గించి, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడానికి ప్రయత్నిస్తానని చెప్పింది. పండ్లు, కూరగాయలు, ప్రోటీన్, తృణధాన్యాలు వంటి పోషకమైన ఆహారాలను సమతుల్యంగా తీసుకోవడం మొత్తం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. తన ఆహారంలో వీగన్ పదార్థాలను చేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కూడా ఆమె పేర్కొన్నారు. దీనివల్ల ఆమె ముఖంలో సహజమైన కాంతి కనిపిస్తుంది.

#### మేకప్‌తో ఎప్పుడూ నిద్రపోకూడదు






శ్రద్ధా చెప్పిన ముఖ్యమైన బ్యూటీ రూల్స్‌లో మేకప్‌తో నిద్రపోకపోవడం ఒకటి. పడుకునే ముందు మేకప్‌ను పూర్తిగా తొలగించి, ముఖాన్ని శుభ్రం చేసుకోవడం మంచి అలవాటు. మేకప్‌ను ఎక్కువ సేపు అలాగే ఉంచడం వల్ల కొందరిలో రంధ్రాలు మూసుకుపోవడం లేదా చర్మంలో చికాకు వంటి సమస్యలు రావచ్చు.

#### బయటకు వెళ్లే ముందు సన్‌స్క్రీన్

పగటిపూట బయటకు వెళ్లేటప్పుడు సన్‌స్క్రీన్ ఉపయోగించడం కూడా శ్రద్ధా పాటించే అలవాట్లలో ఒకటి. సూర్యుడి ఖఎ కిరణాల నుంచి చర్మాన్ని రక్షించుకోవడానికి సన్‌స్క్రీన్ ఉపయోగించడం ముఖ్యం. దీనితో పాటు తగినంత నిద్ర, వ్యాయామం, ఒత్తిడిని నియంత్రించుకోవడం కూడా ఆరోగ్యకరమైన చర్మానికి సహాయపడే జీవనశైలి అలవాట్లు. శ్రద్ధా కపూర్ చెప్పిన బ్యూటీ సీక్రెట్లలో ఖరీదైన ఉత్పత్తుల కంటే రోజువారీ అలవాట్లకే ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తుంది.

# ములుగు నుంచే 'మెగా రోడ్ల'కు శ్రీకారం!

- రూ.16 వేల కోట్లకుపైగా భారీ ప్రణాళికలు
- 2,145 రహదారులు.. 7,448 కి.మీ.
- నేడు ములుగులో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీకారం






**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):** గ్రామీణ ప్రాంతాల రూపురేఖలను మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అతిపెద్ద రహదారి అభివృద్ధి కార్యక్రమానికి ములుగు జిల్లా వేదికగా నిలవనుంది. నేడు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించి, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న రూ.16,007 కోట్ల రహదారి అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు.

తొలి దశలో 2,145 రహదారులను 7,448 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. గ్రామ పంచాయతీలను మండల కేంద్రాలతో, మండల కేంద్రాలను జిల్లా కేంద్రాలతో, జిల్లా కేంద్రాలను రాష్ట్ర ప్రధాన కేంద్రాలతో అనుసంధానించేలా భారీ నెట్‌వర్క్‌కు రూపకల్పన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు పల్లెల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

గ్రామం నుంచి రాష్ట్ర కేంద్రం వరకు..

ప్రభుత్వ ప్రణాళికలో భాగంగా ప్రతి గ్రామాన్ని మండల కేంద్రంతో రెండు వరుసల రహదారితో, మండల కేంద్రాన్ని జిల్లా కేంద్రంతో నాలుగు వరుసల రహదారితో, జిల్లా కేంద్రాన్ని రాష్ట్ర కేంద్రంతో ఆరు వరుసల రహదారితో అనుసంధానించాలన్నది ప్రధాన లక్ష్యం. దీంతో ప్రస్తుతం మారుమూల ప్రాంతాలుగా ఉన్న అనేక గ్రామాలకు వేగవంతమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

15 ఏళ్ల నిర్వహణ బాధ్యత కూడా..

రహదారుల నిర్మాణంతోనే కార్యక్రమం ముగియకుండా వాటి నాణ్యత, మన్నికకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో పనులు చేపట్టనుండగా, ప్రభుత్వం--నిర్మాణ సంస్థల భాగస్వామ్యంతో నిధులు సమకూర్చనున్నారు. నిర్మాణం పూర్తయిన అనంతరం 15 సంవత్సరాల పాటు సంబంధిత నిర్మాణ సంస్థలే రహదారుల నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో నిర్మాణ నాణ్యతతో పాటు దీర్ఘకాలిక నిర్వహణపై కూడా బాధ్యత ఉండనుంది.

రైతు నుంచి విద్యార్థి వరకు.. ప్రయోజనమే

మెరుగైన రహదారులతో గ్రామీణ ప్రజలకు అనేక ప్రత్యక్ష ప్రయోజనాలు కలగనున్నాయి. రైతులు పంటలను మార్కెట్లకు వేగంగా తరలించుకోవడం, విద్యార్థులు విద్యాసంస్థలకు సులభంగా చేరుకోవడం, అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వేగంగా చేరుకోవడం, గ్రామీణ ప్రాంతాలకు పెట్టుబడులు--ఉపాధి అవకాశాలు పెరగడం వంటి మార్పులు చోటుచేసుకోనున్నాయి.

ఏజెన్సీ ప్రాంతాలకు మరింత ఊతం

అటవీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలు అధికంగా ఉన్న ములుగు జిల్లాకు ఈ కార్యక్రమం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. మారుమూల గ్రామాలకు రహదారి అనుసంధానం మెరుగుపడితే విద్య, వైద్యం, వ్యవసాయం, మార్కెటింగ్, పర్యాటకం తదితర రంగాల్లో అభివృద్ధికి మరింత అవకాశం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయి భారీ రహదారి కార్యక్రమానికి ములుగును ప్రారంభ వేదికగా ఎంపిక చేయడం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం స్పష్టమవుతోంది.

సీతక్క నియోజకవర్గం నుంచే..

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గం నుంచే ఆమె శాఖకు సంబంధించిన రాష్ట్రస్థాయి ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుండటం విశేషం. ములుగు నుంచి ప్రారంభమయ్యే ఈ రహదారి ప్రస్థానం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల రూపురేఖలను మార్చే కొత్త అధ్యాయానికి నాంది పలకనుందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# సామాజిక స్ఫూర్తిని చాటిన 'అకాన్ ఆహ్వానం-2026'





**హైదరాబాద్ బ్యూరో , ఆగస్టు 15 (నినాదం):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని అకాన్ 'అకాన్ ఆహ్వానం--2026' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించింది. 'పే యాజ్ యూ ప్లీజ్' కాన్సెప్ట్‌తో అరిటాకు భోజనం, లైవ్ మ్యూజిక్‌ను అందిస్తూ.. అతిథులు తమకు తోచినంత మొత్తాన్ని చెల్లించే విధానాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆటిజం పిల్లలు, న్యూరోడైవర్జెంట్ యువత కోసం పనిచేస్తున్న ది గుడ్ టాక్ ఫ్యాక్టరీ ఫౌండేషన్ కు అందించనుంది. తెలంగాణ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్, ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నటి, విద్యావేత్త దాస్యం గీతా భాస్కర్, టెంపుల్ ఆర్కిటెక్ట్ లిలిఆనంద్ సాయి, యూనిసెఫ్ హైదరాబాద్ ఫీల్డ్ ఆఫీస్ చీఫ్ డా. జెలాలెం బిర్హాన్ తఫ్ఫేజ్, జర్నలిస్టులు అంజలి, స్వప్న, నటుడు కాదంబరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 500 మంది అతిథులు కార్యక్రమానికి హాజరై తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. అకాన్ మేనేజిం గ్ డైరెక్టర్ నిహాల్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగపడే అర్థవంతమైన కార్యక్రమాలను నిర్వహించడం తమకు ఆనందంగా ఉందన్నారు. ప్రతి చిన్నారికి హక్కులతో పాటు ఎదగడానికి సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సాధించినట్టని అన్నారు. ఇలాంటి పిల్లలకు అన్ని అవకాశాలు, సమాజం నుంచి నిరంతర సహకారం అవసరమని పేర్కొన్నారు. దాస్యం గీతా భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇతరుల పరిస్థితులను గౌరవం, సహానుభూతితో అర్థం చేసుకోవాలని కోరారు.




## రూ.1500 నుంచి
## రూ.750కి పడిపోనున్న షేరు ధర




- ఇదే అసలు కారణం

**కానీ 100 షేర్లు కొంటే 200 షేర్లొస్తాయ్..!**

***క్యాపిటల్ గూడ్స్ రంగానికి చెందిన స్మాల్ క్యాప్ కేటగిరి కంపెనీ కిర్లోస్కర్ న్యూమాటిక్ లిమిటెడ్ కీలక ప్రకటన చేసింది. ఈ సంస్థ బోర్డు డైరెక్టర్స్ ఇటీవలే స్టాక్ స్ప్లిట్ చేపట్టాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన రికార్డు తేదీని ఆగస్టు 18గా నిర్ణయించారు. అంటే ఆగస్టు 17వ తేదీలోపు షేర్లు కొన్నవారికి 1 కొంటే 2, 100 కొంటే 200 షేర్లు వస్తాయి. మరి ఈ స్టాక్ స్ప్లిట్ గురించిన వివరాలు తెలుసుకుందాం.***

నుంచి కీలక ప్రకటన వెలువడింది. ఈ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ 2:1 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేపట్టాలని ఆమోదం తెలుపారు. ఈ స్టాక్ స్ప్లిట్ రికార్డు డేట్ ఆగస్టు 18గా నిర్ణయించామని వెల్లడించింది. ఆగస్టు 18వ తేదీకి ఇంకా కేవలం 4 రోజులు ఉంది. ఈ కంపెనీ షేర్స్ ఎక్స్ - స్ప్లిట్ ట్రేడింగ్ చేయనున్నాయి. మరోవైపు ఈ కంపెనీ షేరు గత ఏడాదిలో 17 శాతం లాభాన్ని అందించింది. స్టాక్ స్ప్లిట్ తర్వాత రూ. 1510 స్థాయి నుంచి సుమారు రూ. 755 స్థాయికి దిగిరానుంది. కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. ఇటీవలే కిర్లోస్కర్ న్యూమాటిక్ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశమై కంపెనీస్ యాక్ట్ 2013 లోని సెక్షన్ 61కి అనుగుణంగా 2:1 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేయాలని నిర్ణయించారు. దీని అర్థం రూ. 2 ఫేస్ వ్యాల్యూ ఉన్న 1 ఈక్విటీ షేరును రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉన్న 2 ఈక్విటీ షేర్లుగా స్ప్లిట్ చేయనున్నారు. ఈ స్టాక్ స్ప్లిట్ రికార్డు డేట్ ఆగస్టు 18, 2026గా నిర్ణయించినట్లు కంపెనీ తెలిపింది. సెబీ నిబంధనల ప్రకారం ౦౦1 సెటిల్మెంట్ ఉంటుంది కాబట్టి ఆగస్టు 17వ తేదీలోపు షేర్లు కొన్నవారికి ఆ తర్వాత రోజు నుంచి డబుల్ అవుతాయి. అయితే, అందుకు తగినట్లుగానే షేరు ధర తగ్గుతుందని గమనించాలి.

#### పెన్నీ స్టాక్స్ కాసుల వర్షం..

**గత 6 నెలల్లో 198 శాతం పెరిగిన 11 షేర్లు ఇవే.. మీ దగ్గర ఉన్నాయా?**

స్టాక్ మార్కెట్ చివరి ట్రేడింగ్ సెషన్లో కిర్లోస్కర్ న్యూమాటిక్ కంపెనీ లిమిటెడ్ షేరు 0.67 శాతం లాభంతో రూ. 1509 వద్ద ముగిసింది. ఈరోజు ఫ్లాట్‌గా అదే ధర వద్ద ట్రేడవుతోంది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 2,197.10 వద్ద ఉండగా 52 వారాల కనిష్ఠ ధర రూ. 990.10 వద్ద ఉంది. గత వారం రోజుల్లో ఈ షేరు 4 శాతం లాభాన్ని ఇచ్చింది. గత నెల రోజుల్లో సుమారు 14 శాతం నష్టపోయింది. గత ఆరు నెలల్లో 3 శాతం లాభాన్ని ఇచ్చింది. గత ఏడాది కాలంలో 17 శాతం పెరిగింది. గత ఐదు సంవత్సరాల కాలంలో 155 శాతం లాభాన్ని అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. 9800 కోట్ల వద్ద ఉంది.

## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మిరుదొడ్డి, ఆగస్టు 15 (నినాదం):** మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం రోజున 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ సత్తు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, దేశ ప్రగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో దేశభక్తిని, సేవాభావాన్ని పెంపొందించడమే తమ పాఠశాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పాఠశాలలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు. విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగిన దుబ్బరాజోళ్ల సంపత్ ను పాఠశాల కరస్పాండెంట్ సత్తు సుజాత శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయాలు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథి దుబ్బరాజోళ్ల సంపత్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆంజనేయులు, సంపత్, తిరుమలరాని, మంగ, స్వప్న,రజిత వాణి తో పాటు విద్యార్థులు , తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే ప్రభుత్వ పాలన లక్ష్యం

- మంత్రి దామోదర రాజనర్సింహా
- స్వయం సహాయక సంఘాలకు రూ.225 కోట్ల రుణాల పంపిణీ
- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**సంగారెడ్డిబ్యూరో, ఆగస్టు 15 ( నినాదం ):** నెహ్రూ, ఇందిరమ్మ అందించిన సంక్షేమ స్ఫూర్తితో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. పేదలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు తదితర వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.

జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 225 కోట్ల విలువైన రుణాల చెక్కును మంత్రి పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు, చిన్నతరహా వ్యాపారాలు, ఉపాధి కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన కలెక్టర్ హైమావతి



**సిద్ధిపేట, బ్యూరో ఆగస్టు,15( నినాదం):** 80 వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో జిల్లా కలెక్టర్ హైమావతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటిషర్ల నుండి స్వాతంత్రాన్ని పొందడానికి ఎందరో తమ జీవితాలను త్యాగం చేశారని ఆ త్యాగధనులందరినీ గుర్తు చేసుకుంటు వారి మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి అందరు కృషిచేయాలని అన్నారు. స్వాతంత్రం కోసం కృషి చేసిన ఎంతో మంది మహనీయుల వారి ఆశయాలను అనుగుణంగా దేశ సేవలో మనందరం కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు , కలెక్టరేట్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అసమానతల నిర్మూలనే అసలైన స్వేచ్ఛ

బడుగులకు న్యాయం
కాంగ్రెస్‌తోనే సాధ్యం..
చిట్కుల్ లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్



**పటాన్చెరు, ఆగస్టు 15(నినాదం):** దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలు పూర్తిగా తొలగిపోయినప్పుడే భారత్ నిజమైన ప్రగతి బాటలో పయనిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ తెలిపారు. శనివారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లోని ఎస్సీ కాలనీ, మాల బస్తి, అంగన్వాడి కేంద్రం, దుర్గమ్మ గుడి సమీపం, ముదిరాజ్ కాలనీ, గొల్ల కురుమ యాదవ సంఘం, వార్డు కార్యాలయం, పల్లె దవకాన, చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద, పలు కాలనీలలోని జాతీయ జెండా ఆవిష్కరణ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, స్థానిక ఎన్.ఎం.ఆర్ క్యాంపు కార్యాలయంలో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, వలస పాలన నుంచి దేశానికి స్వేచ్ఛను సాధించిపెట్టిన కాంగ్రెస్ పార్టీ, నేడు బడుగు, బలహీన వర్గాల ఆర్థిక వికాసానికి, సామాజిక భద్రతకు ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తోందని కొనియాడారు. సామాజిక అసమానతలను రూపుమాపేందుకు విద్యా, వైద్య, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని ఆయన వివరించారు. బడుగు వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నెలకొల్పడంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా యువతకు సాంకేతిక నైపుణ్య శిక్షణ అందిస్తున్నారని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు 'మహాలక్ష్మి' పథకం ద్వారా రూ. 500 కే గ్యాస్ సిలిండర్, 'గృహ జ్యోతి' కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' ఉచిత వైద్య పరిమితిని రూ. 10 లక్షలకు పెంచడం ద్వారా ప్రతీ పేద కుటుంబానికి కొండంత అభయం లభించిందని తెలిపారు. నేడు సంగారెడ్డి కేంద్రంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన డిజిటల్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టనున్నారని ఈ రేషన్ కార్డుల ద్వారా సంక్షేమ ఫలాలు నేరుగా అర్హులకు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే 'రాజీవ్ యువ వికాసం' ద్వారా యువత స్వయం ఉపాధి సాధించడానికి రుణాలు, రాయితీలు లభిస్తున్నాయని వివరించారు. మహనీయులు కలలు కనిన సమానత్వ ప్రాతిపదికన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగడమే నాటి స్వాతంత్ర్య పోరాట యోధులకు ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వృద్ధుడు.. పోలీసుల దర్యాప్తు




**పటాన్చెరు, ఆగస్ట్ 15 (నినాదం ):** సంగారెడ్డి జిల్లా: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని రామచంద్రాపురం పోలీసు స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగుచూసింది. రామచంద్రాపురంలోని ఓ ఆలయంలో మైనర్ బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఆలయ ప్రాంగణంలో బాలికతో వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయాన్ని స్థానికులు గుర్తించినట్లు సమాచారం. ఆలయానికి బయట నుంచి తాళం వేసి, లోపల బాలికతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆలయంలో అర్చకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సాయన్న అనే వృద్ధుడిపై ఈ ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న స్థానికులు, గ్రామ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆలయంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. బాలికకు సంబంధించిన వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

# భౌరంపేట్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఎస్సీ బస్తీలో జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 15 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భౌరంపేట్‌లోని ఎస్సీ బస్తీలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండాకు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో అభివృద్ధిలో అగ్రగామిగా పటాన్చెరు

- జాతీయ జెండాను ఎగరవేసిన ఎమ్మెల్యే జీఎంఆర్



**పటాన్చెరు, ఆగస్టు 15(నినాదం):** ప్రజల సహకారం.. సమష్టి కృషితో పటాన్చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళుతున్నామని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిహెచ్ఎంసి కార్యాలయం, ఎంపీడీవో, ఎమ్మార్వో, వివిధ సంక్షేమ సంఘాల కార్యాలయాలతో పాటు, మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన పంద్రాగస్టు వేడుకల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాలను ఎగురవేశారు. ప్రజలందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, మార్చ్ ఫాస్ట్ కార్యక్రమాలు అందరిని అలరించాయి. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. మినీ ఇండియా గా పేరుందిన పటాన్చెరులో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందించేలా పటాన్చెరులో ప్రాథమిక పాఠశాల నుండి పీజీ కళాశాల వరకు ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో విద్యను అందించడం జరుగుతుందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల సైతం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎంతో నమ్మకంతో వారి భవిష్యత్తు కోసం కష్టపడుతున్నారని అన్నారు. నమ్మకాన్ని ఎక్కడా వమ్ము చేయకుండా విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చన్నారు. స్థానిక స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశాలు క్రీడల ద్వారా లభిస్తాయని, ప్రతిభ కలిగిన క్రీడాకారులు ప్రపంచ వేదికపై దేశానికి, రాష్ట్రానికి, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడాకారుడికి 50 వేల రూపాయల ప్రోత్సాహక బహుమతి..పటాన్చెరు పట్టణానికి చెందిన నర్రా వీరస్వామి ఇటీవల శ్రీలంకలో జరిగిన బాడ్మింటన్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా.. ఎమ్మెల్యే జీఎంఆర్ చేతుల మీదుగా 50వేల రూపాయల ప్రోత్సాహంగా బహుమతి అందించి అభినందనలు తెలిపారు. అనంతరం స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు మూడు లక్షల 80 వేల రూపాయల సొంత నిధులతో నగదు బహుమతులు అందజేశారు. యువజన వికాస సమితి ఆధ్వర్యంలో 80 అడుగుల జాతీయ జెండాతో ప్రత్యేక పరేడ్ అందరిని ఆకర్షించింది. మార్చ్ ఫాస్ట్ విభాగంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి, మంజీరా హై స్కూల్ కు ద్వితీయ బహుమతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కి తృతీయ బహుమతి లభించింది. సాంస్కృతిక కార్యక్రమాల విభాగంలో శాంతినికేతన్ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి, జిల్లా పరిషత్ హై స్కూల్ పటాన్చెరుకు ద్వితీయ బహుమతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కు తృతీయ బహుమతి లభించింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, క్రీడాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

## అనుమానాస్పద వ్యక్తి వద్ద పసిపాప రక్షించిన పోలీసులు



**వికారాబాద్, ఆగస్టు 15(నినాదం ):** వికారాబాద్ పట్టణంలోని మల్లికార్జున స్వామి ఆలయం, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి వద్ద ఉన్న సుమారు 10 నెలల మగ శిశువును పోలీస్, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది సంయుక్తంగా రక్షించి, ప్రస్తుతం శిశు గృహంలో సంరక్షణలో ఉంచినట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీకాంత్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని, ఈ బాబుకు సంబంధించిన అసలైన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు లేదా ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో (ఒరిజినల్ ఐడిలతో ) ఎన్నెపల్లి చౌరస్తాలోని బాలరక్ష భవన్‌లో గానీ లేదా 8919413995, 9640863896 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# అసమానతలు లేని సమాజ నిర్మాణమే స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 15(నినాదం):** కలెక్టరేట్, ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు మువ్వన్నెల జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి ఎందరో మహనీయుల త్యాగఫలితంగానే బానిస సంకెళ్ల నుంచి భారతావని విముక్తి లభించిందని,సమాజంలో అసమానతలు నిర్మూలించటమే వారికిచ్చే నిజమైన నివాళిగా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి గారు పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వివిధ చోట్ల జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్ పై జాతీయ జెండాను ఎమ్మెల్యే ఎగురవేసి, జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేశారు. అనంతరం, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో జరిగిన స్వాతంత్ర్య వేడుకకల్లో జిల్లా ఇన్చార్జ్ మంత్రి, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు జాతీయ జెండాను ఆవిష్కరించగా,స్వాతంత్ర్య సమరయోధులను, సమాజ సేవలో ముందుకు సాగుతున్న ప్రముఖులను, ఉత్తమ పనితీరు కనబర్చిన అధికారులను ప్రత్యేకంగా సన్మానించటం జరిగింది. అన్ని సామాజిక వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ నేతృత్వంలోని మన ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వారు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ శాఖల స్టాళ్లు ఆకట్టుకున్నాయి.

# దేశ ప్రగతికి పునరంకితమవుదాం

- అడిషనల్ కలెక్టర్ సంగీత
- కలెక్టరేట్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**సంగారెడ్డిబ్యూరో, ఆగస్టు 15 (నినాదం ):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ సముదాయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సముదాయ ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్ సంగీత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నామని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని సూచించారు. ముఖ్యంగా యువత నూతన ఆలోచనలు, నైపుణ్యాలతో ముందుకు సాగుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించిన విజన్‌కు అనుగుణంగా అడుగులు వేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఆమె సూచించారు. ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జెండాకు అవమానం



**వికారాబాద్, ఆగస్టు 15(నినాదం ):** 80 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భం గా శనివారం జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేయాల్సిన నేపథ్యంలో జిల్లా పరిధిలోని నవాబు పేట మండలం యావపూర్ గ్రామ పంచాయతీ పై ఎగుర వేసిన జాతీయ జెండాకు అవమానం జరిగింది. త్రివర్ణం లోని కాషాయపు రంగు పైభాగం లో ఉండాలి. అయితే అవగాహన లోపంతో ఆకుపచ్చ రంగు ను పై కి చేసి ఎగురవేయడం తో జాతీయ జెండాకు అవమానం జరిగిందని గ్రామస్తులు కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. ఈలాంటి పొరపాటు మరోసారి చోటుచేసుకోకుండా జాగ్రత పాడాలని సూచించారు.

## వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు



**అల్వాల్, ఆగస్టు 15( నినాదం):** అల్వాల్ సర్కిల్ లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు సర్కిల్లోని కాలనీలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఆర్డీవో, తహసల్దార్ ఆర్డీవో శ్యాంప్రకాష్, తాసిల్దార్ రాములు, అల్వాల్ పోలీస్ స్టేషన్లో సీఐ ప్రశాంత్ ఎగరవేశారు. పలు కాలనీలలో కాలనీ అధ్యక్షులు కాలనీవాసులతో జెండా ఎగరవేశారు

# వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

- ఉప్పొంగిన దేశభక్తి



**వికారాబాద్, ఆగస్టు 15(నినాదం ):** భిన్నత్వంలో ఏకత్వమైన నేపథ్యంలో గొప్ప, పేద, కుల, మత వ-యోబేధం లేకుండా దేశ ప్రతి పౌరుడు సంతోషంగా కల్మషం లేకుండా జరుపుకునే ఏకైక పండగ జెండా పండగా ఈ పండగను జిల్లా ప్రజలు 80 వ స్వాంతంత్ర దినోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ తరుణంలో వాడవాడలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. కన్నుల పండగగా సాగిన ఈ వేడుకల్లో జాతీయ జెండా ను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. జాతీయగితాన్ని ఆలపించి దేశ భక్తిని చాటుకున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్ లో స్థానిక శాసన సభ్యుడు, తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ త్రివర్ణ పాతకాన్ని ఎగురవేశారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు, వందన సమర్పణ చేశారు. అదేవిధంగా పోలీసుల చేత గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాలపై సబంధిత అధికారులు, పాఠశాల లపై ప్రధానోపాధ్యాయులు, జాతీయ పథకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అనంతరం ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అంధించిన వారికి పురస్కారాలు అందజేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి న నేపథ్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రజలను, ప్రభుత్వాన్ని ఉద్దేశించి శాశనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయా పథకాలను, అమలు చెయనున్న పథకాలను వివరించారు. స్వాంతంత్ర సమరయోధుల త్యాగాలను, రాష్ట్ర సాధనలో అసువులు బాసిన అమరుల త్యాగాలను ఆయన స్మరించుకున్నారు. వారి సేవలను కొనియాయారు. సీ ఎం రేవంత్ రెడ్డి పాలనలో జిల్లా అభివృద్ధి కోసం పాటుపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే లు, మున్సిపల్ చైర్మెన్లు, మాజీ ఎమ్మెల్యే లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వానికి రెండు కళ్లు

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**కరీంనగర్, ఆగస్టు 15 (నినాదం):** అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ప్రగతికి కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించి, ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధులు, త్యాగమూర్తులు, రాజ్యాంగ నిర్మాతల సేవలను స్మరించుకోవాలని మంత్రి అన్నారు. ప్రజా పాలనలో స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలే లక్ష్యంగా ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలు: మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో మహిళలు, బాలికలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, ఇప్పటి వరకు 8.03 కోట్ల ప్రయాణాల ద్వారా రూ. 366.31 కోట్ల ప్రయోజనం చేకూరిందన్నారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకం కింద 1.58 లక్షల మందికి 9.23 లక్షల సిలిండర్లు అందించి రూ. 29.78 కోట్ల సబ్సిడీ చెల్లించామని తెలిపారు. గృహజ్యోతి కింద 1.71 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తూ రూ. 182.30 కోట్లు ప్రభుత్వం భరించిందన్నారు. రైతులకు 1.92 లక్షల మంది రైతులకు రూ. 206.82 కోట్లు జమ చేయగా, సన్నరకం ధాన్యం విక్రయించిన 28,659 మంది రైతులకు రూ. 71.17 కోట్ల బోనస్ అందించామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తొలి విడతగా 10,506 ఇళ్లు మంజూరు చేసి, 8,557 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని, రూ. 222 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 1,500 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. చేయూత పింఛన్ల ద్వారా జిల్లాలో 1.32 లక్షల మందికి నెలకు రూ. 30.60 కోట్లు అందిస్తున్నామని, అర్హులకు కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. 47,138 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, 97,013 కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేశామని, 3.22 లక్షల కుటుంబాలకు నెలకు 6,063 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వైద్యం, విద్యకు ప్రాధాన్యం: రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా జనవరి నుంచి ఇప్పటివరకు 14,932 మందికి ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించి రూ. 42.75 కోట్లు ఖర్చు చేశామని మంత్రి తెలిపారు. చొప్పదండిలో రూ. 17.50 కోట్లతో 30 పడకల, రూ. 37 కోట్లతో 100 పడకల ప్రాంతీయ వైద్యశాల నిర్మాణం పూర్తయిందని, మానకొండూరులో రూ. 15 కోట్లతో ఆయుష్ ఆసుపత్రి, వైద్య కళాశాల ప్రాంగణంలో రూ. 26 కోట్లతో నర్సింగ్ కళాశాల భవనం నిర్మిస్తున్నామని చెప్పారు. చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణం ప్రారంభించామని, 83 పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో బోధన ప్రారంభించామని తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమంలో 5,351 మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది కరీంనగర్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.

**వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి:**

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలు, పప్పుదినుసులు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద 51,517 కుటుంబాలకు 17 లక్షల పని దినాలు కల్పించి రూ. 41.20 కోట్ల వేతనాలు చెల్లించామన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి: కరీంనగర్ నగరంలో రూ. 840 కోట్ల పట్టణ సమగ్ర అభివృద్ధి, రూ. 50 కోట్ల పట్టణ మౌలిక వసతుల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. రూ. 158 కోట్ల సాధారణ నిధులతో రహదారులు, కాలువలు, తాగునీటి ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. భూభారతి చట్టం అమలులో భాగంగా మున్సిపల్ భూసర్వే చేపట్టి, తొలి దశలో 70 గ్రామాలను గుర్తించామని, 7 గ్రామాల్లో పునఃసర్వే జరుగుతోందన్నారు. సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, స్వాతంత్ర్య సమరయోధులు, పాత్రికేయులు, జిల్లా ప్రజలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మేయర్ కోలగాని శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ సత్తు మల్లేశం పాల్గొన్నారు.



# అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## దేశ స్వాతంత్ర్య ఉద్యమం ప్రపంచ దేశాలకు ఆదర్శం. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్‌రెడ్డి



**కరీంనగర్, ఆగస్టు 15(నినాదం):** కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భరతమాత, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. డా. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య ఉద్యమం ప్రపంచంలోని అనేక దేశాలకు ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలిచిందన్నారు. దేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని, ముఖ్యంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో పురోగతి సాధిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశ అభివృద్ధికి అనేక ప్రణాళికలు అమలవుతున్నాయని, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు కూడా ప్రతి ఏడాది మెరుగైన ఫలితాలు సాధిస్తూ, విద్యార్థులు ప్రముఖ విద్యాసంస్థల్లో ఉన్నత అవకాశాలు పొందడం ద్వారా సంస్థకు మంచి పేరు తీసుకొస్తున్నారని అన్నారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ ప్రతిభా పోటీలు, పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శకంగా సంక్షేమ సేవలు


## అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**కరీంనగర్, ఆగస్టు15(నినాదం):** ప్రజలకు రేషన్ సరుకులను మరింత పారదర్శకంగా, సులభంగా అందించేందుకు ఆధునిక సాంకేతికతతో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందిస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమమే ప్రజాపాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంత్రి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డులు ఉండగా, వాటి ద్వారా 3.42 కోట్ల మందికి నెలకు 6 కిలోల సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఏటీఎం కార్డు పరిమాణంలో ఉండే మన్నికైన కార్డుపై ప్రత్యేక సంకేత గుర్తు ఉండటంతో లబ్ధిదారుల వివరాలను సులభంగా గుర్తించడంతో పాటు నకిలీ కార్డులు, అక్రమ క్లెయిమ్‌లకు అడ్డుకట్ట వేయవచ్చని చెప్పారు. జిల్లాలో 2,76,908 కార్డులతో కలిపి జిల్లాలో మొత్తం 3,22,198 రేషన్ కార్డులు ఉన్నాయని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, రేషన్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. అనంతరం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ మహిళలకు మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, అదనపు డీసీపీ వెంకటరమణ, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రణవ్ జన్మదినం సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ

## శివాలయంలో అన్నదానం నిర్వహించిన పొనగంటి మల్లయ్య



**జమ్మికుంట, ఆగస్టు 15(నినాదం):** కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజక వర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్నగంటి మల్లయ్య వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని శివాలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు కేశవాపురంలో సుమారు 40 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం రైతుల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ, నిస్వార్థంగా నిజాయితీగా ప్రజా సేవ చేస్తున్న ప్రణవ్ బాబు భవిష్యత్తులో హుజురాబాద్ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగరవేస్తారని రాబోయే కాలానికి కాబోయే ఎమ్మెల్యే ప్రణవ్ బాబు అని పేర్కొన్నారు. అవినీతికి దూరంగా కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతర పాటుపడుతున్న ప్రణవ బాబు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి జిల్లా నాయకులు సాయిని రవి 15వ వార్డ్ కౌన్సిలర్ పాతకాల మౌనిక అనిల్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొనగంటి రవీందర్ మహిళా పట్టణ అధ్యక్షురాలు రేణుక శివకుమార్ గౌడ్ జమ్మికుంట యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రాచపల్లి సాగర్ పాతకాల ప్రవీణ్ చెందింది నాగేంద్ర రాచపల్లి గణేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# సహకార అర్బన్ బ్యాంకులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన పీఏసీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి



**కరీంనగర్, ఆగస్టు15(నినాదం):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకులో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీఏసీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు సభ్యులు, ఖాతాదారులు, శ్రేయోభిలాషులు, కరీంనగర్ నగర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సభ్యులు ముదుపు మోహన్, ముక్క భాస్కర్, ఈ. లక్ష్మణ్‌రాజు, మూల లక్ష్మి, ఏ. విద్యాసాగర్, నాగుల సతీష్, మార్కరాజు, బొమ్మరాతి సాయికృష్ణ, ముఖ్య కార్యనిర్వహణాధికారి నునుగొండ శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది పాల్గొని జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న

ప్రజాసేవలో ముందుకు సాగుతూ స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను కొనసాగించాలి



**కరీంనగర్, ఆగస్టు15(నినాదం):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి వెలిచాల ప్రజా కార్యాలయం, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, రైతుబజార్‌లో జరిగిన వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకుల నరసన్న మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధుల సేవలను స్మరించుకోవాలని, వారి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మీసాల శంకర్, ఓదేలు, రణవేణి సంపత్, మలోతు మాలతి, కాజా ఖాన్, బోనాల శ్రీనివాస్, పంజాల శ్రీనివాస్ గౌడ్, రుద్ర రాము, తప్పట్ల రాజు, పల్లె శివకుమార్, భూమయ్య, జగ్గని కనకయ్యతో పాటు అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అనంతరం కరీంనగర్ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లోనూ ఆకుల నరసన్న పాల్గొన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ చిత్రా మిశ్రా, మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సింగిల్ విండో సొసైటీలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు





**జమ్మికుంట, ఆగస్టు 15 (నినాదం):** జమ్మికుంటలోని సింగిల్ విండో సొసైటీలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఏసిఎస్ సొసైటీ చైర్మన్ పొన్నగంటి సంపత్ కుమార్ జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పొనగంటి సంపత్ మాట్లాడారు. ఎంతోమంది ప్రాణ త్యాగం చేయడం వలన స్వాతంత్రము సిద్ధించిందన్నారు. రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి తమ సొసైటీ అంకిత భావంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, సొసైటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, సొసైటీ సీఈవో వొజ్జ రవీందర్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లందకుంట లో....**

అపర భద్రాద్రిగా పేరుపొందిన ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద సొసైటీ చైర్మన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, ఎంతోమంది అమరవీరుల పోరాట ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందని వచ్చిన స్వాతంత్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పై ఉందని పేర్కొన్నారు. ఇల్లంతకుంట సొసైటీ ద్వారా ఎంతో మంది రైతులకు సకాలంలో ఎరువులు రుణాలు అందిస్తున్నామని రైతు సంక్షేమమే మా లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కందాల కొమురెల్లి డైరెక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉద్యోగులుగా జమ్మికుంట మున్సిపల్ సిబ్బంది

## కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న జి. రాజిరెడ్డి, ఏ. భాస్కర్



**జమ్మికుంట, ఆగస్టు 15 (నినాదం) :** జమ్మికుంట మున్సిపాలిటీలో ఉత్తమ ఉద్యోగులుగా మేనేజర్ జి. రాజిరెడ్డి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఏ. భాస్కర్ ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వీరు ప్రశంసాపత్రాలను అందుకున్నారు. జమ్మికుంట మున్సిపాలిటీ ఇంటి పన్ను వసూళ్లలో 100 శాతం వసూళ్లు సాధించి, వరుసగా రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విజయానికి మేనేజర్ జి. రాజిరెడ్డి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఏ. భాస్కర్ విశేష కృషి చేశారు. వారి సేవలను గుర్తించి ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసా పత్రాలు అందజేయడం పట్ల మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి చైర్‌పర్సన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, అధికారులు ఇతరులు జి.రాజిరెడ్డి, ఏ. భాస్కర్‌లను అభినందించారు.

## ఉత్తమ ఉద్యోగి పురస్కారం అందుకున్న ఎమ్మార్వో సుధాకర్



**జమ్మికుంట, ఆగస్టు 15 (నినాదం) :** జమ్మికుంట తహసీల్దార్ సుధాకర్ ఉత్తమ ఉద్యోగిగా రాష్ట్రమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. 80 గణతంత్ర దినోత్సవ సందర్భంగా కరీంనగర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా సేవలు అందించి తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన కరీంనగర్ కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రస్తుతం జమ్మికుంట తహసీల్దార్ గా పనిచేస్తున్న సుధాకర్ కు ఉత్తమ ఉద్యోగిగా ప్రశంస పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఎమ్మార్వో సుధాకర్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన ఈ సేవా పథకం తన పై మరింత బాధ్యత పెంచిందని తాను నిర్వహిస్తున్న విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు సేవ చేయడమే తన కర్తవ్యం అని పేర్కొన్నారు.

# డీసీసీ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం



**కరీంనగర్, ఆగస్టు 15(నినాదం)** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణుల సమక్షంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ తదితరులు చేసిన పోరాటాలు, త్యాగాల ఫలితంగానే నేడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దూరదృష్టితో పంచవర్ష ప్రణాళికలకు శ్రీకారం చుట్టి, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా దేశ అభివృద్ధికి బాటలు వేశారని పేర్కొన్నారు. నాటి కాంగ్రెస్ పాలకుల దూరదృష్టి ఫలితంగానే భారత్ అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, ఉప్పుల అంజని ప్రసాద్, ఎండీ తాజ్, వెన్న రాజమల్లయ్య, గడ్డం విలాస్‌రెడ్డి, వెన్నం రజితారెడ్డి, కర్ర రాజశేఖర్, ముస్తాక్ అహ్మద్, జువ్వాడి అమరేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## నగరంలోని పలు ప్రాంతాల్లో జాతీయ పతాకావిష్కరణ చేసిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు



**కరీంనగర్, ఆగస్టు 15(నినాదం):** కరీంనగర్ నగరవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి పూరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించి, ప్రజలతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. సునీల్‌రావు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. భారతదేశం ప్రపంచంలో బలమైన, అభివృద్ధి చెందిన ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని పేర్కొంటూ, దేశ ప్రగతితో పాటు కరీంనగర్ నగర సమగ్ర అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కోరారు. నగర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. వెంకటేశ్వర టాకీస్ సమీపంలోని నగర టాక్సీ స్టాండ్‌లో వాహన యజమానులు, డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలోనూ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. భగత్‌నగర్‌లోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంతో పాటు వెల్ఫేర్ అసోసియేషన్, చైతన్య యువజన సంఘం, ఆదర్శ యువజన సంఘం, జైభీమ్ యువజన సంఘం, ఛత్రపతి శివాజీ యువజన సంఘం, జైభూన్ యువజన సంఘం, పెద్దమ్మ యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే 43వ డివిజన్ భగత్‌నగర్, గోదాంగడ్డ, 20వ డివిజన్ రేకుర్తి విజయపురి కాలనీ, రామచంద్రపూర్ కాలనీలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, యువజన సంఘాల ప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



## బ్లూబెల్స్ హైస్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### దేశభక్తి, క్రమశిక్షణతో దేశాభివృద్ధికి కృషి చేయాలి: ప్రిన్సిపాల్ సునీత మనోహర్‌రెడ్డి

**కరీంనగర్, ఆగస్టు15(నినాదం):** హనుమాన్ నగర్‌లోని బ్లూబెల్స్ హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జంగా సునీత మనోహర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమని, వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశభక్తి, క్రమశిక్షణ, ఐకమత్యం, నిజాయితీతో దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు మంచి విలువలను అలవర్చుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. వేడుకల్లో విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాలు, ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఘనంగా జన హృదయనేత ప్రణవ్ జన్మదిన వేడుకలు

## ప్రత్యేక పూజలు రక్త దానాలు నిర్వహించిన అభిమానులు





**జమ్మికుంట, ఆగస్టు 15 (నినాదం)** దేశవ్యాప్తంగా శనివారం దేశ ప్రజలందరూ పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించు కుంటే హుజురాబాద్ నియోజకవర్గంలో పంద్రా గస్టు వేడుకలతో పాటు కాంగ్రెస్ నేత ప్రణవ్ బాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నేతలు ఆయన అభిమానులు కార్యకర్తలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి ప్రణవ్ బాబు పుట్టినరోజు సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలో భారీ ఎత్తున వివిధ సేవా కార్యక్రమాలు ప్రత్యేక పూజలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. అపర భద్రాద్రి ఇల్లంద కుంటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ప్రణవ్ బాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**కొత్తపల్లిలో.....**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి ఆధ్వర్యంలో ప్రణవ్ జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. కొత్తపల్లిలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో ప్రణవ్ జన్మదిన వేడుకలను కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి గజమాలతో సత్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. ప్రణవ్ బాబు పై ఒక ప్రత్యేక పాటను రాయించి సిడిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ, పేదల పెన్నిధి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేద ప్రజల గుండెచప్పుడు ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ వారికి అండగా ఉంటున్న ప్రణవ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు చందారాజు శ్రీపతి నరేష్ యాట్ల సునీత అశోక్ ఒగ్గు రమేష్ మాచర్ల రాజు పొన్నగంటి విష్ణు సుజాత అశోక్ పాతకాల మౌనిక అనిల్ భక్తుల లక్ష్మణ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి దుబ్బ మల్లన్న ఆలయ దేవస్థాన చైర్మన్ ముద్దమల్ల రవి మాజీ కౌన్సిలర్లు శ్రీహరి రవీందర్ సదానందం బిక్షపతి మహిళా కాంగ్రెస్ నాయకులు తోట స్వప్న పిడుగు భాగ్యలక్ష్మి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రాజకుమార్ ఎగ్గని శ్రీనివాస్ టెంకురాల కిషోర్ దేశిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**

ప్రణవ్ బాబు పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని స్పందన బ్లడ్ బ్యాంకులో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సేవలో ఉంటూ నిస్వార్థంగా సేవ చేస్తున్న ప్రణవ బాబు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని రాబోయే రోజుల్లో హుజురాబాద్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ ఎమ్మెల్యేగా గెలుపొందాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ ఉద్యమకారుడు అన్నం ప్రవీణ్ టీపీసీసీ ప్రచార కార్యదర్శి సాయిని రవి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

• రాష్ట్ర మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హన్మకొండ, ఆగస్టు 15 (నినాదం):** ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడమే ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. హన్మకొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు. హన్మకొండ జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని ఆయన వేదిక నుండి వివరించారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. ప్రజల సంక్షేమం అంటే మధ్యలో ఆపే పథకం కాదని అమలు చేసిన ప్రతి పథకం నిరంతరం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. రానున్న రోజుల్లో ఇంకా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. దేశ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులు స్వాతంత్ర్య సమరయోధులను, వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు చేసిన త్యాగాలు, సేవలను దేశం ఎప్పటికీ మరువదని కొనియాడారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. వ్యవసాయం, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, మత్స్య, గృహ నిర్మాణ, విద్య, జీడబ్ల్యూఎంసీ, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖలు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను శకటాలు, ప్రదర్శనలను ఆయన తిలకించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకల నిర్వాహకులు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, ఉద్యోగులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. ముందుగా మంత్రి ఉమ్మడి జిల్లా ప్రజలకు 80 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పురస్కరించుకొని స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ పోలీస్ కమిషనర్, హన్మకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, డీ. వెంకన్న, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, డిసిపి ధార కవిత, అదనపు కలెక్టర్ రవి, డిఆర్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జాతీయోద్యమ స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడుదాం



• బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్

**హనుమకొండ, ఆగస్టు 15,( నినాదం):** జాతీయోద్యమ స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడదాం అని మాజీ ప్రభుత్వ చీఫ్ దాస్యం వినే భాస్కర్ అన్నారు. హనుమకొండలోని బాలసముద్రం భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా కార్యాలయం నందు శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. మొదట భారతమాత, మహాత్మా గాంధీజీ, డా. బీఆర్ అంబేద్కర్ గారి చిత్రపటాలకు పూలమాలలు వేసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం జాతీయ జెండాను దాస్యం వినయ్ భాస్కర్ ఎగరవేశారు. ఈ సందర్భంగా వేనే భాస్కర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య కోసం అసువులు బాసిన స్వతంత్ర సమరయోధులందరకీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. భారత మాతకు స్వేచ్ఛావాయువులు అందించేందుకు మహాత్మా గాంధీజీ శాంతి మార్గంలో పోరాడారని కొనియాడారు. సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు, చంద్రశేఖర్ అజాద్ వంటి ఎందరో ప్రాణాలను లెక్కచేయకుండా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారని అన్నారు. 80 ఏండ్ల స్వతంత్ర భారతావనిలో ఇంకా రైతాంగానికి ఎరువులు, విత్తనాలు అందడం లేదన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో మనం మన హక్కుల సాధన కోసం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్య భారతం

• రాష్ట్ర, రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 15( నినాదం):** ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర భారతమని రాష్ట్ర,రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు, శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర ఉత్సవం అంటే కేవలం ఒక రోజు జరుపుకునే పండుగ కాదని, దేశ అభివృద్ధి కోసం నిజాయితీగా పనిచేయడం, సమాజం పట్ల బాధ్యతగా నిలబడటమే నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి అని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో నల్లగొండ జిల్లా పోషించిన పాత్రను మంత్రి గుర్తుచేస్తూ, నల్లగొండ అంటే పోరాటం, త్యాగం, తిరుగుబాటు, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, బొమ్మగాని ధర్మభిక్షం వంటి ఎందరో మహనీయుల పోరాట స్ఫూర్తి ఈ గడ్డకు గర్వకారణమన్నారు. నల్లగొండ నా ఊపిరి. మీ ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు నా శ్వాస ఉన్నంత వరకు పాటుపడతా. నల్లగొండ నీటి కష్టాలు తీర్చేందుకు, అభివృద్ధి బాటలో అగ్రభాగాన నిలబెట్టేందుకు నా సర్వశక్తులు ధారపోస్తా" అని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలి ఉద్యమంలోకి వెళ్లిన విషయాన్ని గుర్తుచేస్తూ, అధికారం శాశ్వతం కాదని.. ప్రజల కోసం చేసిన పోరాటం, త్యాగమే చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, సన్నబియ్యం, ఆరోగ్యం, విద్య, రహదారులు, తాగునీరు వంటి రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు, 5.35 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద రూ.715 కోట్లు జమ ,1.99 లక్షల మందికి ప్రతి నెల రూ.51.28 కోట్ల చేయూత పింఛన్లు 17,873 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 4,360 గృహాలు పూర్తి, గృహజ్యోతి పథకం కింద 2.56 లక్షల కుటుంబాలకు జీరో విద్యుత్ బిల్లులు,రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 38,403 మంది పేదలకు రూ.119.11 కోట్లతో వైద్య సేవలు , 8.73 కోట్ల ఉచిత ఆర్టీసీ ప్రయాణాల ద్వారా మహిళలకు రూ.408.20 కోట్ల ప్రయోజనం , 5.42 లక్షల కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ,81,279 కొత్త రేషన్ కార్డుల జారీ ,6,092 కి.మీ.ల 441 రహదారుల అభివృద్ధికి రాష్ట్రవ్యాప్తంగా రూ.13,006 కోట్ల నాబార్డ్ ప్రాజెక్టులకు శ్రీకారం,నల్లగొండ పట్టణానికి 24 గంటల తాగునీటి లక్ష్యంతో రూ.83 కోట్ల వాటర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన, అదనంగా రూ.300 కోట్ల నిధుల మంజూరు, ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం ,యువత కోసం రూ.20 కోట్లతో టీహబ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుయాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో 4 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభంనల్లగొండను కేవలం పోరాటాల గడ్డగానే కాకుండా.. అభివృద్ధిలో తెలంగాణకు ఆదర్శంగా నిలిచే జిల్లాగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగాలకు ప్రతిఫలమే స్వాతంత్ర్యం



**భూపాలపల్లి ఆగస్టు 15 ( నినాదం):** ఎందరో మహనీయుల త్యాగాలకు వెలకట్టలేని బహుమతే స్వాతంత్ర్య మని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో శనివారం 80 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ కు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ గీతం, తెలంగాణ గీతాలాపన అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోలీసు బలగాల పరేడ్ మార్చ్ పాస్ట్ ఆకట్టుకుంది. స్వాతంత్ర సమరయోధులను సన్మానించిన అనంతరం వివిధ శాఖలలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అవార్డులు ప్రధానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆస్తులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందజేశారు. అనంతరం ప్రభుత్వ శాఖల స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా సత్యనారాయణరావు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, అదుల కలెక్టర్ అశోక్ కుమార్, విజయలక్ష్మి డిఆర్ఓ వసంతకుమారి, జిల్లా అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారిగా అన్వేష్ రాజా



**కోదాడ,ఆగస్టు 15(నినాదం):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో అనంతగిరి మండల వ్యవసాయ విస్తరణ అధికారి పొనుగోటి అన్వేష్ రాజా జిల్లా ఉత్తమ వ్యవసాయ విస్తరణ అధికారిగా ఎంపికై ప్రశంసా సర్టిఫికెట్ అందుకున్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతుల మీదుగా ఆయన ఈ సర్టిఫికెట్‌ను స్వీకరించారు. రైతులకు అందిస్తున్న సేవలు, వ్యవసాయ రంగంలో చేసిన కృషిని గుర్తించి ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా అన్వేష్ రాజాను అధికారులు, సిబ్బంది, పలువురు అభినందించారు.

## అనంతగిరి ఆర్ఐకు ఉత్తమ సేవా పతకం



**కోదాడ,ఆగస్టు 15(నినాదం):** అనంతగిరి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) వెంకట నగేష్ ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. రెవెన్యూ శాఖలో విధి నిర్వహణలో ప్రతిభ, అంకితభావానికి గుర్తింపుగా శనివారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ కే. నరసింహ చేతుల మీదుగా పతకాన్ని అందుకున్నారు. ఆయన సేవలను అధికారులు కొనియాడారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది వెంకట నగేష్‌ను అభినందించారు.

## బడుగు బలహీన వర్గాలకు అందని సంక్షేమ పథకాలు

• బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రవీంద్రకుమార్



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 15 (నినాదం ):** స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అవుతున్న బలుగు బలహీన వర్గాలకు అందని సంక్షేమ పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందలేదని నల్లగొండ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామావత్ రవీంద్ర కుమార్ అన్నారు శనివారం నల్లగొండ బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో... 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ అట్టడుగున ఉన్న ప్రజల కొరకు సంక్షేమ పథకాలు అందించి వారిని ఆర్థికంగా మెరుగుపర చవలసిన అవసరం ఉందని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో, అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందాయని.. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాలు అందకుండా చేస్తుందని రైతు భీమా రైతు బంధు పథకాలను నీరుగారుస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలోశాసనమండలి సభ్యులు ఎం సి కోటిరెడ్డి , నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి , బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు కంచర్లకృష్ణారెడ్డి ,మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి గారు చిరుమర్తి లింగయ్య కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నోముల భరత్ కుమార్ రాష్ట్ర కార్పోరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు చీర పంకజ్ యాదవ్ బొర్ర సుధాకర్, మాజీ ఆర్వో మాలే శరణ్య రెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి నిరంజన్ వలి,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రేగట్టే మల్లికార్జున రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ ముందడి సైదిరెడ్డి, నగర,మండల పార్టీ అధ్యక్షులు, బోనగిరి దేవేందర్ పల్రెడ్డి రవీందర్ రెడ్డి, అయిత గోని యాదయ్య దేప వెంకటరెడ్డి , అభిమన్యు శ్రీనివాస్, కంచనపల్లి రవీందర్రావు, కొండూరు సత్యనారాయణ,మారగోని గణేష్, పెరిక యాదయ్య, పేర్ల అశోక్, రత్నగిరి శ్రీనివాస్ కుందురి ప్రవీణ్ కుమార్ రెడ్డి, గోపగోని స్వాతి రాజశేఖర్, దొడ్డి రమేష్, దీప్లా నాయక్....రావుల శ్రీనివాసరెడ్డి, జమాల్ ఖాద్రి,బొజ్జ వెంకన్న, పొనుగోటి జనార్ధన్ రావు అన్వర్ పాష,, దండంపెల్లి సత్తయ్య, తవిటి కృష్ణ, బడుపుల శంకర్.. కదారి కృష్ణయ్య, గుండెబోయిన జంగయ్య, సుంకిరెడ్డి వెంకట్ రెడ్డి,మామిడి పద్మ, యాట జయప్రద రెడ్డి, కోంద్ర స్వరూప కొప్పోలు విమలమ్మ, మర్రి రేణుక, నర్ర నిర్మల గాలి రాధిక ఝాన్సీ, జహంగీర్, పున్న వెంకన్న అలివేణు, చందు వంశీ, అల్లి శివశంకర్ కోట్ల జయపాల్ రెడ్డి, నారగోని నరసింహ, పుట్ట కోటయ్య, షబ్బీర్, నజీర్ తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మిర్యాలగూడ కోర్టు ప్రాంగణంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మిర్యాలగూడ, ఆగస్టు 15(నినాదం):** మిర్యాలగూడ కోర్టు ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 5వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కె.వి. చంద్రశేఖర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య ఫలాలు సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి అందినప్పుడే స్వాతంత్ర్యానికి నిజమైన సార్థకత చేకూరుతుందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరికీ సమన్యాయం అందేలా న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. ఆర్డీవో ఎస్. రమణారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం. అర్జున్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను కాపాడాలని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు వెంకటేశ్వర్లు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. యువత దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. పవన్ కుమార్, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి. అరుణ్ తేజ్ సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో మరింత రాణించాలని ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. లావణ్య రాణి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు న్యాయమూర్తుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## పథకాల్లో పారదర్శకతనే ప్రభుత్వ లక్ష్యం

• ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**భూపాలపల్లి ప్రతినిధి, ఆగష్టు15(నినాదం):** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో నూతన డిజిటలైజ్డ్ ప్లాస్టిక్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కోటికి పైగా డిజిటలైజ్డ్, భద్రతా ప్రమాణాలతో కూడిన ప్లాస్టిక్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల రూపకల్పన, పంపిణీకి చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని ప్రభుత్వ విప్ తెలిపారు. దీని ద్వారా మహిళలు, విద్యార్థినులు విద్య, ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాల కోసం స్వేచ్ఛగా ప్రయాణిస్తూ ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు సన్న బియ్యంతో పాటు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు 11 వేల మంది ఉపాధ్యాయుల నియామకం చేపట్టినట్లు తెలిపారు. నవంబర్ నుండి రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు 5 లక్షల ప్రమాద బీమా అమలు చేయనున్నట్లు వివరించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ డూప్లికేట్ చేయడానికి వీలు లేని విధంగా 9 రకాల అత్యాధునిక భద్రతా ఫీచర్లతో నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డు కేవలం రేషన్ బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందేందుకు పోర్టబిలిటీ సౌకర్యంతో పాటు కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ, స్కాలర్‌షిప్‌లు తదితర ప్రభుత్వ సేవలు, పథకాలలో గుర్తింపు కార్డుగా ఉపయోగపడే విధంగా రూపొందించినట్లు తెలిపారు. గతపదేళ్లుగా పాత రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చక ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజల సమస్యను పరిష్కరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో 14,955 మంది, మంథని నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 7,197 మంది మొత్తంగా 22,152 మంది కుటుంబ సభ్యుల పేర్లను పాత రేషన్ కార్డుల్లో చేర్చినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటలైజ్డ్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత, భద్రత, సౌలభ్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. క్యాబినెట్ సబ్‌కమిటీ సిఫార్సుల మేరకు కొత్త ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల్లో హోలోగ్రామ్, తెలంగాణ ప్రభుత్వ హిడెన్ ఇమేజ్, మైక్రో టెక్స్ట్, వాటర్‌మార్క్, ఇన్విజిబుల్ యువి లోగో, క్యూ ఆర్ కోడ్ తదితర అత్యాధునిక భద్రతా లక్షణాలు ఉన్నాయని వివరించారు. స్మార్ట్ రేషన్ కార్డులను టీ రేషన్ మొబైల్ యాప్‌తో అనుసంధానం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులు తమ రేషన్ కార్డు నంబర్‌ను యాప్‌లో నమోదు చేసుకుని డిజిటల్ రేషన్ కార్డును వీక్షించడంతో పాటు ప్రతి నెల కేటాయించే రేషన్ సరుకుల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, పోలీస్ బోర్డ్ సభ్యులు రామనరసింహా రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య , వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్ అప్పం కిషన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ బీఆర్ఎస్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మిర్యాలగూడ ఆగస్టు 15(నినాదం):** మిర్యాలగూడలో బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. దేశసమైక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. అంతకుముందు ఆర్డీట కార్యాలయంలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ ఆగస్టు 15( నినాదం ):** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి శనివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉదయం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయులను స్మరించుకుంటూ, వారు చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్ పాల్గొన్నారు. బి ఎల్ ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు పల్లి పట్టి (మిఠాయి) పంపిణీ కార్యక్రమాన్నిలి నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని విద్యార్థులు ఆనందోత్సాహాలతో జరుపుకునేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని విశ్వకర్మ కార్పెంటర్స్ యూనియన్నాయి బ్రాహ్మణ సంఘంలి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, ప్రజల సంక్షేమం మరియు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..

## నేటి నుంచి అనంతగిరిలో గ్రీవెన్స్ కార్యక్రమం



**కోదాడ,ఆగస్టు 15(నినాదం):** అనంతగిరి మండల ప్రజల సమస్యల పరిష్కారానికి నేటి నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుష్మ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు, వినతిపత్రాలు సమర్పించవచ్చన్నారు. ప్రతిరోజూ స్వీకరించే వినతులను సంబంధిత అధికారులకు పంపించి, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్వాతంత్ర్య స్ఫూర్తితో నేర రహిత సమాజాన్ని నిర్మించాలి

• అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల పిలుపు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):** స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని అందిపుచ్చుకొని నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి జి. అఖిల మాట్లాడుతూ.. 80 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేరాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళనకరమన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. న్యాయంపై అవగాహన కలిగి, నేరాలకు దూరంగా ఉంటూ నేర రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల స్థాయిలోనే న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాల్లో సామాజిక బాధ్యతను పెంచవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ రఘురాం, సిబ్బంది సురేందర్, అంబాల దేవేందర్, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సంబరాల్లో సుల్తానాబాద్..

మువ్వన్నెల జెండాతో మురిసిన పట్టణం..





**సుల్తానాబాద్, ఆగస్టు 15 (నినాదం):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకు ని సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని పలు కా ర్యాలయాల్లో, మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ రంజిత్ రావు, తహసిల్దార్ కార్యాలయంలో తాసి ల్దార్ బషీరుద్దీన్, ఎంపీడీవో కార్యాలయంలో దివ్య దర్శ నం రావు, మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ, ము న్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ తి ప్పరాజు రమేష్, వ్యవసాయ మార్కెట్లో చైర్మన్ మి నుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో కార్యాలయం లో శ్రీగిరి శ్రీనివాస్, ప్రభుత్వ ఆసుపత్రిలో రమాదే వి, చిన్నకల్వల పిఏసిఎస్ లో మురళిధర్ రావు, సుద్దాల పిఏసిఎస్ లో భాస్కర్ రెడ్డి, కనుకుల పి ఎసిఎస్ లో చిలుక సతీష్, గర్రెపల్లి పిఏసిఎస్ లో కల్లపల్లి జానీ, వివిధ ప్రభుత్వ కార్యాలయంలో అధికారులు, మండలం లోని వివిధ గ్రామాల్లో స ర్పంచులు, ప్రజాప్రతినిధులు మువ్వన్నెల జాతీ య జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆల పించారు. వేడుకల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు దేశభక్తి గీతాలు, ఆటపాట లు, సాంస్కృతిక కార్యక్రమా లతో అలరించారు. చిన్నారుల ఉత్సాహ భరిత ప్రదర్శనలు ఆకట్టు కున్నా యి. అనంతరం విద్యార్థులు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. స్వాతంత్ర్య వేడుకల్లో వా ర్డు ప్రజలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు.

# ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ వేముల వీరేశం





**నిర్మల్ ప్రతినిధి, ఆగస్టు 15 (నినాదం):** శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. వేడుకలకు హాజ రైన ప్రభుత్వ విప్ కు అధికారులు పూల మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఎగరవే శారు. జాతీయ గీతాలాపన, గేయాలాపన, తెలంగాణ రాష్ట్ర గీతాలాపన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ విప్ ఈ సందర్భంగా, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి వివరాలను ఆయన కూలంకషంగా వివరించారు. అధికారుల పనితీరుతో జిల్లా అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలుస్తుందని చెప్పారు. జిల్లా అధికారులు సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేస్తూ, జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలని అన్నారు. వేడుకల్లో భాగంగా పాఠశాలల విద్యార్థులచే దేశభక్తి ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ విప్, కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలోని పలు శాఖల ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించి, వారిని అభినందించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శకటాల ప్రదర్శనను తిలకించి, స్టాళ్లను వీక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోలీస్ పరేడ్ అందరిని ఆకట్టుకుంది. జిల్లా మహిళా సంఘాలకు మంజూరైనటువంటి 50 కోట్ల రూపాయల విలువైన చెక్కులను వారికి అందజేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఏఎస్పి సాయి కిరణ్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అభిమానమే అండగా.. దివాకర్ రావు జన్మదినం



**మంచిర్యాల, ఆగస్టు 15 (నినాదం):** మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు జన్మదిన వేడుకలు నస్పూర్ లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ముఖ్య అతిథిగా హాజరై దివాకర్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. దివాకర్‌రావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలను ప్రస్తావిస్తూ అభినందనలు వ్యక్తం చేశారు. కార్యాలయ ప్రాంగణంలో అభిమానుల సందడి కనిపించింది. వయసుతో సంబంధం లేకుండా పలువురు కార్యకర్తలు ఆయనను కలిసి ఆత్మీయంగా పలకరించడం ప్రత్యేకంగా కనిపించింది.

**కార్యకర్తలతో మమేకం..**

రాజకీయాల్లో పదవులు మారినా కార్యకర్తలతో అనుబంధం కొనసాగాలనే భావన ఈ వేడుకల్లో కనిపించింది. దివాకర్‌రావును కలిసిన పలువురు కార్యకర్తలు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమ సమస్యలను వినే నాయకుడిగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని వెల్లడించారు. జన్మదిన వేడుకలు కేవలం కేక్ కటింగ్‌కే పరిమితం కాకుండా నాయకుడు--కార్యకర్తల మధ్య ఉన్న ఆత్మీయతకు వేదికగా మారాయి. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ దివాకర్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు దివాకర్‌రావు నాయకత్వాన్ని కొనియాడుతూ శుభాకాంక్షలు తెలిపారు.

**అభిమానుల మధ్య సందడి**

జిల్లా బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకున్న అభిమానులు, కార్యకర్తలతో సందడి నెలకొంది. పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు కార్యకర్తలు దివాకర్‌రావుతో కలిసి ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు. దీంతో కార్యాలయ ప్రాంగణం కొంతసేపు పండుగ వాతావరణాన్ని తలపించింది. వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభకు 'నా నేస్తం' చేయూత

10వ తరగతి ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ట్రస్ట్ అధ్యక్షులు కట్ల. సత్యనారాయణ



**సుల్తానాబాద్, ఆగస్టు 15 (నినాదం):** ఆర్థిక పరిస్థితులు విద్యకు అడ్డంకి కాకూడదనే లక్ష్యం తో 'నా నేస్తం చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో 10వ తరగతి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థు లకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పెద్దప ల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ ఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్ర మంలో విద్యార్థులను ఘనంగా సత్కరించి ప్రో త్సాహకాలను అందించారు. కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ కప్పల ప్రవీణ్ మా ట్లాడుతూ.. 'నా నేస్తం చారిటబుల్ ట్రస్ట్' అందిస్తు న్న సామాజిక సేవలను అభినందించారు. విద్యా ర్థులు ఈ ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవి ష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, సమా జానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ అధ్య క్షులు కట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వీ రగోని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థు ల చదువుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మార కూడదనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ప్రతిభావం తులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పదో త రగతి ఫలితాలు విద్యా ర్థుల భవిష్యత్తుకు పునా ది వంటివని, ఈ ప్రోత్సాహం వారి పైచదువులకు మరింత ఊతమిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తు లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తె లిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచులు, సిం గిల్ విండో చైర్మన్, ట్రస్ట్ సభ్యులు బూర్ల రాజేశం, కట్ల సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం గంగ్ర దేవేందర్‌రావు, ప్రైమరీ పాఠశాల హెచ్ఎం జ్ఞానే శ్వర్, పాఠశాల చైర్‌పర్సన్ రేఖ, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పా ల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తికి కాట్నపల్లి వేదిక..

యువతను ప్రోత్సహించ డమే లక్ష్యం:

తాళ్లపల్లి ఫౌండేషన్ అధినేత తాళ్లపల్లి మనోజ్ గౌడ్





**సుల్తానాబాద్, ఆగస్టు 15 (నినాదం):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సు ల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో తాళ్ల పల్లి ఆగయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన్‌డే క్రి కెట్ టోర్నమెంట ను ఘనంగా నిర్వహించారు. తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో గ్రామానికి చెందిన యువ క్రీడాకారులు, సీ నియర్ క్రీడాకారులు, రాజకీయనాయకులు ఉత్సా హంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోజ్ గౌడ్ మాట్లాడుతూ... యువతతో పాటు సీనియర్ క్రీ డాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది స్వా తంత్ర్య దినోత్సవం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల ద్వారా యువతలో ఉత్సాహం, స్నేహభావం, క్రమశిక్షణ పెంపొం దించడంతో పాటు ప్రతిభను వెలికితీయడానికి త మ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని పే ర్కొన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, సీనియర్ నాయకులు కల్వల శ్రీనివా స్, శ్రీరాములు యాదవ్, ఒరే అజయ్ యాదవ్, కృష్ణచారి, మేకల మల్లయ్య, ఉమ్మెతల సంపత్ రెడ్డి, శ్రీపతి శ్రీనివాస్, దాసరి అనిల్, స్వామి, శ్రీని వాసరావు, ప్రవీణ్ రెడ్డి, ఉండేటి అశోక్, కల్వల కిరణ్, అరవింద్, క్రీడాకారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల అభివృద్ధే లక్ష్యం

నగరాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం : మేయర్ దర్ని మధుకర్



**మంచిర్యాల, ఆగస్టు 15 (నినాదం):** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో, గాంధీ పార్కు, ముఖారం చౌరస్తాలో జాతీయ పతాకాన్ని డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, మున్సిపల్ కమిషనర్ జి. అన్వేష్‌లతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమని, వారి ఆశయాలను నెరవేర్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి అనేది కేవలం భవనాలు, రహదారుల నిర్మాణానికే పరిమితం కాకుండా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ఉండాలని పేర్కొన్నారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడం, నాణ్యమైన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడం వంటి అంశాలకు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ మంచిర్యాల నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

**నియోజకవర్గ అభివృద్ధికి సమష్టి కృషి**

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు మార్గదర్శకత్వం, ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రజల సహకారంతోనే మంచిర్యాలను మరింత అభివృద్ధి చెందిన, పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దగలమన్నారు.

# ఆసిఫాబాద్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఆగస్టు 15 (నినాదం):** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు తిలకించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులను, దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుని ఘన నివాళులు అర్పించారు.

**ఉత్తమ సేవలకు ప్రశంసలు..** ప్రజలకు, సమాజానికి విశిష్ట సేవలు అందించిన వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బందిని గుర్తించి ఉత్తమ సేవా పతకాలను అందజేసి అభినందిం చారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు..**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశభక్తిని ప్రతిబింబించే విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

**మండల కేంద్రాలలో..**

జిల్లాలోని మండల కేంద్రాలలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో, పాఠశాలల్లో, కార్యాలయాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రాలలో తాహసిల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామ పంచయతీలలో ఆయా పంచాయతీల సర్పంచులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తులను స్మరించుకున్నారు. ఆయా మండలాలు ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ప్రభుత్వ అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి పౌరుడు బాధ్యతగా ఉండి..

# దేశ ఐక్యత, సమగ్రతను కాపాడాలి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్ ప్రతినిధి, ఆగస్టు 15 (నినాదం):** నిర్మల్ లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయం, గాంధీ పార్క్, ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ. "ఎంతో మంది మహనీయుల త్యాగ ఫలంతో మనకు స్వాతంత్ర్యం సిద్ధించింది. అటువంటి వారి స్ఫూర్తితో మనం దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనీ, ప్రతి పౌరుడు బాధ్యతగా ఉండి, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడాలని" పిలుపునిచ్చారు. ప్రధాని శ్రీ నరేంద్రమోదీ గారి నాయకత్వంలో గడిచిన 12 సంవత్సరాల్లో భారత దేశం మూడో ఆర్థిక వ్యవస్థ ఎదిగిందంటే అది మోదీ గారి సుస్థిర పాలనకు నిదర్శనం అని తెలిపారు. అనేక సంస్కరణలు, విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని భారత్ ను ప్రపంచ శక్తిగా నిలుపుతున్న ఘనత ప్రధాని నరేంద్ర మోదీ గారికే చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, భూమయ్య, మేడిసెమ్మ రాజు, రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, పట్టణ కౌన్సిలర్లు సాధం అరవింద్ , గంజి రాజు, శ్రీరామోజీ నరేష్, అర్జున్, జింక సూరి, శశాంక్, విఠల్, సూరజ్, సాత్విక్, ఈశ్వర్, నాయకులు అలివేలు మంగ, నారాయణ గౌడ్, కందుల హరీష్, జప ప్రసాద్, జుట్టు దినేష్, అల్లం భాస్కర్, ఓడ్నాల రాజు, గిల్లి విజయ్, తో పాటు పట్టణ బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జెండాకు గౌరవం ఎక్కడ..?

షూ తొలగించకుండానే జాతీయ పతాకావిష్కరణ

ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు తీరుపై చర్చ



**మంచిర్యాల, ఆగస్టు 15 (నినాదం):** 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఎక్కడ చూసినా జాతీయ పతాకం రెపరెపలాడింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజలు జాతీయ జెండాకు సెల్యూట్ చేశారు. అధికారిక వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు సైతం జాతీయ పతాకానికి గౌరవం చాటారు. శనివారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన పతాకావిష్కరణ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు షూ తొలగించకుండానే జాతీయ జెండాను ఎగురవేయడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ పతాకం కేవలం ఒక వస్త్రపు ముక్క కాదు.. కోట్లాది భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతీక. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలకు గుర్తు. అలాంటి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే సమయంలో ప్రతి ఒక్కరూ అత్యంత గౌరవం, బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో కీలక బాధ్యతలు నిర్వహించే వారు ఇతరులకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం మరింత ఉంది.

**ఆవిష్కరణ వేళ చర్చకు దారితీసిన తీరు..**

మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఆవరణలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అయితే ఆయన పాదరక్షలు తొలగించకుండానే పతాకావిష్కరణ చేయడం అక్కడున్న వారి దృష్టిని ఆకర్షించింది. దీంతో చర్చ మొదలైంది.


**పెద్దలే ఆదర్శంగా నిలవాలి..**

జాతీయ పతాకానికి గౌరవం చూపడం ప్రతి భారతీయుడి బాధ్యత. చిన్నారుల నుంచి పెద్దల వరకు జాతీయ జెండా పట్ల గౌరవభావాన్ని పెంపొం దించేందుకు పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇలాంటి సమయంలో ఉన్నతస్థాయి వ్యక్తులు పాటించే ప్రతి అంశాన్ని ప్రజలు గమనిస్తుంటారు. అందువల్ల అధికారిక వేడుకల్లో పాల్గొనే వారు జాతీయ పతాకం విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**జెండా గౌరవం.. మన బాధ్యత...**

జాతీయ పతాకానికి గౌరవం ఇవ్వడం అనేది ఒకరి వ్యక్తిగత విషయం మాత్రమే కాదని, అది దేశ గౌరవానికి సంబంధించిన అంశమని పలువురు పేర్కొంటున్నారు. పతాకావిష్కరణ సమయంలో పాటించాల్సిన మర్యాదలు, నియమాలను అధికార యంత్రాంగం ముందుగానే స్పష్టంగా తెలియజేయాలని సూచిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం అంటే కేవలం వేడుకలు, జెండావిష్కరణలకే పరిమితం కాకుండా.. దేశభక్తి, బాధ్యత, క్రమశిక్షణను గుర్తుచేసుకునే రోజు. జాతీయ పతాకం రెపరెపలాడే ప్రతి చోటా దాని గౌరవం కాపాడేలా వ్యవహరించడమే స్వాతంత్ర్య సమరయోధులకు మనం అందించే నిజమైన నివాళి.

# అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఆగస్టు 15 (నినాదం) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, కౌటాల మండలం గుండాయి పేట గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు. శనివారం పెనుగంగ ఓడరేవు ద్వారా మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న బియ్యం బస్తాలను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న శ్రీరామ్, దుర్గం కిషోర్ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా బియ్యం తరలింపునకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సతీష్ హెచ్చరించారు.

# మార్కెటింగ్ శాఖ ఉత్తమ ఉద్యోగిగా నార మనోహర్



**సుల్తానాబాద్, ఆగస్ట్ 15 (నినాదం):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంద ర్భంగా పె ద్దపల్లి కలెక్టరేట్ లో నిర్వహించిన వేడుకలలో వ్య వసాయ మార్కెటింగ్ శాఖలో ఉత్తమసేవలు అం దించినందుకు గాను సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ లో ప్రత్యేక శ్రేణి కార్యదర్శి గా వి ధులు నిర్వహిస్తున్న నార మనోహర్ కు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా ప్ర శంసా పత్రం అందుకున్నారు.. ఉత్తమ ఉద్యోగిగా నార మనోహర్ అవార్డు అందుకోవడం పట్ల వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సూపర్ వైజర్ సిహెచ్. ప్రేమ్ కుమార్ , డైరెక్టర్లు, సిబ్బంది అభినందలు తెలిపారు.



# వారసత్వాన్ని మించిన వ్యక్తిత్వం..

## వెండితెర నుంచి ప్రపంచ వేదికల వరకు వెలిగిన లక్ష్మీ మంచు

కొంతమందికి జన్మతోనే ఒక గుర్తింపు లభిస్తుంది. కానీ ఆ గుర్తింపును దాటి, తమకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోవడం మాత్రం కొద్దిమందికే సాధ్యమవుతుంది. అలాంటి అరుదైన మహిళల్లో ముందుగా గుర్తొచ్చే పేరు లక్ష్మీ మంచు. ప్రముఖ నటుడు, విద్యావేత్త, పద్మశ్రీ డాక్టర్ మోహన్ బాబు కుమార్తెగా సినీ కుటుంబంలో జన్మించిన ఆమె... తన ప్రయాణాన్ని మాత్రం ఎవరి నీడలోనూ కొనసాగించలేదు. ప్రతి అడుగును తన ప్రతిభతో, ప్రతి విజయాన్ని తన కష్టంతో, ప్రతి గుర్తింపును తన వ్యక్తిత్వంతో సంపాదించుకున్నారు. లక్ష్మీ మంచు అంటే కేవలం ఒక నటి కాదు... ఒక ఆలోచన. ఒక ధైర్యం. ఒక ప్రయాణం. వెండితెరపై నటిగా, నిర్మాణ రంగంలో నిర్మాతగా, టెలివిజన్లో విజయవంతమైన వ్యాఖ్యాతగా, అంతర్జాతీయ వేదికలపై భారతీయ ప్రతిభకు ప్రతినిధిగా, సామాజిక బాధ్యతను తన జీవితంలో భాగంగా మలుచుకున్న సేవాభావం కలిగిన మహిళగా, కుటుంబానికి అంకితమైన తల్లిగా... ప్రతి పాత్రలో ఆమె చూపించిన నిబద్ధత ఎంతోమందికి స్ఫూర్తి. తెలుగు చిత్రసీమలో నటిగా తనకంటూ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్న లక్ష్మీ మంచు, హాలీవుడ్లోనూ అడుగు పెట్టి భారతీయ కళాకారిణుల ప్రతిభకు ప్రపంచ వేదికపై మరో గుర్తింపును తీసుకొచ్చారు. అంతర్జాతీయ టెలివిజన్ ప్రాజెక్టుల్లో నటించి, ప్రపంచ సినీ సంస్కృతిని దగ్గరగా చూసిన ఆమె... ఆ అనుభవాన్ని తిరిగి తెలుగు ప్రేక్షకులకు అందించారు. అందుకే ఆమె ప్రయాణం ప్రాంతీయతను దాటి ప్రపంచ దృష్టిని అందుకున్న అరుదైన కథగా నిలిచింది. తనకు వచ్చిన ప్రతి పాత్రను ఒక అవకాశంగా కాకుండా ఒక బాధ్యతగా చూసే లక్ష్మీ మంచు, గ్లామర్కు మాత్రమే పరిమితం కాకుండా భావోద్వేగాలకు, బలమైన మహిళా పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చారు. తెరపై ఆమె కనిపిస్తే పాత్రే మాట్లాడుతుంది... వ్యక్తి కాదు.. అదే ఆమె నటనలోని ప్రత్యేకత.




నిర్మాతగా కొత్త కథలను ప్రోత్సహించడం, సృజనాత్మకతకు విలువనివ్వడం, యువ ప్రతిభను ప్రోత్సహించడం ఆమె మరో కోణం. అలాగే టెలివిజన్ వ్యాఖ్యాతగా ఆమె నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి...

సెలబ్రిటీలతో సంభాషణలను ప్రశ్నోత్తరాలుగా కాకుండా మనసుల మధ్య సంభాషణగా మార్చగల అరుదైన నైపుణ్యం ఆమె సొంతం. కెమెరా వెలుగులకు అతీతంగా లక్ష్మీ మంచు జీవితంలో మరో విశేషమైన అధ్యాయం ఉంది-అది సామాజిక సేవ. బాలికల విద్య, మహిళా సాధికారత, పిల్లల సంక్షేమం, ఆరోగ్యం, సమాజంలో సమాన అవకాశాల కోసం ఆమె నిరంతరం కృషి చేస్తున్నారు. ఒక ప్రముఖురాలిగా తన ప్రభావాన్ని సమాజానికి ఉపయోగపడేలా మలచాలనే సంకల్పంతో ఎన్నో సేవా కార్యక్రమాల్లో భాగమవుతున్నారు. సమాజం మారాలంటే మాటల కంటే చేతలు గొప్పవని ఆమె జీవితం చెబుతుంది. ఇక వ్యక్తిగత జీవితంలో తల్లిగా లక్ష్మీ మంచు మరో అందమైన రూపం. ప్రపంచం ఎంత పెద్దదైనా... తన కూతురి ప్రపంచమే తనకు అత్యంత విలువైనదని చెప్పే ఆమె, కుటుంబం మరియు కెరీర్ మధ్య అద్భుతమైన సమతుల్యతను పాటిస్తున్నారు. విజయం అంటే కేవలం అవార్డులు కాదు... మనతో పాటు మన కుటుంబం నవ్వుతూ ఉండటమే నిజమైన విజయం అని ఆమె నమ్మకం. ఫ్యాషన్పై తనదైన అభిరుచి, పుస్తకాలపై మక్కువ, ప్రపంచ సినిమాలపై ఆసక్తి, మహిళల ఆత్మవిశ్వాసంపై స్పష్టమైన అభిప్రాయాలు, కొత్త తరానికి స్ఫూర్తినిచ్చే ఆలోచనలు... ఇవన్నీ లక్ష్మీ మంచును కేవలం ఒక సినీ సెలబ్రిటీగా కాకుండా సమకాలీన భారతీయ మహిళకు ప్రతిరూపంగా నిలబెడుతున్నాయి. తెర వెనుక కనిపించని పోరాటాలు... హాలీవుడ్ అనుభవాలు.. తెలుగు సినిమా భవిష్యత్తుపై ఆమె అభిప్రాయాలు... మహిళల పాత్రలో వస్తున్న మార్పులు... తల్లితనంతో వచ్చిన పరిణతి... ఫ్యాషన్, జీవితం, సమాజం, విజయాలు, వైఫల్యాలు... ఇంకా ఎన్నో ఆసక్తికరమైన అంశాలపై మనసు విప్పి మాట్లాడిన లక్ష్మీ మంచుతో ఈ ప్రత్యేక ముఖాముఖి.

**"ఫ్యాషన్ అంటే స్వీయ వ్యక్తీకరణే" – లక్ష్మి మంచు. నగలు అంటే ఇష్టం.. కానీ.. "ఆత్మవిశ్వాసమే అమె ఆభరణం"**



**నినాదం :** మీ ఫ్యాషన్ స్టేట్మెంట్ను ఒకే వాక్యంలో చెప్పాలంటే?
**మంచు లక్ష్మి:** ఫ్యాషన్ను ఒకే వాక్యంలో చెప్పలేను . ఫ్యాషన్ అనేది మనల్ని మనం వ్యక్తీకరించుకోవడం. ఎవరైనా మనల్ని కలిసినప్పుడు మొదటి ఇంప్రెషన్ మన డ్రెస్సింగ్ నుంచే వస్తుంది. మగవారైనా, ఆడవారైనా శుభ్రత, నీట్నెస్ చాలా ముఖ్యం. ఫ్యాషన్ పక్కన పెడితే.. తెల్లటి షర్ట్, బ్లాక్ ప్యాంట్ వేసుకున్నా మరకలు లేకుండా, చక్కగా ఐరన్ చేసి ఉండాలి. చిరిగిపోయిన సాక్స్, పాడైపోయిన బెల్ట్ వంటివి ధరించకూడదు. బయటికి కనిపించే దానికంటే.. కనిపించని విషయాలకు మనం ఎంత ప్రాధాన్యత ఇస్తామన్నదే ముఖ్యం. నాకు ఫ్యాషన్ అంటే అదే. నా దగ్గర కొన్ని నైట్ డ్రెస్సులు 30 ఏళ్ల క్రితం నాటివి కూడా ఉన్నాయి. అవి వేసుకున్నప్పుడు నాకు కలిగే సౌకర్యం చాలా ముఖ్యం. మనకు ఏది ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందో అదే ధరించాలి. ఎదుటివారు వేసుకున్నారని మనం కూడా అదే వేసుకోవాల్సిన అవసరం లేదు. అది అందరికీ సూట్ అవ్వకపోవచ్చు. ఉదాహరణకు, ఈ చీరను విష్ణు పెళ్లి కోసం కొన్నాను. బ్లౌజ్ను ఇటీవల కొన్నాను. ఇలా మిక్స్ అండ్ మ్యాచ్ చేసుకుని మనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని సృష్టించుకోవడమే అసలైన ఫ్యాషన్.

**నినాదం:** సాధారణంగా చాలామంది ట్రెండ్ను ఫాలో అవుతారు. కానీ మీరు కొత్త ట్రెండ్ను క్రియేట్ చేస్తుంటారు. ఈ ఆలోచనలు ఎలా వస్తాయి?
**మంచు లక్ష్మి:** ముఖ్యంగా ఒక కళాకారిణిగా ఉన్నప్పుడు స్వీయ వ్యక్తీకరణ చాలా ముఖ్యం. ప్రారంభంలో నేను వేసుకునే దుస్తులను చూసి చాలామందికి అర్థమయ్యేది కాదు. "ఈ టాప్పై ఆ స్కర్ట్ ఏంటి?" అని అనుకునేవారు. కానీ మన శైలిని మనమే సొంతంగా మలచుకోవాలి. నేను సబ్యసాచి డిజైనర్ టాప్ను అనామికా ఖన్నా బాటమ్తో కలిపి వేసుకుంటాను. సాధారణంగా ఎవరూ చేయని విధంగా దుస్తులను మిక్స్ అండ్ మ్యాచ్ చేయడం నాకు ఇష్టం. మనం ఎలా దుస్తులు ధరించాలో వేరే వాళ్లు నిర్ణయించకూడదు కదా!

**నినాదం:** రెడ్ కార్పెట్పైకి వెళ్లేటప్పుడు డ్రెస్సింగ్, జ్యువెలరీ, కాన్ఫిడెన్స్.. ఈ మూడింటిలో దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు?
**మంచు లక్ష్మి:** రెడ్ కార్పెట్ లుక్ విషయంలో చాలాసార్లు చాలా స్ట్రెస్గా అనిపిస్తుంది. ఎవరు ఏం ధరిస్తున్నారు? ఎవరి లుక్ లేటెస్ట్గా ఉంది? అనే విషయాలు తెలియవు. అవార్డు ఫంక్షన్కు వెళ్లినప్పుడు మనల్ని మనం సరిగ్గా ప్రెజెంట్ చేసుకోవాలి. అది సాధారణ ఫంక్షన్ కాదు. అందుకే గోళ్ల రంగు నుంచి హెయిర్స్టైల్, షూస్ వరకు ప్రతి విషయానికీ చాలా సమయం కేటాయిస్తాను. వాటన్నింటినీ పర్ఫెక్ట్గా కుదర్చడం నాకు చాలా ఇష్టమైన పని. జ్యువెలరీ విషయానికొస్తే.. నాకు జ్యువెలరీ అంటే చాలా ఇష్టం. నేను టీవీ షోలకు కూడా డైమండ్స్ ధరించేదాన్ని. ఎప్పుడూ సాధారణ జ్యువెలరీతో కనిపించేదాన్ని కాదు. నా జ్యువెలర్స్ అందరూ కూర్చుని చూస్తూ ఉంటారు. కానీ మనకు ఏది సృష్టించడం ఇష్టమో అదే చేస్తాం కదా! నేను ఎప్పుడూ కేవలం 'లుక్' గురించి మాత్రమే ఆలోచించను. నేను వేసుకునేది ఏమిటి? అది నాకు నచ్చుతుందా? అనే విషయాలు కూడా చాలా ముఖ్యం.

**నినాదం :** తెలుగు సంప్రదాయ దుస్తుల్లో మీకు అత్యంత ఇష్టమైనది ఏది?
**మంచు లక్ష్మి:** లంగా ఓణీ.

**నినాదం :** ఇప్పుడు లంగా ఓణీని రీ-క్రియేట్ చేయాలంటే ఎలా చేస్తారు?
**మంచు లక్ష్మి:** ఎక్కువ ఫేరా లేకుండా, ఇంకొంచెం స్ట్రెయిట్ ఎ-లైన్ స్కర్ట్తో చేస్తాను. అలా అయితే తిరగడానికి, కదలడానికి కూడా సులభంగా ఉంటుంది.

**నినాదం :** మీ దృష్టిలో ఫ్యాషన్ అంటే ఖరీదైన బ్రాండ్లకు ప్రాధాన్యత ఇవ్వడమా? లేక మన అంతరంగానికి ప్రాధాన్యత ఇవ్వడమా?
**మంచు లక్ష్మి:** ఒక బ్రాండ్ను నిర్మించడం సాధారణ విషయం కాదు. ఉదాహరణకు, మనం హెర్మీస్ బ్రాండ్ వద్దకు వెళ్లి.. "నా దగ్గర రూ. 25-30 లక్షలు ఉన్నాయి. ఒక బ్యాగ్ ఇవ్వండి" అంటే ఇవ్వరు. దానికి తగ్గ పోర్ట్ఫోలియో ఉండాలి. వారు మీకు అమ్మాలా? వద్దా? అనేది కూడా వాళ్లే నిర్ణయిస్తారు. అంతటి స్థాయి బ్రాండ్ను వారు నిర్మించారు. కొన్ని బ్యాగుల కోసం



వెయిటింగ్ లిస్ట్ ఉంటుంది. నమ్మగలరా? కాబట్టి మనం ఏ బ్రాండ్తో అసోసియేట్ అవుతున్నామనేది కూడా చూడాలి. అయితే చివరికి బ్రాండ్ ఏదైనా సరే.. దాన్ని ధరించినప్పుడు మనం కంఫర్టబుల్గా, బాగున్నామనే భావన కలగాలి.

**నినాదం :** ఒకసారి వేసుకున్న దుస్తులను మళ్లీ ధరించడం (ఔట్ఫిట్ రిపీటింగ్ )పై మీ అభిప్రాయం ఏమిటి? దాన్ని ప్రోత్సహిస్తారా?
**మంచు లక్ష్మి:** ఖచ్చితంగా ప్రోత్సహిస్తాను. ఇప్పుడే చెప్పాను కదా.. ఇది విష్ణు పెళ్లికి కట్టుకున్న చీర. ఇప్పుడు మళ్లీ కట్టుకున్నాను. ఒకే దుస్తులను మళ్లీ వేసుకున్నప్పుడు వాటిని రీ-స్టైల్ చేసి, "ఇదివరకెప్పుడూ ఇలా చూడలేదే" అనిపించేలా కొత్త లుక్ తీసుకురావాలి. నేను దీనిని పూర్తిగా నమ్ముతాను. ఒకవేళ మనం వాటిని వేసుకోకపోతే, ఆ దుస్తులను ఇష్టపడే ఇతరులతో పంచుకోవాలి. 'ఫాస్ట్ ఫ్యాషన్'ను కొనకండి. కొన్ని దుస్తులు మూడు ఉతుకులకే పాడైపోయి, చివరకు ల్యాండ్ఫిల్స్కు చేరి పర్యావరణానికి హాని చేస్తాయి. కాబట్టి మళ్లీ మళ్లీ ధరించగలిగే, మనకు కాన్ఫిడెన్స్ ఇచ్చే మంచి దుస్తులనే కొనాలి.


**నినాదం :** భారతీయ, అంతర్జాతీయ స్థాయిలో మీ ఫ్యాషన్ ఐకాన్ ఎవరు? ఒకరి పేరే చెప్పాలంటే?
**మంచు లక్ష్మి:** జెండేయా. ఆమె, లా రోచ్ కలిసి చేసే ప్రతి లుక్, స్టైలింగ్ నాకు చాలా ఇష్టం. అలాగే విక్టోరియా బెకమ్ హై ఫ్యాషన్, ఎలిగెన్స్ కూడా నాకు బాగా నచ్చుతాయి. భారతీయ డిజైనర్లలో అనామికా ఖన్నా డిజైన్స్ అంటే చాలా ఇష్టం. ప్రస్తుతం భారతీయ డిజైనర్లు అంతర్జాతీయ మార్కెట్లో సత్తా చాటుతూ, గ్లోబల్గా గుర్తింపు పొందుతుండటం నాకు ఎంతో సంతోషంగా ఉంది.

**నినాదం :** సోషల్ మీడియా వల్ల ఫ్యాషన్పై ఒత్తిడి, ప్రాధాన్యత పెరుగుతున్నాయని భావిస్తున్నారా?
**మంచు లక్ష్మి:** అవును. అదే సమయంలో ఫ్యాషన్పై పెద్దగా అవగాహన లేని వారికి కూడా సోషల్ మీడియా ద్వారా మంచి నాలెడ్జ్ వస్తోంది. నేను కూడా సోషల్ మీడియాలో "ఒకే స్కార్ఫ్ను ఐదు రకాలుగా ఎలా ధరించాలి?", "వైట్ షర్ట్ను వివిధ రకాలుగా ఎలా స్టైల్ చేయాలి?" వంటి టిప్స్, వీడియోలను చాలా సేవ్ చేసుకుంటాను. ఇటీవల నేను, నా కూతురు కలిసి రెండు షర్ట్ను ఎలా కనెక్ట్ చేసి డిఫరెంట్గా ధరించవచ్చో ట్రై చేశాం. ఇలా కొత్తగా ప్రయోగాలు చేయడం మాకు చాలా ఇష్టం.

**నినాదం :** ఫ్యాషన్లో ఒక రూల్ను బ్రేక్ చేయాలంటే ఏం చేస్తారు?
**మంచు లక్ష్మి:** కార్సెట్లలో లోపల ఎముకల లాంటి స్ట్రక్చర్స్ పెడతారు కదా.. అవి శరీరానికి గుచ్చుకునేలా ఉంటాయి. అలాంటివి అస్సలు వేసుకోను. అలాగే గుచ్చుకునే దుస్తులు, కెన్కెన్, చాలా బరువైన వర్క్, గుచ్చుకునే జర్దోజీ వర్క్ ఉన్న దుస్తులు నాకు నచ్చవు. నాకు, నా కూతురికి ప్రశాంతంగా, మెత్తగా, హాయిగా ఉండే దుస్తులే ఇష్టం.

**నినాదం :** మీ దృష్టిలో 'అందం' అంటే ఏమిటి? స్టైలా, ఆత్మవిశ్వాసమా, వ్యక్తిత్వమా?
**మంచు లక్ష్మి:** ఖచ్చితంగా వ్యక్తిత్వమే. నువ్వు వంద కోట్ల రూపాయల చీర కట్టుకుని, విలువైన నగలు వేసుకున్నా.. నీ భావన, నీ వ్యక్తిత్వం, నీలో దయాగుణం లేకపోతే అది అస్సలు ఆకర్షణీయంగా ఉండదు. అదే ఒక సాధారణ కాటన్ చీర కట్టుకుని, మంచి పలకరింపుతో, మంచి మనసుతో ఉంటే.. అది వంద కోట్ల కంటే ఎక్కువ విలువైనదని నేను నమ్ముతాను.

**నినాదం :** హైదరాబాద్ నుంచి ముంబైకి షిఫ్ట్ అయ్యాక మీలో కనిపిస్తున్న మార్పు చాలామందికి స్ఫూర్తినిస్తోంది. దీని వెనుక ఉన్న రహస్యం ఏమిటి?
**మంచు లక్ష్మి:** మనం ఎప్పుడూ ఒకేలా, ఒకే చోట ఉండిపోయినప్పుడు మనలో మనమే మార్పు తీసుకురావాలి. మన భారతీయుల్లో చాలామంది "ఇంతటితో చాలు" అని నిరాశపడిపోతుంటారు. మనకు ఉన్నది ఒకటే జీవితం. "ఇది చాలు" అని అనుకుంటే దేవుడు కూడా "సరే.. వీరికి ఇదే చాలు" అని వదిలేస్తాడు. కానీ "నాకు ఇది సరిపోదు. నేను ఇంకా మెరుగ్గా, ఇంకా బలంగా తయారవ్వాలి" అని అనుకోవాలి. నాకు ఒక కూతురు ఉంది. ఆమెకు మొదటి స్ఫూర్తిని నేనే. నన్ను చూసి తను నేర్చుకుంటుంది. నేను కేవలం ఒక కూతురిని పెంచడం లేదు.. ఒక లీడర్ను పెంచుతున్నాను. తను లీడర్ కావాలంటే ముందు నేను తనకు మార్గదర్శకంగా నిలవాలి. అందుకే తల్లిగా, నటిగా, ఎన్జీవో నడిపే వ్యక్తిగా.. నేను చేసే ప్రతి పనిలో వంద శాతం అంకితభావంతో ఉంటాను. లేకపోతే అసలు ఆ పని చేయను.



**నినాదం :** చాలా మంది స్కూళ్లను దత్తత తీసుకుంటున్నారు, పిల్లల చదువుకు సహాయం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇంకా ఏం చేయాలనుకుంటున్నారు?
**మంచు లక్ష్మి:** నేను చేయగలిగింది నిరంతరం చేస్తూ ఉండటానికి, నాకు ప్రాణం ఉన్నంతవరకు ఆ ఓపికను దేవుడు ఇవ్వాలని కోరుకుంటాను. నేను అనుకున్నదానికంటే చాలా ఎక్కువగా 'టీచ్ ఫర్ ఛేంజ్' ద్వారా సాధించానని అనిపిస్తుంది. అదే మీరు నా యాక్టింగ్, నా సినిమాల గురించి అడిగితే.. నేను అంతగా సంతోషంగా ఉన్నానని చెప్పలేను. కానీ 'టీచ్ ఫర్ ఛేంజ్' విషయానికి వస్తే చాలా సంతృప్తిగా ఉన్నాను. ఒక స్కూల్లో ప్రారంభమైన 'టీచ్ ఫర్ ఛేంజ్' ఇప్పుడు తెలంగాణలో దాదాపు 30 వేల పాఠశాలలకు చేరింది. ఒక ప్రభుత్వ పాఠశాలలో జరిగిన పేరెంట్-టీచర్ మీటింగ్ ద్వారా ఒక తల్లిని, ఒక టీచర్ను కలిపిన స్థాయి నుంచి ఈ ప్రయాణం మొదలైంది. ప్రస్తుతం 325 పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్రూమ్స్ ఏర్పాటు చేశాం. వెయ్యికి పైగా పాఠశాలల్లో వాలంటీర్ ప్రాతిపదికన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆర్వో వాటర్, బాత్రూమ్స్, భవన నిర్మాణ పనులు, ల్యాప్టాప్స్, కంప్యూటర్ ల్యాబ్స్ వంటి అనేక కార్యక్రమాలు కూడా చేస్తున్నాం. నా టీమ్ గురించి నేను ఎంతో గర్వపడుతున్నాను. ఒక్కోసారి మన జీవితంలో మన పర్పస్ ఏంటో తెలియనప్పుడు 'టీచ్ ఫర్ ఛేంజ్' గురించి, ఆ పిల్లల గురించి ఆలోచిస్తే.. "దీని కోసమే కదా మనం పుట్టింది! ఇంతమందికి మనం సహాయపడగలుగుతున్నాం" అనిపిస్తుంది. నేను దీనికి 'లక్ష్మి మంచు ఫౌండేషన్' అని పేరు పెట్టుకోలేదు. చేసిన పనే మాట్లాడాలని అనుకున్నాను. అది ఇప్పుడు బిగ్గరగానే మాట్లాడుతోంది.

**నినాదం :** 'టీచ్ ఫర్ ఛేంజ్'లో ఇంకా ఎలాంటి మార్పులు తీసుకురావాలనుకుంటున్నారు?
**మంచు లక్ష్మి:** ప్రతి సంవత్సరం "ఇంకేం చేయొచ్చు?" అని ఆలోచిస్తాం. బీఈడీ కాలేజీలకు వెళ్లి అక్కడి నుంచి వాలంటీర్లను తీసుకురావాలనే ఆలోచన బాగా వర్కవుట్ అయింది. కాలేజీల ద్వారా 100 మందికి పైగా వాలంటీర్లను తీసుకురాగలిగాం. ఎవరైనా మంచి ఐడియాలతో వస్తే మేము తప్పకుండా వింటాం. ఏ ఎన్జీవోతోనైనా కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఎందుకంటే చాలా ఎన్జీవోల దగ్గర ఫండ్స్ ఉంటాయి. కానీ మారుమూల గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉండదు. మేము ఘట్కేసర్, ఘట్కండల్, యాదాద్రి జిల్లాలోని మారుమూల గ్రామాలకు కూడా వెళ్తున్నాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని దూర ప్రాంతాలకు కూడా మాకు అందుబాటు ఉంది.

**నినాదం:** ఇతర రాష్ట్రాలకు విస్తరించే ఆలోచన ఉందా?
**మంచు లక్ష్మి:** మేము ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో ఉన్నాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటకలోనూ సేవలు అందిస్తున్నాం.

**నినాదం :** మీ రాబోయే ప్రాజెక్టులు ఏమిటి?
**మంచు లక్ష్మి:** రెండు తెలుగు సినిమాలు చేశాను. ఒక తమిళ సినిమా కూడా చేశాను. అలాగే అమెజాన్లో రాబోయే ఓ షో కోసం సిద్ధమవుతున్నాను.

వారసత్వం ఆమెకు పరిచయాన్ని ఇచ్చింది.. కానీ గుర్తింపును మాత్రం ఆమె తనదైన ప్రతిభతో, ఆలోచనలతో, ఆత్మవిశ్వాసంతో సంపాదించుకున్నారు. నటిగా తెరపై కనిపించినా, ఫ్యాషన్లో తనదైన శైలిని చాటినా, తల్లిగా బాధ్యతను నిర్వర్తించినా, 'టీచ్ ఫర్ ఛేంజ్' ద్వారా వేలాది మంది పిల్లల జీవితాల్లో మార్పు తీసుకొచ్చినా.. ప్రతి అడుగులోనూ లక్ష్మీ మంచు వ్యక్తిత్వమే కనిపిస్తుంది. ఆమె మాటల్లో చెప్పాలంటే.. "ఇది చాలు" అని ఆగిపోవడం కాదు.. ఇంకా మెరుగ్గా ఎదగాలి. అదే ఆమె ప్రయాణానికి సారాంశం. వారసత్వం ఇచ్చిన పేరును దాటి, తన ఆలోచనలు, ఆచరణతో సొంత గుర్తింపును నిర్మించుకున్న లక్ష్మీ మంచు ప్రయాణం.. నేటి మహిళకు ఒక స్ఫూర్తిదాయకమైన సందేశం.

ఇంటర్వ్యూ
గుంపుల ఇందిరా ప్రియదర్శిని యాదవ్
బ్యూరో చీఫ్ నినాదం



Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787